అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 344 | బుధవారం | 04-06-2025 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00


# ప్రధాని మోదీకి ఇండియా లేఖ

పహల్గామ్ అనంతర పరిణామాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని 16 విపక్ష పార్టీల నేతల విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే డిమాండ్ రోజు రోజుకూ బలపడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మంగళవారం ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే అంశంపై 16 పార్టీల నాయకులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీలు మంగళవారం ఢిల్లీలో భేటీ అయ్యాయి. పహల్గామ్ దాడి, ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్, భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదన పాకిస్థాన్ కాల్పుల్లో సరిహద్దు ప్రాంతాల్లో పౌరుల మరణం వంటి వరుస సంఘటనలను చర్చించడానికి పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చాల్సిన అవసరముందని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు చెప్పారు. పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌కు కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచామని, ఇప్పుడు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలన్న తరువాయి 2లో

## బనకచర్లను ఒప్పుకోబోం

- ప్రాజెక్టును అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం
- కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం
- నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరాం
- మీడియా 'చిట్‌చాట్'లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు తాము చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తనతో కలిసిన కొందరు జర్నలిస్టులతో మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్ అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని, ఈ ప్రాజెక్ట్ నిర్మించకుండా అడ్డుకోవాలని ఆయనను కోరామన్నారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర జలశక్తి మంత్రికి లేఖలు రాసినట్లు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఒప్పుకోబోమని, త్వరలోనే తమ కార్యాచరణను ప్రకటిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## ఐపిఎల్ విజేత బెంగళూరు

18 ఏళ్ల నిరీక్షణకు తెర



12

పహల్గామ్ ఉగ్రదాడికి ముందే భారత్‌పై

## విషం చిమ్మిన పాక్ ఆర్మీ చీఫ్

సిడిఎస్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వెల్లడి

వెయ్యి కోతలతో భారత్‌ను రక్తసిక్తం చేయాలనేది పాక్ అనుసరిస్తున్న విధానం అని మండిపాటు



**పుణే :** పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు ముందు నుంచే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీం మునీర్ భారతదేశం, హిందువులకు వ్యతిరేకంగా 'విషం చిమ్మారు' అని, తాత్కాలిక నష్టాలకు వృత్తిపరమైన సైనికులు ఏమాత్రం ప్రభావితం తరువాయి 2లో





పదేళ్లలో తలసరి ఆదాయం రెట్టింపైతే

## ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదు

సిపిఐ జనగామ జిల్లా మహాసభలో కూనంనేని సాంబశివరావు

03

మిస్ వరల్డ్ పోటీలపై

## ఆరోపణలు రుజువు చేయాలి

లేకపోతే బిఆర్ఎస్ నేతలు నడిరోడ్డుపై ముక్కు నేలకు రాయాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్



ప్రజాపక్షం/హైదరాబాద్

"మిస్ వరల్డ్–2025 కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన ఒక్కో అందాల భామకు 30 తులాల బంగారం ప్రభుత్వం ఇచ్చిందని, చౌమహల్లా ప్యాలెస్‌లో ఒక్కొక్కరికి రూ.లక్ష భోజనం పెట్టి దుబారా చేశారని, మిస్‌వరల్డ్ ప్రోగ్రాంకు రూ.200 కోట్లకుపైగా ఖర్చు చేశారని" బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీశ్‌రావు చేసిన ఆరోపణలు రుజువు చేయాలని.. లేని పక్షంలో తరువాయి 2లో






# ప్రపంచం
WORLD NEWS

## విశ్వాస ఓటుకు పోలాండ్ ప్రధాని సిద్ధం

**వార్సా :** పోలాండ్ దేశం నూతన రాజకీయ వాస్తవాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం పార్లమెంటులో విశ్వాస పరీక్షను కోరనుందని పోలాండ్ ప్రధాన మంత్రి డొనాల్డ్ టస్క్ తెలిపారు. తన రాజకీయ మిత్రపక్ష సభ్యుడు, లిబరల్ వార్సా మేయర్ ఇటీవల అధ్యక్ష ఎన్నికల్లో సంప్రదాయవాద అభ్యర్థి కారోల్ నావోక్కీ చేతిలో ఓటమి పాలైన నేపథ్యంలో మంగళవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. వార్సాలో జరిగి క్యాబినెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన అధ్యక్షుడు వచ్చినందున తాము నూతన రాజకీయ వాస్తవికతను ఎదుర్కొంటున్నామని, కానీ, రాజ్యాంగం, మన విధులు, పౌరుల ఆకాంక్షలు మారలేదని తెలిపారు. టస్క్ ప్రభుత్వానికి సంబంధించిన రోజువారీ నిర్ణయాలు తీసుకుంటుందని, అయితే అధ్యక్షుడికి చట్టాలను వీటో చేసే అధికారంతో పాటు, విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసే అధికారం ఉంటుంది. కాబట్టి నావరోక్కీ అధ్యక్షుడిగా గెలుపొందడంతో టస్క్‌కు తన ఐరోపా అనుకూల ఎజెండాను ముందుకు తీసుకెళ్ళడం కష్టం గా మారనుంది. అత్యంత సంక్లిష్టమైన కూటమికి ప్రధాని టస్క్ నేతృ త్వం వహిస్తున్నారు. నిజానికి పార్లమెంటరీ ఎన్నికలు 2027 చివరలో జరగనున్నాయి. కొందరు రాజకీయ ప్రత్యర్థులు టస్క్‌ను దిగిపోవాలని కోరుతున్నారు.

### ఆహారం కోసం వెళ్తున్న వారిపై ఇజ్రాయెల్ కాల్పులు

# 27 మంది దుర్మరణం



మృతుల్లో ముగ్గురు చిన్నారులు , ఇద్దరు మహిళలు

పరిస్థితులు చూస్తుంటే చావటమే మేలు : గాజావాసులు ఆవేదన

**రఫా :** మానవత్వాన్ని మరిచి గాజాలో పాలస్తీనా వాసులు ఆకలిలో మలమలలాడుతూ చనిపోయేలా చేస్తున్న ఇజ్రాయెల్ మరింత దారుణానికి ఒడిగడుతోంది. అంతర్జాతీయ సమాజం నుంచి వస్తున్న విమర్శలతో తమ ఆధీనంలో ఉన్న మిలిటరీ జోన్‌లలో ఆహారాన్ని పంపిణీ చేసే సహాయ కేంద్రాలకు వెళ్తున్న పాలస్తీనావాసులపై ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరుపుతున్నారు. సైన్యం వైపు వస్తున్నారనే కుంటి సాకులతో పౌరులపై కాల్పులు జరిపే దాష్టీకానికి పాల్పడుతున్నారు. సహాయ పంపిణీ కేంద్రాల వద్దకు వెళ్తున్న పాలస్తీనా వాసులపై ఇజ్రాయెల్ సైనికులు మంగళవారం జరిపిన కాల్పులలో 27 మంది మరణించారు. గడిచిన మూడు రోజుల్లో ఇలాంటిది ఇది మూడవ ఘటన అని పాలస్తీనా వైద్య అధికారులు,ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.నిర్దేశిత మార్గాన్ని విడిచి, తమ బలగాల వైపు సమీస్తుండగా, హెచ్చరికగా కాల్పులు జరిపినా కొంత మంది అనుమానిత వ్యక్తులు ముందకు రావడంతో వారిపై కాల్పులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలియజేసింది. ఇజ్రాయెల్ మిలిటరీ జోన్‌లో ఇజ్రాయిల్, అమెరికా మద్దతుతో నిర్వహిస్తున్న సహాయ పంపిణీ కేంద్రం వద్ద ఈ కాల్పులు జరిగాయి. ఈ నూతన విధానాన్ని ఐక్య రాజ్యసమితి తిరస్కరించింది. ఇది గాజాలో పెరిగిపోతున్న ఆకలి సంక్షోభాన్ని పరిష్కరించకపోగా, ఇజ్రాయెల్ ఆ సహాయాన్ని ఆయుధంగా వాడుకుంటుందని తెలిపింది. మంగళవారం జరిగిన కాల్పుల్లో క్షతగాత్రులకు సంబంధించిన నివేదికలను పరిశీలిస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఆదివారం, సోమవారం నాడు తమ బలగాలవైపు సమీపిస్తున్న వారిపై హెచ్చరికగా కాల్పులు జరిపామని తెలుపగా, పాలస్తీనా వైద్య అధికారులు కాల్పుల్లో 34 మంది చనిపోయారని చెప్పారు. పౌరులుపై కాల్పులు జరిపారనడాన్ని లేదా వారిని సహాయ కేంద్రాలకు రాకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలను సైన్యం తిరస్కరించింది. సహాయ కేంద్రాలను నిర్వహిస్తున్న గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్(జిహెచ్‌ఎఫ్) ప్రతినిధులు మాట్లాడుతూ తమ వద్ద ఎలాంటి హింస చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. అయితే, మంగళవారం నాడు పంపిణీ కేంద్రానికి సమీపంలో జరిగిన కాల్పుల్లో పౌరులు ఎవరైనా చనిపోయారా అనే అంశంపై సైన్యం దర్యాప్తు చేస్తున్నదని తెలిపారు. కాగా,ఆహారం కోసం సహాయ కేంద్రాలకు వెళ్తునవారిపై గత ఎనిమిది రోజులుగా ఇజ్రాయెల్ జరిపిన కాల్పుల్లో 102 మంది మరణించారని పాలస్తీనా అధికారులు చెబుతున్నారు.

**'ఎట్లాగైనా చనిపో-వడం ఖాయం'**

దక్షిణాది నగరం రఫాలో జిహెచ్‌ఎఫ్ పంపిణీ కేంద్రాలకు కిలోమీటర్ దూరంలో కాల్పులు జరిగాయి. ఆ ప్రాంతమంతా ఇజ్రాయెల్ మిలిటరీ జోన్‌గా ప్రకటించారు. అక్కడికి జర్నలిస్టులను కూడా అనుమతించడం లేదు. రఫా నగర నిర్వాసితుడు 50 సంవత్సరాల యాస్సర్ అబూ లుబ్దా మాట్లాడుతూ మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు కాల్పులు ప్రారంభమయ్యాయని, అనేక మంది చనిపోవడం లేదా గాయపడడాన్ని తాను చూసానని తెలిపారు. ఖాన్ యూనిస్ నగరానికి చెందిన మహిళ నీమా అల్ –ఆరజ్ మాట్లాడుతూ ఇజ్రాయెల్ కాల్పులు విచక్షణారహితమైనవని, తాను సహాయ పంపిణీ కేంద్రం వద్దకు చేరుకునే వరకు అక్కడ ఏమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అమరులు మరో వైపు క్షతగాత్రులు ఉన్నారని, అక్కడి నుంచి తాను వెళ్ళిపోనని, ఏ విధంగానైనా తాము చనిపోవడం ఖాయమని బాధతో అన్నారు. మరో సాక్షి రషా అల్ నహల్ మాట్లాడుతూ అన్ని వైపుల నుంచి తుపాకుల కాల్పులు జరిగాయని, తాను డజన్‌కు పైగా మృతదేహాలను లెక్కపెట్టానని, అనేక మంది రోడ్డుపై గాయపడి ఉన్నారని తెలిపారు. తాను సహాయ కేంద్రం వద్దకు చేరేసరికి అక్కడ ఏమీ లేదని వాపోయారు. అక్కడ నేలపై పడి ఉన్న పాస్తా, చిరిగిన సంచుల్లో మిగిలిన బియ్యాన్ని ఆమె ఏరుకున్నారు. దీని కంటే చావటం మేలు అని, తమ ఎడల జరుగుతున్నది చూస్తుంటే చావే గౌరవప్రదంగా ఉంటుందని అన్నారు. ఐక్యరాజ్య సమితి మానవహక్కుల హైకమిషనర్ కార్యాలయ అధికార ప్రతినిధి కాల్పుల్లో 27 మంది మరణించారని జెనీవా పాత్రికేయులకు నిర్ధారించారు. మరణించిన వారిలో ముగ్గురు పిల్లలు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు నాస్సెర్ ఆసుపత్రిలోని నర్సింగ్ హెడ్ మహ్మద్ సఖ్ర్ తెలిపారు. పాలస్తీనా ప్రజలకు ఎదుట దారుణమైన ప్రత్యామ్నాయాలు మిగిలాయి. ఒకటి ఆకలితో చావటం లేదా సహాయ కేంద్రాల వద్దకు ఆహారం కోసం వెళ్ళేటప్పుడు కాల్పుల్లో మరణించటం అని యుఎన్ మానవ హక్కుల హైకమిషనర్ అధికార ప్రతినిధి వోల్కర్ తుర్క్ అన్నారు.

### భారత్‌తో వాణిజ్య ఒప్పందం

# ఎంతో దూరం ఉండబోదు

అమెరికా వాణిజ్య మంత్రి



**వాషింగ్టన్ :** భారత్–అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం ఎంతో దూరంలో ఉండబోదని ఆశించవచ్చని, దీని కోసం ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు. తాను ఈవిషయంలో ఆశావాదిగా ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశ సుంకాలు అత్యంత రక్షణవాదంతో ఉన్నాయని భావిస్తున్నారని, అనేక వస్తువులపై 100 శాతం సుంకాలు విధించిందని అన్నారు. వాటిని సముచిత స్థాయికి తీసుకురావాలని, అలా చేస్తే మంచి వాణిజ్య భాగస్వాములం అవుతామని, ఇవన్నీ కూర్చొన్ని మాట్లాడుకోవచ్చని, పెద్దగా ఇబ్బంది కలిగించే అంశాలు కావని చెప్పారు. అమెరికా– ఇండియా స్ట్రాటర్జిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సోమవారం లుట్నిక్ కీలకోపన్యాసం చేస్తూ లుట్నిక్ అన్నారు. భారతదేశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాగా మెచ్చుకుంటారని, గౌరవిస్తారని, ఇరు దేశాలకు సంయుక్తంగా గొప్ప సంబంధాలు ఉండబోతున్నాయని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్ట్ లుట్నిక్ అన్నారు. భారతీయుల హృదయాంతరాలలో పట్టుదల, గాఢమైన వాంఛ ఉందని, అందుకే దేశ ఆర్థిక వ్యవస్థ ముందకు సాగుతోందని అన్నారు.భారతదేశం అత్యంత అసాధారణ ఆర్థిక వ్యవస్థలలో ఒకటి అని తమ అధ్యక్షుడు ట్రంప్ 'అమెరికా ఫస్ట్' అని ఆలోచిస్తారే తప్ప , 'అమెరికా ఓన్లీ(అమెరికా మాత్రమే)' లేదా 'అమెరికా ఎక్స్‌క్లూజివ్(అమెరికా ప్రత్యేకం)' అని అనుకోరని తెలిపారు. ముందు ఆయన ఇంటిని చక్కదిద్దుకోవడం ద్వారా బలంగా, ధృడంగా ఉండబోతున్నారని, ఆ తరువాత మిత్రులను చూసుకుంటారని చెప్పారు. ఆయన తప్పకుండా భారతదేశాన్ని కూడా జాగ్రత్తగా చూసుకుంటారని, ఆయన భారతదేశాన్ని గాఢంగా ప్రశంసిస్తారని, గౌరవిస్తారని, మన మధ్య గొప్ప సంబంధాలు ఉండబోతున్నాయని అన్నారు. భారతదేశంలో తయారీరంగాన్ని మరింత ప్రోత్సహిస్తారా? అని అడిగిన ప్రశ్నకు లుట్నిక్ స్పందిస్తూ తాము అమెరికాకు అడ్వాన్స్ తయారీరంగం తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు జవాబిచ్చారు.

## పాకిస్థాన్ జైలు నుంచి 216 మంది ఖైదీల పరారీ



**కరాచీ :** పాకిస్థాన్‌లో భూకంపం కారణంగా ముందు జాగ్రత్త చర్యగా జైలును ఖాళీ చేయిస్తుండగా తలెత్తిన గందరగోళంలో 216 మంది ఖైదీలు జైలు నుంచి తప్పించుకున్నారు. ఈ సందర్భంగా ఒక ఖైదీ చనిపోగా, ముగ్గురు పారామిలిటరీ ఫ్రాంటియర్ కోర్ సిబ్బంది, జైలు సిబ్బంది ఒకరు గాయపడ్డారు. కరాచీలోని మాలిర్ జైలులో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు జియో న్యూస్ తెలిపింది. జైలు అధికారుల వివరణ ప్రకారం తప్పించుకున్న వారిలో 86 మంది ఖైదీలను తిరిగి పట్టుకున్నారు. గడిచిన 24 గంటల్లో కరాచీలో అనేక మార్లు భూకంపం సంభవించింది. ప్రకంపనల కారణంగా బ్యారక్‌ల నుంచి 600 మంది ఖైదీలను బైటికి తీసుకువచ్చినట్లు జైలు సూపరింటెండెంట్ అర్షద్ షా తెలిపారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న గందరగోళంలో 216 మంది తప్పించుకున్నారని ఆయన చెప్పారు. ఇది లఅత్యంత తీవ్రమైన ఘటన అని సింధ్ ప్రాంత హోం మంత్రి జియా ఉల్ హసన్ లంజార్ అన్నారు. తప్పించుకున్న ఖైదీల వివరాలను గుర్తించామని, వారి నివాసాలు, చుట్టు పక్కల ప్రాంతాలలో దాడులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మాలిర్ జైలులో ఘటన జరిగిన సమయంలో 6 వేల మందికి పైగా ఖైదీలు ఉన్నారు.

### భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య

# పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావరవ్

**మాస్కో :** భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా ఇరు దేశాల మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావరవ్ అన్నారు. పాకిస్తాన్ పర్యటను వెళ్ళిన ప్రధాన మంత్రి ప్రత్యేక సహాయకుడు సయ్యద్ తారిఖ్ ఫతేమీతో సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపినట్లు 'టాస్' వార్తా సంస్థ పేర్కొంది. ద్వైపాక్షిక సహకారం, ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతపై చర్చ జరిగింది. పాకిస్థాన్– భారత్ మధ్య పరిస్థితులపై పాకిస్థాన్ వైఖరిని ఫతేమీ తెలియజేశారు.న్యూఢిల్లీ, ఇస్లామాబాద్ మధ్య పరస్పర విశ్వాస స్థాయిని పెంపొందించుకునేందుకు ప్రత్యక్ష చర్చలు అవసరమని రష్యా వైపు నుంచి తెలిపాము''ని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రాథమికంగా ఐక్యరాజ్య సమితి, షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఒ)కు అనుగుణంగా అంతర్జాతీయ నమూనాలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలను బలోపేతం చేయాల్సిన ప్రాధాన్యతను ఉభయ పక్షాలు అంగీకరించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉక్రేన్‌పై రష్యా రాకెట్ దాడి

ముగ్గురు మృతి : జెలెన్‌స్కీ

**కీవ్ :** ఉక్రేన్ పట్టణం సుమీలో మంగళవారం జరిగిన రష్యన్ రాకెట్ దాడులలో ముగ్గురు మరణించారని, అనేక మంది గాయపడ్డారని ఆ దేశ అధ్యక్షుడు వొలోదమిర్ జెలెన్‌స్కీ అన్నారు. టర్కీలోని ఇస్తాంబుల్‌నగరంలో రష్యా–ఉక్రేన్ దాడులలో పెద్దగా ముందడుగు పడలేదు. మరుసటి రోజే సుమీ నగరంపై దాడులు జరిగిందని, రష్యాకు యుద్ధాన్ని ఆపివేయాలనే ఆలోచన లేదని జెలెన్‌స్కీ ఆరోపించారు. అంతర్జాతీయ ఒత్తిడి లేకుండా, అమెరికా, ఐరోపా, ప్రపంచంలో అధికారం ఉన్న ప్రతి ఒక్కరూ నిర్ణయాత్మక చర్యలు తీసుకోకుంటే పుతిన్ కనీసం కాల్పుల విరమణకు కూడా అంగీకరించబోరని కవ్వింపు వ్యాఖ్యలు చేశారు.

# బడా పెట్టుబడిదారుల చేతుల్లో మోదీ కీలుబొమ్మ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు
ఎం.బాల్‌నర్సింహ్మా



ప్రజా ఉద్యమాలకు సిద్ధంకండి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** బడాపెట్టుబడిదారుల చేతుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కీలుబొమ్మగా మారారని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా ఆరోపించారు. మంగళవారం సిపిఐ నాగర్‌కర్నూల్ పట్టణశాఖ సమావేశం కొట్ర శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు వచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఊదలగొట్టే ఉపన్యాసాలు ఇస్తూ ప్రజలను భ్రమలలో ముంచుతున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బడా పెట్టుబడిదారి పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా అప్పజెప్పడం జరిగిందన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు లక్షలకోట్ల రూపాయలను మాఫీ చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయమంటే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటదని సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనడం రైతులపై ప్రేమ ఎంత ఉందో దేశప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్. ఆనంద్, మండలపార్టీ కార్యదర్శి మర్యాదవెంకటయ్య, పట్టణ కార్యదర్శి గోపిచారి, పట్టణ సహాయ కార్యదర్శి కొత్తరామస్వామి, నాయకులు ఆనంద్, సుధాకర్, ఆంజనేయులు, జమీర్, నాగయ్య పాల్గొన్నారు.

సిపిఐ తాడూరు మండల పరిధిలోని గుంతకోడూరు గ్రామంలో శాఖ మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు వార్ల వెంకటయ్య హాజరై మాట్లాడుతూ వంద సంవత్సరాలుగా భారతదేశంలో పేద ప్రజల అభివృద్ధి కోసం తారతమ్యాలులే ని సమ సమాజం కోసం అలుపెరుగని పోరాటంచేసిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. మహాసభ అనంతరం నూతన కార్యదర్శిగా ఏకాంబరం గౌడ్, సహాయ కార్యదర్శులు గా కొంగరి శ్రీనివాసులు, రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాడూరు మండలకార్యదర్శి కుతుబుద్దిన్, డిహెచ్‌పిఎస్ జిల్లాప్రధాన కార్యదర్శి బండి లక్ష్మిపతి, చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాజిపేటలో :** సిపిఐ తిమ్మాజిపేట మండల 18వ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాల్‌నర్సింహ్మా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడి వంద సంవత్సరాలైందని అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏరోజు అధికారంలో లేకున్నా పేదలకు పదిలక్షల ఎకరాల భూమిని పంచిన ఏకైక పార్టీ అన్నారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట మండల కార్యదర్శి ఎండి. ఖాజ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శివశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివకృష తదితరులు పాల్గొన్నారు.

## పాక్ ఆర్మీ చీఫ్ (మొదటి పేజీ తరువాయి)

కాబోరని, ఆ తరహా ఎదురుదెబ్బల కంటే మొత్తం ఫలితాలే ముఖ్యమైనవి అని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్)జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. మంగళవారం నాడు పుణేలోని సావిత్రీభాయి పూలే యూనివర్సిటీలో 'భవిష్యత్తు యుద్ధాలుయుద్ధ క్షేత్రాలు' అంశంపై జరిగిన ఒక కార్యక్రమంలో జనరల్ చౌహాన్ ప్రసంగించారు. పాకిస్థాన్ వెయ్యి కోతలతో రక్తసిక్తం చేసే విధానాన్ని భారతదేశం పట్ల అనుసరిస్తున్నదని, అయితే న్యూఢిల్లీ మాత్రం ఆపరేషన్ సిందూర్ ద్వారా సీమాంతర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పూర్తిగా ఒక నూతన రెడ్‌లైన్‌ను గీసిందని అత్యున్నత సైనిక కమాండర్ అనిల్ చౌహాన్ తెలిపారు. ఆయన తన ప్రసంగంలో ఆపరేషన్ ప్రారంభ దశలో భారతదేశం వెల్లడించని సంఖ్యలో యుద్ధజెట్లను కోల్పోయిందని అంగీకరించినందుకు తనపై వచ్చిన విమర్శలను తిరస్కరించినట్లు వ్యక్తమైంది. 'మన వైపు నష్టాల గురించి నన్ను అడిగినప్పుడు నష్టాలు ఫలితాల కంటే ముఖ్యమైనవి కావని అన్నానని, నీవు ఏవిధంగా నడుచుకుంటున్నావనేదే ముఖ్యమైనది' అని ఆయన చెప్పారు. నష్టాల గురించి, సంఖ్యల గురించి అనేకసార్లు మాట్లాడటం సరియైనది కాదని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. యుద్ధంలో, ఎన్ని ఎదురుదెబ్బలు ఎదురైనప్పటికి కూడా మీరు మీ మనోధైర్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నష్టాలు ముఖ్యం కాదని, ఫలితాలే ముఖ్యమని సిడిఎస్ అన్నారు.రాజకీయాలు సహా యుద్ధంలోని వివిధ అంశాలను, హింస గురించి ఆయన ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్‌లో కూడా ఆ తరహా రకమైన రాజకీయాలు సమాంతర దృగ్విషయంగా సంభవిస్తున్నాయి అన్నారు. జనరల్ చౌహాన్ ప్రస్తావించారు. భారతదేశాన్ని వెయ్యి కోతలతో రక్తసిక్తం చేయాలనే దృక్పథాన్ని ఇస్లామాబాద్ కలిగిఉన్నదని చెప్పారు. పహల్గామ్ దాడి సమయంలో బాధితుల పట్ల పాకిస్తాన్ మద్దతు ఉగ్రవాద మూకలు చూపించిన క్రూరత్వమే అందుకు ఉదాహరణ అన్నారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం వెనక పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ఆపివేయాలని, పాకిస్థాన్ భారతదేశంపై ఉగ్రవాద చర్యలను ఉసిగొల్పేందుకు స్థావరాలను నిర్వహించకూడదనేదే ముఖ్యోద్దేశమని సిఓడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ చెప్పారు.ఉగ్రవాదం, బెదిరింపుల నీడలో భారతదేశం జీవించేందుకు ఎప్పుడూ సిద్ధపడదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ తన ప్రతిదాడిని 48గంటల పాటు నిర్వహించాలనుకుందని, కానీ 8గంటల్లోనే ఆగిపోయిందని చెప్పారు.భారతదేశం మొత్తం విధానం గురించి జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడుతూ 'మేం ఉగ్రవాదాన్ని నీటితో అనుసంధానించాం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒక కొత్త మార్గాన్ని గీసాం' అని అనిల్‌చౌహాన్ చెప్పారు.

## నేతన్న పథకానికి మార్గదర్శకాలు విడుదల : మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేత కార్మికుల సంక్షేమానికి ప్రజా పాలన ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 48.00 కోట్లు కేటాయించినట్లు తుమ్మల తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు, అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్టంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ. 18,000, అనుబంధ కార్మికులకు రూ. 6,000 అందించడం జరుగుతుందన్నారు. దీంతో దాదాపు 40,000 మంది చేనేత, అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేయడం జరుగుతుందని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను, నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చునన్నారు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని ఆయన తెలియజేశారు.ఈ పథకం నేత, అనుబంధ కార్మికులందరికీ వర్తిస్తుందన్నారు. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు, ప్రీలూమ్, ప్రిపరేటరి ప నులైన డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులని తెలిపారు. నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా (ఏప్రిల్ నుండి సెప్టెంబర్ అక్టోబర్ నుండి మార్చి) నేత కార్మికునికి రూ. 9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేయడం జరుగుతుంది. అయితే మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లైతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత , అనుబంధ కార్మికులకు అందించబడుతుందని మంత్రి తెలిపారు.

# 'ఇండియా' లేఖ

(మొదటి పేజీ తరువాయి)

తమ డిమాండ్‌ను అంగీకరించాలని ప్రతిపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. కాగా సమావేశంలో కాంగ్రెస్ జైరామ్ రమేష్, దీపేందర్ హుడా, తృణమూల్ కాంగ్రెస్ డెరెక్ ఓ బ్రెయిన్, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) మనోజ్ ఝా, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) రామ్‌గోపాల్ యాదవ్ , శివసేన (యుబిటి) సంజయ్ రౌత్ ఈ సమావేశానికి హాజరయ్యారు. 'పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పదహారు పార్టీలు ప్రధానమంత్రికి లేఖ రాశాయి. ప్రభుత్వం పార్లమెంటుకు బాధ్యత వహిస్తుంది. పార్లమెంటు ప్రజలకు బాధ్యత వహిస్తుంది' అని సమావేశం తర్వాత ఓ బ్రెయిన్ విలేకరులతో అన్నారు. ఈ లేఖను త్వరలో ప్రధానమంత్రి కార్యాలయానికి పంపుతామని ప్రతిపక్ష నాయకులు తెలిపారు. ప్రత్యేక సమావేశాన్ని డిమాండ్ చేయడానికి ఉమ్మడి ప్రయత్నం చేయాలని పార్లమెంటరీ పార్టీ నాయకులు మాత్రమే కాకుండా, ఆయా పార్టీల అధ్యక్షులు కూడా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) నాయకుడు అఖిలేష్ యాదవ్, టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ, డిఎంకె నేత టిఆర్ బాలు, శివసేన (యుఎన్‌టి) నేత అరవింద్ సావంత్ సంతకం చేసిన వారిలో ఉన్నారు. డింకె, నేషనల్ కాన్ఫరెన్స్, సిపిఐ,(ఎం), సిపిఐ(ఎం), ఐయుఎంఎల్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్‌పి), విదుతలై చిరుతైగల్ కచ్చి (విసికె), కేరళ కాంగ్రెస్, ఎండిఎంకె, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ కూడా ఈ లేఖపై సంతకం చేసిన వారిలో ఉన్నారు. కరుణానిధి జయంతి సందర్భంగా డిఎంకె సమావేశంలో పాల్గొనలేకపోయింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా ఇదే డిమాండ్‌ను లేవనెత్తుతూ ప్రధానమంత్రికి విడిగా లేఖ రాస్తామని పేర్కొంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌సిపి) గతంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి డిమాండ్ లేదని చెప్పినప్పటికీ, ఈ విషయంపై తాను ఎన్‌సిపి నాయకులతో మాట్లాడుతానని రౌత్ అన్నారు. 'శరద్ పవార్ సాహెబ్ కూడా మాతో ఉన్నారు. ఈ లేఖలో ఫ్లోర్ లీడర్ల సంతకాలు ఉన్నాయి... సుప్రియా సులే జీ దేశం వెలుపల ఉన్నారు. నేను ముంబైకి వెళ్ళినప్పుడు ఆయనతో మాట్లాడతాను' అని ఆయన అన్నారు. కాంగ్రెస్, అన్ని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వానికి మద్దతు ఇచ్చాయని హుడా అన్నారు. ప్రత్యేక సమావేశానికి డిమాండ్‌ను తాము లేవనెత్తామని, ఇది చాలా ముఖ్యమన్నారు. పాకిస్తాన్‌ను ఒంటరిగా చేయడానికి, ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ఎలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి?, ముందుకు సాగే మార్గం ఏమిటి? పార్లమెంటులో చర్చించాని ఆయన అన్నారు. భారత ప్రజలను చీకటిలో ఉంచుతున్నారని రాంగోపాల్ యాదవ్ అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమని, ఆపరేషన్ సిందూర్‌పై మొత్తం ప్రపంచానికి చెబుతున్నారు, కానీ పార్లమెంటును, భారత ప్రజలను చీకటిలో ఉంచుతున్నారు అని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రజాప్రతినిధులకు తెలియజేయానికి జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా ఈ డిమాండ్‌ను లేవనెత్తారు. ఉగ్రవాదంపై భారతదేశ వైఖరిని తెలియజేయడానికి వివిధ దేశాలకు వెళ్లిన బహుళ పార్టీల ప్రతినిధులు దేశానికి తిరిగి వచ్చిన తర్వాత, జూన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించాలని తృణమూల్ కాంగ్రెస్ సూచించింది. ఏప్రిల్ 22న కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దాడిలో 26 మంది మరణించారు. దీనికి ప్రతి చర్యగా భారత సాయుధ దళాలు పాకిస్తాన్, పిఓకె లోపల ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయి. తరువాత ఆపరేషన్ సిందూర్ కింద పొరుగు దేశంలోని వైమానిక స్థావరాలపై బాంబు దాడి చేశాయి.

# ఆరోపణలు రుజువు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నడిరోడ్డుపై ముక్కు నేలకు రాయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బిఆర్‌ఎస్ నేతలకు డిమాండ్ చేశారు. మిస్‌వరల్డ్‌పై ప్రతిపక్ష పార్టీలు చేసిన పలు ఆరోపణలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సచివాలయం వేదికగా మంగళవారం విలేకరుల సమావేశంలో వివరణ ఇచ్చారు. జూపల్లి మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ ఫోగ్రాంపై బిఆర్‌ఎస్ పార్టీ నేతలు చేసిన ఆరోపణలపై చర్చిండానికి తెలంగాణ భవన్‌కు, అబిడ్స్ నడి బొడ్డుకు రావడానికైనా తాను సిద్దంగా ఉన్నానని బిఆర్‌ఎస్ నేతలకు ఇజ్జత్ ఉంటే రావాలని ఆయన సవాల్ విసిరారు. ఇందుకోసం తాను వారం రోజుల గడువు కూడా ఇస్తున్నానన్నారు.కాళేశ్వరం విచారణ,ఫోన్‌ట్యాపింగ్,ఈకార్ రేస్ తదితర కుంభకోణాలపై బిఆర్‌ఎస్ నేతలపై వచ్చిన ఆరోపణలను పక్కదారి పట్టించేందుకే ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వంపై అబద్దపు ప్రచారానికి తెర లేపారని జూపల్లి ఆరోపించారు. మిస్‌వరల్డ్ పోటీల ద్వారా తెలంగాణ టూరిజం ప్రపంచ వ్యాప్తంగా వెళ్లిందని, దీన్ని ఓర్వలేకనే బిఆర్‌ఎస్ నేతలు కావాలని అబద్దాలను ప్రచారం చేసే పనిలో పడ్డారని అభిప్రాయపడ్డారు.

**సున్నా ఖర్చుతో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం..**

మిస్‌వరల్డ్2025 కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ టూరిజం ప్రమోషన్ (ప్రచారం) జరగడం గర్వంగా ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.200 కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని బిఆర్‌ఎస్ నేతలు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. మిస్‌వరల్డ్‌కు ప్రభుత్వం రూ.31 కోట్లు ఖర్చు పెట్టిందని.. స్పాన్సర్ల రూపంలో ప్రభుత్వానికి ఇప్పటి వరకు రూ.21 కోట్లు తిరిగి వచ్చాయని, ఇంకా రూ.10 కోట్లకు పైగా స్పాన్సర్ల నుంచి రావాల్సి ఉందని.. ఈ లెక్కన పైసా ఖర్చు లేకుండా ప్రపంచ దేశాలన్ని కూడా తెలంగాణ వైపు చూసే విధంగా చేశామన్నారు. దీన్ని బిఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేక తలతోకలేని ఆరోపణలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ టూరిజం ప్రమోషం కోసం బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.115 కోట్లు ఖర్చు పెట్టిందని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంత ఖర్చు పెట్టినా ఒక్క ఉద్యోగం కూడా సంపాదించలేక పోయిందన్నారు.

**ఇబ్బంది పెట్టారనేది అవాస్తవం..**

మిస్ ఇంగ్లాండ్‌ను ఇబ్బంది పెట్టారనేది వాస్తవం అయితే మిగతా 108 మంది పోటీదారులు చివరి వరకు ఉండేవారు కాదన్నారు. మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన అందగత్తెలు చివరిదాకా చాలా హ్యాపీగా ఉన్నారని చెప్పారు. ఏమీ జరగని దానికి ఏదో జరిగినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాళ్లను ఇబ్బంది పెడితే.. మళ్లీ మళ్లీ తెలంగాణకు రావాలని ఉందని ఎందుకు చెబుతారని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ విన్నర్‌గా గెలిచిన థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాతకు తెలంగాణ ఆతిథ్యం, ఇక్కడి పర్యాటక ప్రాంతాలు నచ్చాయని చెప్పారు. తన జీవితంలో హైదరాబాద్‌ను మరువ.. అవకాశం వస్తే మళ్లీ ఇక్కడికి వస్తానని ఓపల్ సుచాత చెప్పారన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... మిస్ వరల్ పోటీలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతంగా నిర్వహించడాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు.ప్రజల దృష్టి మరల్చేందుకు అనవసర విషయాలను లేవనెత్తుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంఎల్‌ఎ రాజేష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ హన్మంతు జండగే, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 10 నుంచి గాంధీభవన్‌కు మంత్రులు

### నేడు గాంధీభవన్‌లో ప్రారంభించనున్న మంత్రి పొన్నం



ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో ఈనెల 10వ తేదీ నుంచి మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం పునఃప్రారంభం కానుంది. కొన్ని అనివార్య కారణాల వల్ల కొద్దిరోజులుగా ఆగిపోయిన ముఖాముఖి కార్యక్రమాన్ని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చొరవ తీసుకుని మళ్ళీ ప్రారంభించనున్నారు. బుధవారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని తిరిగి పారంభిస్తారు. గాంధీభవన్‌లోని ఇందిరా భవన్‌లో ఈనెల 10వ తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ముఖాముఖీ జరుగుతుంది. మొదటగా రోజుకు ఇద్దరు కార్పొరేషన్ చైర్మన్‌లు, తర్వాత ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఇతర ప్రజాప్రతినిధులు వరుసగా అందుబాటులో ఉంటారని టిపిసిసి ఒక ప్రకటనలో తెలియజేసింది.

**పదేళ్లలో తలసరి ఆదాయం రెట్టింపైతే**

# ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదు?

**సిపిఐ జనగామ జిల్లా మహాసభలో కూనంనేని సాంబశివరావు**



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : పదేళ్లలో దేశ తలసరి ఆదాయం రెట్టింపు అయితే ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు ఎందుకు ఆగలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత తలసరి ఆదాయం రెట్టింపు అయితే ప్రజల కొనుగోలుశక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రాలేదని, రైతుల పంటకు గిట్టుబాటు ధర ఎందుకు లభించడం లేదని ప్రశ్నించారు. సిపిఐ జనగామ జిల్లా 4వ మహాసభలు నర్మెట మండల కేంద్రంలో మంగళవారం ప్రారంభం అయ్యాయి. బస్టాండ్ నుండి వినాయక గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్.రాజారెడ్డి అధ్యక్షత వహించగా కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదీ అధికారంలోకి రాకముందు కేవలం రూ.50 లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు రూ.160లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మోదీ వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతుందని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీకి బాస్ ట్రంప్ అని, అందుకే ఆయన చెప్పినట్లు వింటున్నారని మండిపడ్డారు. దేశ సంపద కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దనే కేంద్రీకృతం అయ్యిందన్నారు. దేశంలో కార్పొరేట్, పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వం ప్రజల సంపదను ధారాదత్తం చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలుస్తారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుకు కేవలం రూ.119 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెనకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లను ఆర్థిక, సాంఘీక, రాజకీయరంగాలలో, ఉద్యోగాలు, కాంట్రాక్టులలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐని స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలకు కేంద్రంగా ఉన్న జనగామ గడ్డపై ఎర్ర జెండా ఎగరవేయాలని, కష్టజీవులకు అండగా ఉంటు మరిన్ని పోరాటాలు చేయాలన్నారు.

**జనగామ జిల్లా అభివృద్ధి కోసం సమరశీల పోరాటాలు : తక్కెళ్లపల్లి**

జనగామ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సమరశీల పోరాటాలు నిర్వయిస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఖాజీపేటలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన కోచ్ ఫ్యాక్టరీకి నేటికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తిచేయాలని, గుడిసెలు వేసుకొని ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు కట్టించాలన్నారు. సిపిఐ జనగామ జిల్లా 4వ మహాసభల సందర్భంగా నర్మెట మండల కేంద్రంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. నర్మెట బస్టాండ్ నుండి పురవీధుల గుండా సభాస్థలి వినాయక పంక్షన్ హాల్ వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో ముందు భాగంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆదిసాయన్న, ఆకుల శ్రీనివాస్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, జిల్లా సమితి సభ్యులు కావటి యాదగిరి, జువారి రమేష్, పాతూరి రమేష్, జీడీ ఎల్లయ్య, బోనగిరి కుమారస్వామి, నీల కనకయ్య, చామకూర యాకుబ్, మోటే శ్రీశైలం, గుగులోతు సఖి, సముద్రాల రాజు తదితరులు పాల్గొన్నారు.






తెలంగాణ సాయుధ పోరాట రథసారథి, స్వాతంత్ర్య సమరయోధుడు
పద్మవిభూషణ్
కామ్రేడ్ రావి నారాయణరెడ్డి
118వ జయంతి



04.06.2025 (బుధవారం), ఉదయం 10-30 గంllలకు
రావినారాయణరెడ్డి ఆడిటోరియం, లోటస్‌పాండ్, బంజారాహిల్స్

సభాధ్యక్షులు : శ్రీ కందిమళ్ళ ప్రతాపరెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్
అతిథులు : శ్రీ కె. జానారెడ్డి, మాజీ మంత్రివర్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు
డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి
శ్రీ బి.వి.రాఘవులు, సిపిఐ(ఎం) పోలిట్‌బ్యూరో సభ్యులు
శ్రీ కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి
శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎం.పి.
శ్రీ ఎం. కోదండరాం, శాసనమండలి సభ్యులు
శ్రీ కె.శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్, తెలంగాణ మీడియా అకాడమీ

ప్రజానాట్యమండలి కళాకారులచే విప్లవ గీతాలు ఆలపించబడును
అందరూ ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయవలసిందిగా ఆహ్వానిస్తున్నాం
తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు
9849080212, 9490952646


# ఆగస్టు 15నాటికి భూసమస్యలు పరిష్కారం

**భవిష్యత్‌లో భూ పంపిణీకి నియోజకవర్గ అసైన్‌మెంట్ కమిటీలు : డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క**

**మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి ఖమ్మం జిల్లా మొలుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే – రెవెన్యూ సదస్సు ప్రారంభించిన భట్టి**



ప్రజాపక్షం/ఎర్రుపాలెం : భవిష్యత్‌లో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి మిగులు భూములను, ఇంటి పట్టాల పంపిణీ, భూ పంపిణీ కార్యక్రమాన్ని తిరిగి ప్రవేశ పెడుతున్నట్లు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. దేశానికే తలమానికంగా భూ భారతి రెవెన్యూ చట్టాన్ని ప్రజా ప్రభుత్వం రూపొందించిందని, పేద ప్రజలకు చుట్టంగా భూ భారతి చట్టం పనిచేస్తుందన్నారు. ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే, రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్‌ఎ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ డాక్టర్ జ్యోతిబుద్ధ ప్రకాశ్, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌లతో కలిసి మంగళవారం ప్రారంభించారు. డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ నక్షాలు లేకుండా మన రాష్ట్రంలో 413 గ్రామాల్లో దశాబ్దాల కాలంగా పాలన సాగుతోందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కష్టాలు పడుతున్నారని, భూ భారతి చట్టం ద్వారా ఆ గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సర్వే చేయించి సరిహద్దులను నిర్ణయించి ఇబ్బందులు లేకుండా చేయాలని పైలెట్ ప్రాజెక్టు కింద మొలుగుమాడు గ్రామాన్ని ఎంపిక చేశామని తెలిపారు. దేశ చరిత్రలో చాలా అరుదుగా భూ భారతి వంటి అద్భుతమైన చట్టాలు వస్తాయని అన్నారు. 2020 సంవత్సరంలో వచ్చిన ధరణి చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయన్నారు. భూభారతి చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ అమ్మకాలు, కొనుగోలు వివరాలు అప్‌డేట్ చేస్తూ భూ రికార్డులను మాన్యువల్‌గా రాసి పంచాయతీ కార్యాలయంలో అతికించడం జరగుతుందని అన్నారు. అర్హులైన వారికి భూ భారతి చట్టం ద్వారా పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టాపాస్ పుస్తకాల్లో ఉన్న తప్పుల కారణంగా రైతులు చాలా ఆందోళనకు గురవుతున్నారని, గ్రామంలో ఉన్న తక్కువ విస్తీర్ణం భూమికి కూడా కొన్ని చోట్ల పట్టాల్లో వేల ఎకరాలు ఉన్నట్లు ఉందని తెలిపారు. భూముల ధరలు పెరిగిపోవడం వల్ల అన్నదమ్ములు, స్నేహితుల మధ్య కూడా గొడవలు జరిగి హత్యల వరకు దారితీస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వేగవంతంగా సర్వే చేసి నిఖార్సైన రికార్డులు తయారు చేస్తామని తెలిపారు. భూముల రికార్డులు సక్రమంగా నిర్వహించేందుకు రైతులు, భూ యజమానులు నుంచి టోకెన్ అమౌంట్ సేకరించాలని మంత్రి సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 3 నుంచి 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో తహశీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ బృందం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు. భూ హక్కులకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న గతంలో సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండేదని, నేడు రెవెన్యూ కోర్టు ద్వారా అధికారుల వద్ద వాటిని పరిష్కారం లభిస్తుందని అన్నారు. గతంలో ఇందిరమ్మ ప్రభుత్వం 25లక్షల ఎకరాల అసైన్డ్ భూములు వరకు పేదలకు పంచిందని, అటువంటి భూములను ధరణి పేరుతో లక్షలాది ఎకరాలను తారుమారు చేశారని, వీటిలో జరిగిన అక్రమాలను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తామని, అసైన్డ్ భూహక్కుదారులకు కూడా పూర్తి హక్కులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రైవేట్ వ్యవస్థల్లో మొదటి విడత కింద రాష్ట్రంలో 6వేల మంది సర్వేయర్లకు శిక్షణ అందించి వారికి లైసెన్స్ జారీ చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జెడి ప్రసన్నలక్ష్మి, ఆర్అండ్‌బి ఎస్ఇ యాకుబ్, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాసులు, ఎర్రుపాలెం తహశీల్దార్ ఉషాశారద, పాల్గొన్నారు.

**రాజీవ్ యువ వికాసం రుణాల మంజూరు వాయిదాతో**

# నైరాశ్యంలో నిరుద్యోగ యువత

(ఇ.చంద్రశేఖర్)



హైదరాబాద్ : రాజీవ్ యువ వికాసం రుణాల మంజూరు పత్రాల పంపిణీని వాయిదా వేయడం, రుణ పరిమితిని రూ.4లక్షల నుంచి లక్ష రూపాయలకు తగ్గిస్తున్నట్లు వార్తలు వస్తుండడంతో నిరుద్యోగ యువతలో నైరాశ్యం ఆవహించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన రుణాలను అందుకుంటామని ఎదురుచూసిన యువత నిరాశకు గురైంది. గత పదేళ్లలో నిరక్ష్యానికి గురైన నిరుద్యోగ యువతకు (ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు, ఇబిసిలు) స్వయం ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలుత సుమారు రూ.6250 కోట్లతో దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడం లక్ష్యంగా నిర్ణయంచింది. మొదటి దశలో జూన్ మాసంలో 85,000 మంది లబ్ధిదారులకు రూ.650.00 కోట్లు సబ్సిడీ, రెండోదశలో జూలైలో 1,00,000 మందికి, రూ.1,000,00 కోట్ల సబ్సిడీ, మూడవ దశలో ఆగస్టులో 1,00,00 మందికి రూ.1,50,000 సబ్సిడీ, నాలుగవ దశలో సెప్టెంబర్‌లో రూ.1,00,234 మంది లబ్ధిదారులకు రూ.1,60,050 కోట్ల సబ్సిడీ, మొత్తం 4,93,234 మంది లబ్ధిదారులకు, రూ.6250 కోట్ల సబ్సిడీ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అన్ని రాజకీయ పార్టీలు కూడా అభినందించాయి. యువత నుంచి భారీ స్పందన లభించింది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, లబ్ధిదారుల గుర్తింపు తదితర అన్ని ప్రక్రియలు సవ్యంగానే సాగుతున్నాయి. అయితే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో నిరుద్యోగ యువతకు నామమాత్రంగా రుణాలు ఇవ్వడం, నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోవడం, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు రాని వారు అధికంగా ఉండడంతో వారంతా కలిసి భారీ సంఖ్యలో 16,23,764 మంది స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం రుణాల పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రూ.6250 కోట్లతో మొత్తం 4,93,234 మందికి స్వయం రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించగా, అనూహ్యంగా 16 లక్షలకు పైగా దరఖాస్తులు రావడంతో ప్రభుత్వం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య ఇంత భారీగా ఉండగా, ఇంకా దరఖాస్తులు చేసుకోని వారు ఎంత మంది ఉంటారోనని, తద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం ఎంత తీవ్ర స్థాయిలో ఉందో అర్థమౌతుందనే చర్చ కూడా కొనసాగుతున్నది. ఇదిలా ఉండగా, ఇంత మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.6250 కోట్లు ఏ మాత్రం సరిపోవని, అదనంగా రెండింతల నిధులు అవసరమని ప్రభుత్వ, బ్యాంకుల అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్ళాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో రాజీవ్ యువ వికాసానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని ముఖ్యమంత్రి దృష్టికి మంత్రులు తీసుకువచ్చారు. ఫలితంగా "పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలి. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలి. ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దు.

ఈ అంశంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుందాం" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో ఉపాధిని పొందడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని గంపెడాశలు పెట్టుకున్న నిరుద్యోగులు ఒక్క సారి గాదిగాలు పడ్డారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రుణాల మంజూరు పత్రాలను అందుకుంటామని ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులు నిరాశ చెందారు. పైగా రూ.4 లక్షల రుణ పరిమితిని లక్ష రూపాయలకు పరిమితం చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు వార్తలు వస్తుండడంతో రూ.4 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్న యువతను అసంతృప్తికి గురిచేస్తున్నది. తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 5వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో రాజీవ యువ వికాసం రుణాల పంపిణీపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని నిరుద్యోగ యువత కోరుతున్నది.

## రాగల రెండురోజులు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాగల రెండురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పారు.

**గులాబీ నేతల్లో కొత్త టెన్షన్**
**పార్టీలో పరిణామాలతో గందరగోళం**

# ఎవరితో 'టచ్'లో ఉందాం?

(కె.సంతోష్ కుమార్)



హైదరాబాద్ : బిజెపిలో బిఆర్ఎస్ విలీనం అనే చర్చ నుంచి బయట పడేందుకు బిఆర్ఎస్ తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తోంది. విలీనం అనే పదం 'కారు' జోరుకు బ్రేకులు వేయడమే కాదు, గులాబీ శ్రేణులను ఆయోమయానికి గురి చేస్తోంది. ఒక వేళ గులాబీ పార్టీ విలీనమైతే తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటనే కొత్త చర్చకు తెర తీసింది. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత బిజెపిలో బిఆర్ఎస్ విలీనం అంశాన్ని ప్రాస్తవించడంతో బిఆర్ఎస్ వర్గాల్లో సర్వత్రా అనుమానాలు, అయోమయానికి దారితీసింది. విలీనం ఉండబోదని మాజీ మంత్రి హరీశ్ రావు, మరి కొంత మంది ముఖ్య నాయకులు స్పష్టం చేస్తున్నప్పటికీ క్యాడర్‌లో మాత్రం నమ్మకం కలగడంలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బిఆర్ఎస్‌లో ఆధిపత్యపోరు గులాబీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'బిఆర్ఎస్ వరంగల్ సభ'తో పార్టీలో జోష్ నింపింది. ఈ సభ ద్వారా ఆ పార్టీ శ్రేణులకు భవిష్యత్‌పై కొంత ఆశలు చిగురించాయి. కానీ 'ఆపరేషన్ సక్సెస్..పేషంట్ డెడ్' అన్న చందంగా వరంగల్ సభ మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కవితకు వారంతా దూరం?**

కెసిఆర్‌కు కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బుధవారం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాకు ఎవరు పాల్గొంటారనే అంశం ప్రస్తుతం బిఆర్ఎస్‌లో చర్చనీయంశంగా మారింది. ఇప్పటికే కవిత కార్యక్రమాలకు చాలా మంది నాయకులు దూరంగా ఉంటున్నారు. ఇది వరకు బిఆర్ఎస్‌లో పార్టీ పదవులను,ఎంఎల్‌ఎ టికెట్లను, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఆశించే నాయకులు కవిత ఇంటి చుట్టూ తిరిగే వారు. ఇందులో చాలా మంది ఎంఎల్‌ఎ, ప్రజాప్రతినిధులుగా గెలిచిన తర్వాత కూడా కవిత వెంటే ఉన్నారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ నాయకులంతా కవిత వద్ద కనీసం కనిపించడం లేదు. కవిత వెంట వెళ్తే బిఆర్ఎస్‌తో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందనే భయం వారిని వెంటాడుతోంది. మరో వైపు కవిత వర్గం కూడా అటువంటి నాయకుల తీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కవిత వెంటే కొందరు ముఖ్యులు మాత్రమే ఉంటున్నారు.

**ఆ ముగ్గురిలో ఎవరితో టచ్‌లో ఉందాం?**

బిఆర్ఎస్‌లో కొందరు నాయకులు ఎవరి వెంట ఉండాలి.?, ఎవరికి నిత్యంటచ్‌లో ఉండాలి ? అనే అంశంపైన బిఆర్ఎస్ నాయకులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటి వరకు కవిత వెంట తిరిగి, ప్రస్తుతం ఆమెకు దూరంగా జరిగితే భవిష్యత్తులో మళ్లీ కవితకు బిఆర్ఎస్‌లో ప్రాధాన్యత పెరిగితే తమ పరిస్థితి ఏమిటనేది ఆ నాయకులకు పెద్ద సమస్యగా మారింది. మరో వైపు కెటిఆర్ వెంటే కొనసాగాలంటే, ముందుగా కెటిఆర్ కోటరిని దాటడం కొందరు నేతలకు ఆటంకంగా మారింది. అలాగని మాజీ మంత్రి హరీశ్‌రావుకు అటాచ్ అవుదామంటే బిఆర్ఎస్‌లో ఆయన పాత్రపైన కూడా రకరకాల అభిప్రాయాలు, అంచనాలు, అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి గందరగోళ,అయోమయ పరిస్థితులను తాము ఎన్నడూ ఎదుర్కొనలేదనే కొందరు నాయకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగానైన కెసిఆర్ కనీసం తెలంగాణ భవన్‌కు రాలేదు.పైగా గన్ పార్క్ వద్ద అమరులకు కూడా నివాళ్లు అర్పించలేకపోయారని, మరోవైపు కెటిఆర్ అమెరికాలో ఉన్నారని, ఇలాంటి అయోమయ పరిస్థితుల్లో తమ రాజకీయ భవిష్యత్తుపై గులాబీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు.


**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**
గూడెం గ్రామము, దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.

Rc.No.SSSD/132/2025. బహిరంగ వేలము ప్రకటన-5 తేది: 03.06.2025

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! మంచిర్యాల జిల్లా, దండేపల్లి మం॥, గూడెం గ్రామము యందలి శ్రీ సత్యనారాయణస్వామిదేవస్థానము వద్ద ఈ క్రింద తెలిపిన వేలము తేది: 12.06.2025 గురువారం రోజున మధ్యహ్నం గం. 2:00ల నుండి దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మరియు హాజరు సభ్యుల సమక్షములో దేవాలయ కార్యనిర్వహణాధికారిచే దేవస్థాన కార్యాలయమునందు బహిరంగ వేలము నిర్వహించబడును.

| క్ర.సం. | బహిరంగ వేలము వివరములు | ధరావత్తు సొమ్ము | కాల పరిమితి |
|---|---|---|---|
| 1. | టెంకాయలు అమ్ముకొను హక్కు | రూ. 1,00,000/- | తేది: 19.06.2025 నుండి తేది: 18.06.2026 వరకు |
| 2. | వంట చెరకు, పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | రూ. 50,000/- | తేది: 15.06.2025 నుండి తేది: 14.06.2026 వరకు |
| 3. | టీ, టిఫిన్స్ అమ్ముకొను హక్కు | రూ. 20,000/- | |

కావున ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి ఆధార్ కార్డు ఇచ్చి బహిరంగ వేలము పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాను. ఇట్టి వేలము పాట షరతులు వేలము పాటకు ముందు చదివి వినిపించబడును. ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు.
సం/- కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 2971-PP/CL/ADVT/1/2025-26, Date: 03-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నార్త్ ట్యాంక్స్ డివిజన్, హైదరాబాద్.
GHMC

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

| NIT Nos. | పనుల పేరు | ఇసివి మొత్తం (రూ.) | బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది / ఆఖరి తేది |
|---|---|---|---|
| NIT No. 03/EE/NTD/2025-26, తేది: 03.06.2025 | మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, గాజులరామారం గ్రామం యొక్క మద్దెల కుంట ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో ఆక్రమణదారులు పడేసిన చెత్తను తొలగించడం | రూ. 39,33,129/- | 04.06.2025@ 11.00 A.M / 13.06.2025@ 11.00A.M |
| NIT No. 04/EE/NTD/2025-26, తేది: 03.06.2025 | రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, మదీనాగూడ గ్రామంలో పటేల్ చెరువు ఇన్లెట్ వద్ద తెగిపోయిన కట్ట భాగాన్ని పునరుద్ధరించడం మరియు బాక్స్ కల్వర్టు నిర్మాణం, | రూ. 38,11,433/- | 04.06.2025@ 11.00 A.M / 13.06.2025@ 11.00A.M |
| NIT No. 05/EE/NTD/2025-26, తేది: 03.06.2025 | రంగారెడి జిల్లా, ఉప్పల్ మండలం, నాచారంలోని హెచ్ఎంటి నాచారం సరస్సు వద్ద కట్ట పునరుద్ధరణ | రూ. 16,72,407/- | 04.06.2025@ 11.00 A.M / 13.06.2025@ 11.00A.M |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నార్త్ ట్యాంక్స్ డివిజన్, బుద్ధ భవన్, 3వ అంతస్తు, ఎం.జి.రోడ్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నార్త్ ట్యాంక్స్ డివిజన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 3002-PP/CL/ADVT/1/2025-26, Date: 03-06-2025

ప్రజాపక్షం
బుధవారం, 04 జూన్


# మోదీ 3.0 : తొలి సంవత్సరం

ప్రధాని నరేంద్ర మోదీ మూడవ టరం పదవీకాలంలో తొలి సంవత్సరం మే 9తో ముగుస్తుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బిజెపి దేశవ్యాప్తంగా వేడుకలకు సన్నద్ధమవుతోంది. ప్రభుత్వ ప్రధాన సాఫల్యాలను ప్రచారం చేసే బాధ్యత మంత్రులు, ఎంపిలకు అప్పగించబడింది. ఈ ఉత్సవాల నిర్వహణలో ఎన్‌డిఎ భాగస్వాములు కూడా పాలుపంచుకుంటున్నారు. ప్రధానంగా ఐదారు అంశాలపై ప్రచారం చేస్తారు. పహల్గాం టెర్రర్ దాడికి భారతసైన్యం జవాబు మోదీ నాయకత్వం, వక్ఫ్ సవరణ చట్టం, బి.ఆర్.అంబేద్కర్‌ను గౌరవిస్తున్న తీరు, ఒక దేశం–ఒకే ఎన్నికలు ప్రతిపాదన, ఆర్థికవ్యవస్థ పరిమాణం ప్రపంచదేశాల్లో నాల్గవ స్థానానికి చేరటం, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట పెరుగుదల. హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి విజయాలు వగైరా. మోదీ మూడవ ప్రభుత్వం బిజెపి మైనారిటీ ప్రభుత్వం, నితీశ్‌కుమార్, చంద్రబాబునాయుడుపై ఆధారపడి ఉందన్న విషయం ప్రజలు గుర్తు చేసుకోరాదనే రీతిలో మోదీ మొదటినుంచీ వ్యవహరిస్తున్నారు. పార్లమెంటులో బిజెపి సంఖ్యాబలం శక్తిమంతుడైన మోదీ నాయకత్వంలోనే 2019తో పోల్చితే 303 సీట్ల నుంచి 63 సీట్లు కోల్పోయింది. ఇండియా కూటమి ఎంపిల సంఖ్య 234కు పెరిగింది. అయితే బలం బలహీనతలను పరిగణలోకి తీసుకుంటే మోదీ మునుపటి ఏక పక్ష పాలనలాగే చకచకా ముందుకు సాగారు. ముందుగా నిర్ణయించిన 100 రోజుల కార్యక్రమంతో ప్రభుత్వాన్ని నడిపించారు. ఎప్పటివలె విదేశీయాత్రలతో తన ప్రతిష్టకు ఎన్నికలు కలుగజేసిన మచ్చ కనిపించకుండా చేసుకున్నారు. ఇంతలో వచ్చిన హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో కాషాయజెండా ఎగరటం ప్రజల దృష్టిలో ప్రతిష్టను కూడదీసింది. రెండోవైపున రానున్న బిహార్ ఎన్నికల దృష్ట్యా నితీశ్‌కుమార్‌కున్న అవసరాలు, ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియకు చంద్రబాబునాయుడు అధికంగా కేంద్రసహాయంపై ఆధారపడి ఉండటం నరేంద్రమోదీకి వ్యక్తిగతంగా కలిసి వచ్చింది. కాబట్టి ఈ సానుకూలతలను ఉపయోగించుకున్న నరేంద్రమోదీ ఎన్‌డిఎను పటిష్టం చేసుకోవటమే గాక, రెండోవైపున ఇండియా కూటమిలో బీటలు తెచ్చే వ్యూహాలు అమలు జరిపారు. గొప్పలు ప్రచారం చేసుకోవటానికి చాలా అంశాలుంటాయి. అయితే మెజారిటీ ప్రజల జీవితాలను నిరంతరం పీడించే ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు స్వల్ప ఎగుడుదిగుళ్లతో హెచ్చుస్థాయిలో కొనసాగుతూనే ఉన్నాయి.

పాకిస్థాన్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, టెర్రరిస్టు దాడులు బిజెపికి ఎప్పుడూ ఉపయోగపడుతూనే ఉంటాయి. గతంలో పుల్వామా దాడిలాగే ఏప్రిల్‌లో పహల్గాంలో ముష్కరులు హిందూ టూరిస్టులను ఏరికోరి చంపిన ఘోరకలి, అనంతరం సైనికచర్య 'ఆపరేషన్ సిందూర్' మోదీ బృందం రాజకీయ ప్రచారానికి ఆయుధాలైనాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, బెంగాల్, బిహార్ ఇలా అన్ని సభల్లోను మహిళలను సమీకరించి వారి సిందూరానికి రక్ష మోదీ అన్నంతగా ప్రచారం చేస్తున్నారు. పాక్ టెర్రరిజాన్ని ఎండగట్టడానికి విదేశాలకు పార్లమెంటరీ అఖిలపక్ష బృందాలను పంపారు. ఈవిధంగా పెంపొందించబడుతున్న జాతీయోన్మాదం చల్లబడకుండా వచ్చే సంవత్సరం ఆరంభంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల వరకూ కొనసాగించటం, రాజకీయ లబ్ధి పొందటం బిజెపి వ్యూహం. అయితే పాకిస్థాన్ –భారత్ మధ్య కాల్పుల విరమణ తానే సాధించానంటూ ట్రంప్ మోదీ అహానికి తూట్లు పొడుస్తున్నాడు. ఇది అంతర్జాతీయంగా , దేశంలో మోదీ అనుకూల ప్రచారంగా గాలి తీస్తున్నది.

ప్రతిపక్షాలకు జెపి వ్యతిరేకత ఒక్కటే సరిపోదు. 2024 ఎన్నికలకు ప్రతిపక్ష ఐక్యవేదికగా ఆవిర్భవించిన 'ఇండియా' కూటమి పొందికలో ఉన్న వైరుధ్యాలే పెద్ద బలహీనత. భాగస్వాముల్లో అత్యధికం ప్రాంతీయ పార్టీలు, వాటికి రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో ఉన్న వైరుధ్యం కూటమిలో సఖ్యతకు ఆటంకమవుతున్నది. ఆకాంక్షాపరులు ఎక్కువ మంది ఉన్నందున రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని అంగీకరించటానికి వారు సిద్ధంగా లేరు. రెండోవైపున, కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి బిజెపి ప్రతిపక్ష నాయకులను బెదిరించి లొంగదీసుకుంటోంది. గత పదేళ్లలో కేంద్ర ఏజెన్సీలు కనీసం 100 మంది ప్రతిపక్ష నాయకులపై దర్యాప్తు చేశాయి. వారిలో చాలామంది ఆ తర్వాత బిజెపిలో చేరారు. దర్యాప్తు ఎదుర్కొంటున్న 25 మంది ప్రతిపక్ష నాయకుల్లో 23మందిపై కేసులు ఉపసంహరణ జరిగింది. లేదా దర్యాప్తు నత్తనడకన నడుస్తోంది. ప్రతిపక్ష పార్టీల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ఎన్నికల తర్వాత ఎక్కడా వినిపించడం లేదు. కారణం తెలియదు. ఈ పరిస్థితుల్లో నరేంద్రమోదీ ప్రభుత్వం తమ సొంత ఎజెండాను ముందుకు నెడుతోంది. వక్ఫ్ సవరణ బిల్లు ఇందుకొక ఉదహరణ. లీగల్ చిక్కులన్నీ అధిగమించి 'ఒక దేశం–ఒకే ఎన్నికల' చట్టం కోసం శతధా ప్రయత్నిస్తోంది. బిజెపి ఎజెండాలోని మూడో ముఖ్యాంశం ''ఉమ్మడి పౌరస్మృతి''ని ఈ తరంలో మోదీ నెరవేర్చవచ్చు. తస్మాత్ జాగ్రత్త!

# యుద్ధభూమిలో అంతరిస్తున్న మతం


డాక్టర్ దేవరాజు మహారాజు

ఒకప్పుడు ప్రపంచంపై క్రైస్తవాన్ని బలవంతంగా రుద్దిన ఇంగ్లాండ్‌లో ప్రస్తుతం అక్కడ అది తగ్గుముఖం పడుతూ ఉంది. క్రైస్తవాన్ని పాటించే జనాభా శాతం అక్కడ వేగంగా మారిపోతూ ఉంది. ఒకప్పుడు అది పూర్తి క్రైస్తవ దేశం. ఇటీవలి కాలందాకా అక్కడ అరవై శాతం క్రైస్తవులు ఉండేవారు. ఆ శాతం కిందికి పడిపోయి, ప్రస్తుతం అక్కడ నలభై ఆరు శాతం మాత్రమే ఉన్నారు. ఏ మతాన్నీ పాటించని వారి సంఖ్య ఇంగ్లాండులో గణనీయంగా పెరుగుతూ ఉంది. ఇటీవల కాలంలో 25.2 శాతం ఉన్న మానవవాదుల శాతం, 37.2కు పెరిగింది. మరో పదేళ్లలో ఈ శాతం ఇంకా పెరిగే అవకాశాలున్నాయని పరిశీలకులు అంటున్నారు. అదే నిజమైతే, ఇంగ్లాండులో క్రైస్తవులు మైనార్టీలో పడిపోయే అవకాశం ఉంది. ఇలా చెప్పుకోవాలంటే మరో తాజా ఉదాహరణ ఉంది. క్రీస్తు జన్మ స్థలంలోనే క్రైస్తవం తగ్గుముఖం పడుతూ ఉంది.

రెండు వేల సంవత్సరాల క్రితం బెత్లెహామ్‌లో ఏసు క్రీస్తు జన్మించాడనీ, అక్కడి నుంచే ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవం వ్యాపించిందనీ ఒక అభిప్రాయం ఉంది. అది కూడా చాలా బలంగా ఉంది. అయితే ఆ బెత్లెహామ్ ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో కాకుండా పాలస్తీనా ఆక్రమించిన ప్రాంతంలో ఉంది. అక్కడి ప్రధానమైన చర్చిల తాళాలు – రెండు ముస్లిం కుటుంబాల దగ్గర ఉంటాయి. ఉదయం వచ్చి తెరవడం, మళ్ళీ రాత్రికి వచ్చి మూయడం వారే చేస్తారు. ఆ మధ్యకాలంలో అక్కడి ఆరు క్రైస్తవ వర్గాలు వంతుల వారిగా తమ ఆధ్యాత్మిక సేవల్ని కొనసాగించుకుంటూ ఉంటాయి. ఇది ఇలా ఉంటే, అక్కడ మరో విచిత్రం కూడా జరుగుతూ ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు బెత్లెహామ్‌కు వచ్చి, ఏసు జన్మస్థలాన్ని దర్శించుకుని వెళ్ళొచ్చు. వారికి వీసాలు సులభంగా దొరుకుతాయి కూడా! కానీ, స్థానికంగా ఉన్న క్రైస్తవులకే అక్కడి ప్రధాన చర్చిలలోకి అనుమతి లేదు. అది పాలస్తీనా ఆక్రమిత ప్రాంతం కాబట్టి, అక్కడ ఆ విషయంలో రాజకీయ కారణాలు పనిచేస్తూ ఉండొచ్చు. ఏసు నడయాడిన ప్రాంతం ఇజ్రాయెల్– పాలస్తీనా వివాదాల్లో, యుద్ధంలో నలుగుతూ ఉంది. ఇది జగద్విదితం !

బెత్లెహామ్‌లోని ఏసుక్రీస్తు జన్మస్థలమని భావిస్తున్న నేటివిటీ చర్చ్, జెరూసలేంలో ఏసును శిలువ వేశారని భావిస్తున్న చోట ఉన్న హోలీ సెపల్చర్ చర్చి – ఈ రెండూ క్రైస్తవుల ప్రధాన చర్చ్‌లు. ఈ రెండు చర్చ్‌ల తాళాలే అక్కడి రెండు ముస్లిం కుటుంబాల ఆధీనంలో ఉన్నాయి. ఈ రెండు చర్చ్‌ల మధ్య ఉన్న 'స్టార్ స్ట్రీట్స్' (వీధు)లన్నీ వేల ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసినవి. కాబట్టి, ఇప్పుడు అవి మరీ ఇరుకుగా, అసౌకర్యంగా అయిపొయ్యాయి. అమితమైన భక్తి శ్రద్ధలున్న వారు తప్ప, మామూలు వారు ఆ వీధుల్లో తిరగాలంటే ఇబ్బంది పడతారు. ఒక రకంగా ఇష్టపడరు. ఇవీ.. అక్కడి పరిస్థితులు. అయితే ఇప్పుడక్కడ క్రైస్తవానికి తీవ్రమైన విఘాతం కలిగింది. ఇజ్రాయెల్ ఏర్పడినప్పుడు అక్కడ క్రైస్తవుల జనాభా ఎనభైశాతంగా నమోదయింది. ఇప్పుడు అది పన్నెండు శాతానికి పడిపోయింది. ఏసు జన్మించాడని భావిస్తున్న చోటే క్రైస్తవం అంతరించి పోవడం ప్రపంచం ప్రత్యక్షంగా చూస్తూ ఉంది. అందుకు కారణాలు చాలా ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి కొన్ని ఇలా ఉన్నాయని పరిశీలకులు చెపుతున్నారు.

1. ప్రపంచవ్యాప్తంగా మతాల పట్ల ప్రజల్లో ఏర్పడిన విముఖత.
2. మతం నేపథ్యంలో వచ్చే పండుగలంటే ఆసక్తి లేకపోవడం – ఒక వేళ జరుపుకుంటున్నా, ఏదో ఒక ఫార్మాలిటీగా, యధాలాపంగా జరుపుకోవడం.
3. అక్కడి యువత మెరుగైన అవకాశాలకోసం యూరోప్, మధ్య ప్రాచ్య
దేశాలకు, కెనడా వంటి దేశాలకు వలస వెళ్ళడం జరుగుతూ ఉంది.
4. ఆక్రమణ, వలస, నిత్యం తనిఖీలతో స్థానికులు విసుగెత్తి పోతున్నారు.
5. పై కారణాల ప్రభావం అక్కడి జన జీవితం మీద ఒత్తిడి పెంచుతోంది. ఫలితంగా జనాభా తగ్గిపోతూ ఉంది.
6. క్రైస్తవుల సంఖ్య తగ్గిపోవడం వల్ల, అక్కడ క్రైస్తవం గడ్డురోజుల్ని ఎదుర్కొంటూ ఉంది.

క్రిస్టమస్ వచ్చిందంటే ప్రపంచవ్యాప్తంగా ప్రతి క్రైస్తవుడూ తన ఇంటిమీద ఒక నక్షత్రాన్ని (మోడల్) ప్రత్యేకంగా అలంకరించుకుంటాడు. రంగురంగులుగా అది వెలుగుతూ ఉండే విధంగా విద్యుత్ దీపాలు కూడా అలంకరించుకుంటాడు. కారణం ఏమంటే ఏసుక్రీస్తు జన్మించినపుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలిగింది అనే దానికి అది సంకేతం! అంతేకాదు, ఏసు తమ ఇంట్లోనే జన్మించాడని గర్వంగా ప్రకటించుకోవడానికి కూడా అది సంకేతం! ఆకాశంలో ఉండే నక్షత్రం తమకోసం ఏసుగా జన్మించాడని కూడా క్రైస్తవుల భావన! భావనలు సరే కానీ, ఏవైనా చారిత్రక ఆధారాలున్నాయా అంటే లేవు. రోమన్, ఈజిప్టు, గ్రీక్, మెసపటోమియా మొదలైన ప్రాచీన నాగరికత ల్లోని జానపద మత సాహిత్యంలో అద్భుత శక్తులను ప్రదర్శించే కల్పిత పాత్రల పుట్టినరోజు సామాన్యంగా డిసెంబర్ 25 అనే ఉంది. దాన్ని దృష్టిలో ఉంచుకుని, అనేక చర్చోపచర్చలు, తర్జనభర్జనల అనంతరం క్రీస్తు జీసస్ పుట్టిన రోజును కూడా డిసెంబర్ 25నే నిర్ణయించారు. అదే క్రిస్టమస్ అయ్యింది.

సాధారణ శకానికి ముందు పుట్టిన అరిస్టాటిల్, ప్లేటో వంటి వారి వివరాలు చరిత్రకు అందుతుండగా, దేవుడి కుమారుడు, పాపుల రక్షకుడు అని భావించే – ఏసుక్రీస్తు వివరాలు లభించక పోవడం విచిత్రంగా ఉంది. ఇక ఏసు చారిత్రక వ్యక్తి అని ప్రపంచానికి పరిచయం చేసిన వాడు జోసెఫస్ (Josephus) అని చెపుతున్నారు. కానీ, నిజంగానే ఆయన ఏసును చారిత్రక వ్యక్తి అని అన్నాడా? అనుమానమే! ఎందుకంటే అందుకు ఆధారాలే లేవు. Josephus మాత్రమేగాక, ఇంకా చాలామంది ఏసును చారిత్రక వ్యక్తి అని అన్నారని కొందరు బుకాయిస్తుంటారు. బుకాయింపు అని అన్నది ఎందుకంటే వారెవరూ తగిన ఆధారాలు చూపలేదు. పైగా వీరెవరూ ఏసుకు సమకాలీనులు కాదు, తర్వాత కాలంలో జీవించిన వారు. చాలామందికి తెలియని విషయమేమంటే – సాధారణశకం 354(సిఇ) దాకా 'క్రిస్టమస్' ఉనికిలో లేదు. అలాగే సాధారణ శకం 786 దాకా ప్రపంచ దేశాలలో ఎక్కడా క్రీస్తుపూర్వం/క్రీస్తుశకం అనే సంక్షిప్త రూపాలు వాడుకలో లేవు. (వీటిని మనం ఇప్పుడు BCE/CEగా వాడుతున్నాం) అమెరికాలోని కొన్ని క్రైస్తవ శాఖల్లో క్రిస్టమస్ జరుపుకోవడంపై సా.శ.1836కు ముందు నిషేధం ఉండేది. క్రిస్ట్‌మస్ జరుపుకోవడాన్ని తప్పుపట్టే క్రైస్తవ మత శాఖలు ఇప్పటికీ అక్కడక్కడా ఉన్నాయి. ఇలాంటి విషయాల గురించి ఎవరూ పెద్దగా మాట్లాడరు. క్రైస్తవులు కాని ఇతర మతస్థులు కూడా వేలం వెర్రిగా క్రిస్టమస్ జరుపుకుంటూ ఉంటారు. అయితే అది ఒక 'గెట్ టుగెదర్'గా సరదాగా గడపడం కోసం వినియోగిస్తారు.

ఇంతా చేస్తే క్రైస్తవంలో మహోన్నతమైన గొప్ప గొప్ప విషయాలు ఏమైనా ఉన్నాయా? అంటే ఇదిగో అవి ఇలా ఉన్నాయి. వారి పవిత్ర గ్రంథంలో దేవుడు చెప్పిన మాటలు:

1. నీ యజమానుని స్త్రీలను నీ కౌగిట చేర్చి, ఇశ్రాయేలు వారిని, యూదావారిని నీకు అప్పగించితిని... నీవు చూచుచుండగానే నేను నీ భార్యలను తీసి నీ చేరువ వానికి అప్పగించెదను. పగటియందు వాడు వారితో శయనించును. (2 సమూ. 8: 12)
2. వారి భార్యలను అన్యుల కప్పగింతును. వారు యహోవా వాక్యములను నిరాకరించిన వారు (ఇర్మియా 8:10) ఏమియూ మిగులకుండా వారి ఇండ్లను, పొలములను, వారి భార్యలను ఇతరులకు అప్పగింపబడెదరు (ఇర్మియా 6:12)
3. బైబిలు బహుభార్యత్వమును, వేశ్యావృత్తిని, దాసీలతో శయనాన్ని అంగీకరిస్తూ ఉంది.
4. దావీదు హితీయుడైన ఊరియా భార్య బత్షెబను ఇంటికి పిలిచి ఆమెతో సంభోగిస్తాడు.
5. దావీదు కుమారుడైన అబ్షాలోము చెల్లెలు తామరన్నామెను దావీదు మరో కుమారుడైన అమ్నోను బలవంతంగా అనుభవించి వెళ్ళగొట్టేస్తాడు.
6. సోలోమను – ఫరో కుమార్తెనే గాక, మరొక 700 మందిని భార్యలుగా, 300 మందిని ఉప పత్నులుగా చేసుకుంటాడు. అతడు సమస్తమైన వారికంటే జ్ఞానవంతుడు అంటున్నది బైబిలు.
7. (ఎస్తేరు 2:21; 12:14) ష్వేరోషను రాజుకు రోజుకొక కన్య సంభోగానికి కావాలి. ఆమె మళ్ళా ఎప్పుడైనా రాజు పిలిస్తే తప్ప, అలా ఒంటరిగా ఉండిపోవాల్సిందే –

ఇలాంటివి చెప్పే వాడిని దేవుడు – అని అనే కన్నా 'బ్రోకర్' అని అనడం బావుంటుంది కదా?

వారి పవిత్ర మతగ్రంథాల్లోని ఇలాంటి విషయాల్ని జీర్ణించుకుని కొందరు క్రైస్తవ బ్రిటీషు రచయితలు – భారతదేశం – మొగలుల పాలనలో ఉన్నప్పుడు నిరాధారమైన విషయాల్ని గ్రంథస్థం చేశారు. మొగలు చక్రవర్తులకు ఒక్కొక్కరికి వెయ్యి, పదిహేను వందలమంది భార్యలుంటారని, వారికి స్వేచ్ఛ ఉండదని, వారు భవనాల్లోనే మగ్గిపోతుంటారని, వ్యక్తిత్వం ఉన్న మనుషులుగా కాకుండా, స్త్రీలని కేవలం భోగ వస్తువులుగా చూశారని రాశారు. మొగలు రాజులు మద్యానికి, జూదానికి, స్త్రీలోలత్వానికి బానిసలని రాశారు. నిజాయితీగా నిజాల్ని నమోదు చేసిన ఆనాటి చరిత్రకారులు, ఆధునిక చరిత్ర పరిశోధకులు తేల్చిన విషయాలు వేరే విధంగా ఉన్నాయి – మొగల్ మహిళలు ఎవరూ అనైతిక చర్యలకు పాలుపడలేదని, చాలామంది స్త్రీలు విద్యావంతులని, కొందరు రచయిత్రులు కూడా అయ్యారని తేల్చి చెప్పారు. అంతేకాదు, అనుభవజ్ఞులైన మహిళలు పరిపాలనా వ్యవహారాలలో చక్రవర్తులకు సలహాలిచ్చేవారని, కొందరు అంతర్జాతీయ స్థాయిలలో వ్యాపారాలు సాగించారనీ పూర్తి ఆధారాలతో రుజువు చేశారు. ఓర్వలేనితనంతోనూ, ఎదుటి వారిని తక్కువ చేసి చూపాలని ప్రయత్నించే వారి రాతల్ని, ప్రచారాల్ని మనం పట్టించుకోగూడదు. నిదానంగా నిజాల్ని తవ్వి బయటికి తీసుకోవాలి!

ఒక కోతి సూర్యుణ్ణి మింగిన థియరీలు మనకు ఉండొచ్చు – కన్యగా సూర్యుడితో గర్భం దాల్చిన కుంతి కథ మన వారసత్వ సంపద కావొచ్చు – కానీ, వర్జిన్ మేరీకి జీసెస్ పుట్టడంలోనే మనకు తర్కం కావాలి! హాస్యంగా అనిపించినా ఇందులో నిజం ఉంది కదా? మతాలన్నీ ఒకే రకమైన కల్పనలతో పుట్టాయి.. పెరిగాయి. అందువల్ల, ఏ మతమూ ఎక్కువా కాదు, ఏదీ తక్కువా కాదు. 'వెధవాయిని నేను అని ఒకటంటే, నీకంటే ఎక్కువ వెధవాయిన్నేను' అని పోటీ పడుతున్నట్లుగా ఉంటాయి! మతాలన్నీ ఆధునికుడికి అర్థరహితమైనవి, పనికిరానివి. మతం ఆది మానవుడి భావన! సైన్స్ నేటి ఆధునిక మానవుడి ఆవిష్కరణ !!

– సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

# భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు జెండా ఆర్.ఎన్



హైదరాబాద్ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పునాదులు వేసిన నిర్మాతల్లో ఒకరుగా, నిజాం సంస్థానంలో రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు చేసి భారత యూనియన్‌లో కలిసేటందుకు నైజామును గద్దె దించాలని.. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన విప్లవ సేనాని రావి నారాయణరెడ్డి 118వ జయంతిని జరుపుకుంటూ వారు చేసిన త్యాగాలను స్మరించుకుందాం.

నాటి నిజాం నవాబు పాలనలోని హైదరాబాద్ రాష్ట్రంలో గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితులై.. వారి పిలుపుతో మొదటిసారిగా హరిజన సేవా సంఘాన్ని స్థాపించి దానికి రాష్ట్ర కార్యదర్శిగా 100కు పైగా హరిజన విద్యార్థులకు హాస్టల్ స్థాపించి అస్పృశ్యత నివారణకు, సహపంక్తి భోజనాలు నిర్వహించిన ప్రథముడు ఆర్ ఎన్ గారు. గాంధీజీ విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ ఖాదీ వస్త్రాలను ధరించాలని పిలుపుతో చర్కా ఉద్యమం, ఖాదీ బండారాలు నెలకొల్పిన ప్రథమ గాంధేవాది. 1930 జాతీయ సత్యాగ్రహంలో పాల్గొని' మాకొద్దీ తెల్ల దొరతనమని' గొంతు కలిపిన దేశభక్తుడు.

1930లో ఏర్పాటైన ఆంధ్ర మహాసభ నిర్మాతల్లో ఒకరు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిర్మాతల్లో ప్రముఖుడు, ప్రథమ సత్యాగ్రహి. జైలు శిక్షలు అనుభవించిన ప్రథమ తెలంగాణ నాయకుడు. ఆంధ్ర మహాసభ అధ్యక్షుడిగా నిజాం నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా, పౌర హక్కుల కోసం గళం విప్పిన ప్రథమ రాజకీయవేత్త రావి నారాయణ రెడ్డి.

నిజాం రాచరిక పాలనలో వారికి తాబేదారులుగా ఉన్న భూస్వామ్య దొరల, జాగీర్దారి, దేశ్‌ముఖ్‌ల ఫ్యూడల్ విధానాన్ని వ్యతిరేకిస్తూ తిరుగుబాటు జెండా ఎత్తి.. దున్నేవానికి భూమి కావాలని నినాదం ఇచ్చిన ప్రథమ వ్యక్తి.. ముందుగా 500 ఎకరాల సొంత భూమిని పేదలకు పంచిన త్యాగశీలి. తెలంగాణలో వినోబాబావే చేపట్టిన 'భూదానోద్యమము'కి మార్గదర్శి.

నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థ పోవాలని సాయుధ సమరానికి పిలుపునిచ్చిన విప్లవకారుడు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్ష ఉప నాయకుడిగా, నాయకుడిగా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా ప్రతిభను చాటిన పార్లమెంటేరియన్, సంఘ సేవకుడు, కళాభిమాని, నిరాడంబరుడు, నిస్వార్ధ ప్రజా సేవకుడు, రాజకీయాలకు అతీతంగా అందరి అభిమానం, గౌరవం పొందిన ప్రజానాయకుడు.

జీవితమంతా దేశం కోసం అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం అంకితం చేసిన త్యాగశీలి. ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, భారత ప్రభుత్వము (మరణానంతరం) అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ పొందిన సమరయోధుడు రావి నారాయణరెడ్డి.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని దేశ స్వతంత్ర పోరాటంలో భాగంగా గుర్తించాలని.. నైజాం వ్యతిరేక ఉద్యమంలో పోరాడి అమరులైన.. జైలు పాలై ఉరిశిక్షలు పొందిన కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవించాలని.. వారికి స్వాతంత్ర సమరయోధుల పింఛను అందించాలని కృషి చేసిన మహానుభావుడు..

తెలంగాణ సాయుధ పోరాట 40వ వార్షికోత్సవాల సందర్భంగా 1987లో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్మారక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి.. దాని ద్వారా రాష్ట్రంలోని స్వాతంత్ర సమరయోధులను.. వారి కుటుంబాలను గౌరవించుకుంటూ.. సన్మానించుకొనటం జరుగుతుంది. వారు 1991 సెప్టెంబర్ 7 మన నుండి దూరమైనప్పటికీ వారిని స్మరించుకుంటూ.. రావి నారాయణ రెడ్డి గారి పేరుతో తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్..ఆర్ ఎన్ ఆడిటోరియాన్ని నిర్మించి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నది. వారి 118వ జయంతి సందర్భంగా వారిని స్మరించుకుందాం.. వారు ఆశయాలు సాధనలో ముందుకు నడుచుదాం..

# 7 శాతం గ్రామీణ కుటుంబాలకే 100రోజుల పని

## ఉపాధి హామీ చట్టం అమలులో తాత్సారం

యుపిఏ తొలి ప్రభుత్వం 2005 సెప్టెంబర్‌లో ఆమోదించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నోరేగా) ఉపాధి కోరిన పేదలకు సంవత్సరంలో కనీసం 100రోజులు పని కల్పించాలని ఆదేశించింది. అయితే దాని అమలుపై ఇటీవల జరిపిన మదింపులో 2024–25లో 7శాతం కుటుంబాలు మాత్రమే 100రోజల పనిని పూర్తి చేశాయి. అంతకుముందు సంవత్సరం కొద్దిగా మెరుగు – 7.6శాతం. చట్టం అమలు నత్తనడకను నిర్ధారించటానికి మరో ఉదాహరణ–కల్పించిన మానవ పనిదినాలు 2023–24లో 288.83కోట్లు కాగా 2024–25లో అవి 268.44కోట్లకు తగ్గాయి. ఇదే కాలంలో పనికోసం రిజిస్టర్ అయిన కుటుంబాలు 8.6 శాతం–అనగా 2023–24లోని 13.8 కోట్ల నుంచి 2024–25లో 14.98కోట్లకు పెరిగాయి. ఉపాధి కల్పనను ఇది మెరుగుపరచలేదు. సగటున ఒక్కొక్క కుటుంబానికి 50.18రోజులే పనులు కల్పించబడినాయి. 2023–24తో పోల్చి చూస్తే ఇది 4.3శాతం తక్కువ.

లిబ్‌టెక్ అనే సంస్థ కొద్దిరోజుల క్రితం విడుదల చేసిన నివేదికలో ఈ నిర్ధారణలు భాగం. ''భారతదేశంలో ప్రభుత్వ సేవల డెలివరీలో ఆసక్తి కలిగిన'' ఇంజినీర్లు, సామాజిక కార్యకర్తలు, సామాజిక శాస్త్రవేత్తలతో కూడినదీ సంస్థ. ఈ పరిశీలనలో పాల్గొన్నవారు 10సంవత్సరాలకు పైబడి అనేక రాష్ట్రాల్లో పనిచేశారు. అర్ధవంతమైన విశ్లేషణ నిమిత్తం, 'జాతీయ ధోరణులకు నామమాత్రపు దోహదం చేస్తున్న' కొన్ని రాష్ట్రాలను మినహాయించినట్లు నివేదిక తెలిపింది.

కేంద్ర ప్రభుత్వం నోరేగా చట్టంలోని సెక్షన్ 27ను ఉపయోగించి మూడేళ్లకు పైబడి పశ్చిమబెంగాల్‌కు నిధులు విడుదల చేయటంలేదనే విషయం కూడా రికార్డు చేయబడింది. (పశ్చిమ బెంగాల్ ఆరంభం నుంచీ నోరేగాపై ఆధారపడిన ప్రధాన రాష్ట్రం. కాబట్టి ఈ అధ్యయనానికి లెక్కలు తీసుకునేటపుడు కొన్ని ధోరణుల్లో కొన్ని వ్యత్యాసాలు ఉండవచ్చు). పనుల నిర్వహణలో అక్రమాలు, లోపాలు నిధుల నిలుపుదలకు కారణంగా కేంద్రప్రభుత్వం చెప్పింది. అవి కేంద్రం పంపిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించాల్సిన అంశాలు) ఉపాధి చూపబడిన కుటుంబాలు 2.9శాతం (5.35కోట్ల నుంచి 5.51కోట్లు) తగ్గాయి. ఉపాధి తగ్గుదల ఒడిసాలో (34.8శాతం), తమిళనాడులో (21.1 శాతం), రాజస్థాన్‌లో (15.9 శాతం) గణనీయం. ఒడిసాలో బిజెపి తొలిసారి అధికారంలోకి వచ్చింది. రాజస్థాన్ ప్రస్తుతం బిజెపి పరిపాలనలో ఉంది. మహారాష్ట్రలో ఉపాధి గణనీయంగా – 39.7 శాతం పెరిగింది. కాంగ్రెస్‌పాలిత హిమాచలప్రదేశ్ (14.8శాతం), జెడియు నితీశ్ కుమార్ నాయకత్వంలోని బిహార్‌లో (13.3 శాతం) ఉపాధి కల్పన పెరిగింది.

> మొత్తం కార్మికుల్లో 27.5శాతం, క్రియాశీలంగా ఉన్న కార్మికుల్లో 1.5శాతం 2025 ఏప్రిల్ 7 నాటికి ఆధార్ ఆధారిత చెల్లింపులకు అనర్హులుగా ఉన్నారు. వీరు మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్‌లో (వరుసగా 63.4; 58.1; 38.1 శాతం) ఎక్కువగా ఉన్నారు. ఈ అనర్హ కార్మికులను అధికారులు పనిలోకి తీసుకోవటం లేదు. ఆ విధంగా వారి పనిహక్కు నిరాకరించబడుతున్నది.

గత ఆర్థిక సంవత్సరంలో నికరంగా 1.16 కోట్ల జాబ్‌కార్డులు జారీ చేశారు. 1.31 కోట్ల కార్మికులు జత చేరారు. అయితే 2022 –24 సంవత్సరాల్లో 7.8కోట్ల కార్డులు తొలగించిన లక్షణం రివర్స్ చేయబడింది. తొలగించిన జాబ్‌కార్డులు పునరుద్ధరించేందుకు ప్రామాణిక సూత్రాలు నిర్దేశించినందున 2024–25 ద్వితీయార్ధ భాగంలో ఈ కార్మికులు తిరిగి చేరినట్లు లిబ్‌టెక్ క్షేత్రస్థాయి అధ్యయనం కనుగొన్నది. కార్డులు పునరుద్ధరించినా ఉపాధి కల్పన పెరగలేదు. విధానాల అమలులో రాష్ట్రస్థాయి లోపాలు కూడా ఇందుకు కారణమవుతున్నాయి.

మొత్తం కార్మికుల్లో 27.5శాతం, క్రియాశీలంగా ఉన్న కార్మికుల్లో 1.5శాతం 2025 ఏప్రిల్ 7 నాటికి ఆధార్ ఆధారిత చెల్లింపులకు అనర్హులుగా ఉన్నారు. వీరు మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్‌లో (వరుసగా 63.4; 58.1; 38.1 శాతం) ఎక్కువగా ఉన్నారు. ఈ అనర్హ కార్మికులను అధికారులు పనిలోకి తీసుకోవటం లేదు. ఆ విధంగా వారి పనిహక్కు నిరాకరించబడుతున్నది.

కోరిన వారందరికీ ఉపాధి, స్పందనాశీలమైన పాలనాయంత్రాంగం, జవాబుదారీతనం అనే నోరేగా చట్టం లక్ష్యాలకు పునరంకితం కావాలి. అయితే కేంద్రంలో 2014లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ చట్టానికి చెడ్డరోజులు మొదలైనాయి. 60 ఏళ్ల తర్వాత కూడా ''ప్రజలు ఇంకా నేలలో గుంతలు తవ్వుతున్నారు'' అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ చట్టంపై దాడి చేశారు. 2015 ఫిబ్రవరిలో పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో ప్రధానమంత్రి తన ఆగ్రహం, ద్వేషం వ్యక్తం చేశారు. ''కాంగ్రెస్ పాలన వైఫల్యాలకి పెద్ద గుర్తుగా ఉన్నందున'' ఈ పథకాన్ని కొనసాగించటమే రాజకీయ విజ్ఞత అన్నారు. అయితే పరిస్థితులు ఈ పథకాన్ని కేం ద్రం కొనసాగించేటట్లు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి చేశాయి. ముఖ్యంగా కోవిడ్ సంవత్సరాల్లో 2020–2022 మధ్య దేశవ్యాప్త గ్రామీణ దుస్థితి నుంచి పేదలను ఆదుకోవటానికి ఎంఎన్‌ఆర్‌ఇజిఎ ఒక్కటే సాధనంగా ఉపయోగపడింది. (ప్రధాని నరేంద్రమోదీ 2019 ఎన్నికలకు ముందు పేదలకు ఉచిత రేషన్ కింద బియ్యం, గోధుమల పంపిణీ ప్రారంభించి పొడిగించుకుంటూ వస్తున్నారు. 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామంటూనే 80 కోట్లమందికి ఉచిత రేషన్ ఇస్తున్నామని చెబుతున్నారు. ఇది ఎవరి వైఫల్యానికి నిదర్శనం.)

– రవీంద్రనాథ్ సిన్హా

# మేఘా వేమూరి బహిష్కరణ అప్రజాస్వామికం



అమెరికాలోని ప్రతిష్టాత్మక మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి)లో అభ్యసించిన భారత సంతతి విద్యార్థిని మేఘా వేమూరి గత నెల 29 నాడు 'గ్రాడ్యుయేషన్ డే' సందర్భంగా ప్రసంగిస్తూ ప్రధానంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధ చర్యలను 'నరమేధం'గా పేర్కొనడం, తద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించారు. ఈ రకంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండను విమర్శిస్తూ పాలస్తీనాకు అండగా నిలిచిన మేఘా వేమూరిని అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) గ్రాడ్యుయేషన్ వేడుకల నుండి బహిష్కరించినట్లు ఆ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ మెలిసా నోబెల్స్ ప్రకటించి ఆమెతో పాటు ఆమె తల్లిదండ్రులను సైతం క్యాంపస్ నుండి బయటకు పంపించడం అప్రజాస్వామికం. నిజానికి అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా వెలుగొందుతున్న అమెరికాలో ఈ తరహా ఘటన చోటుచేసుకోవడం 'అప్రజాస్వామ్యానికి నిదర్శనంగా నిలిచింది' అని చెప్పవచ్చు. నిజానికి 'ప్రజాస్వామిక దేశం అని గొప్పగా చెప్పుకునే అమెరికా దేశం చరిత్ర మొత్తం అప్రజాస్వామికమయం' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

గాజాలో ఒకపక్క ఇజ్రాయెల్ భీకర యుద్ధాన్ని కొనసాగిస్తున్న తరుణంలోను, అదే సమయంలో మరోపక్క విశ్వవిద్యాలయాల సంబంధాల గురించి అమెరికాలోని కళాశాల క్యాంపస్‌లలో నిరసనలు పెల్లుబుక్కుతున్న తరుణంలోను మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) వేదిక నుండి భారతీయ – అమెరికన్ విద్యార్థిని మేఘా వేమూరి ఇజ్రాయెల్ – పాలస్తీనా సంఘర్షణపై బలమైన రాజకీయ విమర్శనాత్మకమైన వ్యాఖ్యలు చేయడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించడమే కాకుండా విస్తృత చర్చకు దారితీస్తున్నది. ఈ తరుణంలో మేఘా వేమూరి చూపిన ధైర్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకం ప్రశంసిస్తూనే ఉన్నారు.

మేఘా వేమూరి తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. అయితే ఆమె జార్జియా (అమెరికా)లోని ఆల్ఫారెట్టాలో పుట్టి పెరిగారు. ఆమె 2021లో ఆల్ఫారెట్ట హైస్కూల్ నుండి పట్టభద్రురాలయ్యారు. అదే సంవత్సరం ఆమె మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి)లో చేరి కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, భాషాశాస్త్రంలో ట్రిపుల్ మేజర్‌తో తన అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీని పూర్తి చేశారు. గ్రాడ్యుయేటింగ్ క్లాస్ అధ్యక్షురాలిగాను ఆమె కొనసాగుతున్నారు. మెక్ గోవర్న్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్‌లో రీసెర్చ్ అసిస్టెంట్‌గాను ఆమె వ్యవహరించారు. మేఘా వేమూరి 2021లో నేషనల్ మెరిట్ స్కాలర్ అవార్డు పొందారు. తన విద్యా విజయాలకు మించి విప్లవాత్మక ఆలోచనలకు వేదికను అందించాలనే లక్ష్యంతో ఉన్న ఆమె మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) విద్యార్థి బృందం అయిన రిటర్న్ రెవల్యూషన్‌లోను సభ్యురాలుగా ఉన్నారు.

ఇటీవలి కాలంలో పాలస్తీనా అనుకూల, ఇజ్రాయిల్ వ్యతిరేక నిరసనలు తీవ్రతరం అవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే మేఘా వేమూరి 'స్వేచ్ఛా పాలస్తీనా' కోసం గళమెత్తారు. పాలస్తీనా సంఘీభావానికి ప్రతీకగా మేఘా వేమూరి ఎరుపు కెఫెయే ( హిజాబ్ వంటిది) ధరించి గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఆమె ప్రసంగ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఈ రకంగా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మేఘా వేమూరి చేసిన విమర్శలను కొందరు వ్యతిరేకించారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) గ్రాడ్యుయేషన్ వేడుకను రాజకీయ మైదానంగా ఆమె ఉపయోగించారని మరికొందరు అభ్యంతరాలు వ్యక్తికరించారు.

మేఘా వేమూరి తన ప్రసంగంలో పాలస్తీనియన్లకు బలంగా సంఘీభావాన్ని ప్రకటించారు. 'పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ దాడికి అమెరికా మాత్రమే కారణం కాదు. మన యూనివర్సిటీ కూడా సహాయం చేస్తూ ప్రోత్సహిస్తూనే ఉంది. కాని ఇది సరైన విధానం ఏమాత్రం కాదు' అని మేఘా వేమూరి తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్‌తో తమ వర్సిటీ చేసుకున్న ఒప్పందాలను ఆమె అంతే తీవ్రంగా వ్యతిరేకించారు. ఇజ్రాయెల్ పాలస్తీనాను భూమి నుండి పూర్తిగా తుడిచి పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. ఆ ప్రయత్నాలలో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) భాగం కావటం సిగ్గుచేటు. అలాగే ఇజ్రాయెల్ సైనిక సంస్థలతో రీసెర్చ్ సంబంధాలను కొనసాగిస్తుంది. ఇది గాజాలో జరుగుతున్న హింసకు సహాయం చేస్తుందని ఆమె ఘాటుగా విమర్శించారు. మసాచుసెట్స్ వర్సిటీ విద్యార్థులు అటువంటి హింసా కాండను ఎటువంటి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదు. జాతి విధ్వంసాన్ని అసలే హర్షించరు. అలాంటి జాతి విధ్వంసక ఇజ్రాయెల్ సైన్యంతో సంబంధాలను తెంచుకోవాలి' అని ఆమె స్పష్టంగా పేర్కొనడం గమనార్హం.

గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) విద్యార్థులు పిలుపు ఇవ్వడం శుభపరిణామం. ఈ క్రమంలోనే విద్యార్థులు శాంతి కోసం ముందుకు సాగడం గమనార్హం. 'మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) యాజమాన్యం ప్రో– పాలస్తీనా ఉద్యమకారులను బెదిరింపులు, అణచివేతల ద్వారా అడ్డుకుంటూనే ఉంది. అయిననూ వారు వెనకడుగు వేయడం లేదు. ఇజ్రాయెల్ దాడిలో పాలస్తీనా ఒక రకంగా నాశనం అయిపోయింది. అక్కడి ప్రజలు బాంబు దాడులతో, ఆహార కొరతతో చనిపోతూ ఉన్నారు. మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి జీవితాలను మరింతగా ముందుకు కొనసాగిస్తున్నాము. మా జీవితాలను శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లు గాను విద్యావేత్తలు గాను, నాయకులు గాను తీర్చిదిద్దుకుంటున్నాం. కాని గాజాలో ఇప్పుడు ఒక్క విశ్వవిద్యాలయం కూడా మిగలలేదు. అందువలన పూర్వ విద్యార్థులుగా మేము ఇజ్రాయెల్‌తో సంబంధాలను తెంచుకోవాలి అని వర్సిటీని డిమాండ్ చేస్తూనే ఉంటాము' అని మేఘా వేమూరి పేర్కొన్నారు.

విశ్వ విద్యాలయ అధికారుల నుండి బెదిరింపులు అణచివేతలను ఎదుర్కొంటున్నప్పటికీ 'విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా నిలబడడం నూతన సమాజ నిర్మాణానికి బాటలు వేయనుంది' అని స్పష్టంగా చెప్పవచ్చు. అమెరికాలోని చాలా మంది విద్యార్థుల హృదయాలలో భయాందోళనలు గూడు కట్టుకుని ఉండేవి. మీరు ఇంతకు ముందు భయం అనే అడ్డంకిని ఎదుర్కొన్నారు. సరైన దానికోసం నిలబడటానికి మీరు దానిని ఇంధనంగా మార్చారు. ఒక జాతి విధ్వంసాన్ని ప్రజలు ఏమాత్రం సహించలేరు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) స్వేచ్ఛా పాలస్తీనాను కోరుకుంటుందని మీరు ప్రపంచానికి చూపించారు' అని మేఘా వేమూరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించడం నిజంగా అద్భుతం. అంతిమంగా మేఘా వేమూరి అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి) గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా 'స్వేచ్ఛా పాలస్తీనా కోసం చేసిన ప్రసంగం ప్రపంచ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది' అని సగర్వంగా చెప్పవచ్చు.

– జె.జె.సి.పి.బాబూరావు,
రీసెర్చ్ స్కాలర్, సెల్ : 9493319690



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## 4 వేలు దాటిన కరోనా కేసులు:37 మంది మృతి



**న్యూఢిల్లీ :** భారత్‌లో కరోనా వైరస్ విజృంభిస్తోంది. తాజాగా కొవిడ్ కేసుల సంఖ్య 4 వేలు దాటింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకాం.. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకూ కొత్తగా 64 మందికి పాజిటివ్‌గా తేలింది. 24 గంటల్లో ఐదుగురు మరణించారు. జూన్ 3 ఉదయం 8 గంటల సమయానికి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4,026కి పెరిగింది. వీటిలో కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 1,416 కేసులు వెలుగు చూడగా.. మహారాష్ట్రలో 494, గుజరాత్‌లో 397, ఢిల్లీలో 393, పశ్చిమబెంగాల్‌లో 372, కర్ణాటకలో 311 కేసులు వెలుగు చూశాయి. గత 24 గంటల్లో మహారాష్ట్రలో ఇద్దరు, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 37కి పెరిగింది.

## ట్రంప్ 'కాల్'కు ప్రధాని మోదీ లొంగిపోయారు

కాంగ్రెస్ సమావేశంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ధ్వజం



**భోపాల్ :** భారత్‌పాక్ మిలిటరీ సంఘర్షణ సమయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పిలుపు మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లొంగిపోయారని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆ రోపించారు. మంగళవారం భోపాల్‌లో కాంగ్రె స్ నాయకులు, కార్యకర్తలు హాజరైన 'సంగ్ధాన్ శ్రీజన్ అభియాన్' సమావేశాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. రాహుల్‌గాంధీ ఉపన్యసిస్తూ 1971 యుద్ధంలో అమెరికా తన 7వనౌకాదళాన్ని పంపినప్పటికీ ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఏమాత్రం వెనక్కి తగ్గలేదని గుర్తుచేశారు. 'డోనాల్డ్ ట్రంప్ నుంచి ఒక కాల్ రాగానే నరేంద్ర మోదీజీ వెంటనే లొంగిపోయారు. చరిత్రే అందుకు సాక్ష్యం. ఇదే బిజెపిఆర్‌ఎస్‌ఎస్ నిజస్వరూపం. వారు ఎల్లప్పుడూ వొంగి నమస్కరించేటోళ్లే 'అని రాహుల్ గాంధీ విమర్శించారు. అమెరికా బెదిరింపులను లెక్కచేయకుండా 1971లో భారత్ పాకిస్థాన్‌ను విభజించిందని రాహుల్ తెలిపారు. 'కాంగ్రెస్‌కు చెందిన బబ్బర్‌షేర్, ఆడసింహాలు అగ్రరాజ్యాలతో పోరాడతాయే తప్ప ఎప్పుడూ వొంగి నమస్కరించరు' అని ఆయన చెప్పారు. 1971 యుద్ధంలో ఒక్క ఫోన్ కాల్ కూడారాలేదన్నారు. 7వ నౌకాదళం, ఆయుధాలు, విమాన వాహక నౌక వచ్చినప్పటికీ ఇందిరాగాంధీ లొంగిపోలేదని, తాను ఏమీ చేయదల్చుకున్నానో అదే చేస్తానని చెప్పారని రాహుల్ వివరించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గురించి మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం నాటినుంచీ వారికి సరెండర్ లెటర్స్ రాయడం ఒక అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. 'ఇదే తేడా. ఇదే వారి లక్షణం. వారంతా ఇలాగే ఉంటారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ వారికి లొంగుబాటు లేఖలు రాసే అలవాటు ఉంది. కాంగ్రెస్ ఎప్పుడూ లొంగిపోదు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, (వల్లభాయ్) పటేల్ ఎప్పుడూ లొంగిపోలేదు. వారందరూ అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడారు' అని రాహుల్ వివరించారు. సిద్ధాంతపరమైన యుద్ధం జరుగుతోంది. కాంగ్రెస్, భారత రాజ్యాంగం ఒకవైపు ఉంటే, మరోవైపు రాజ్యాంగాన్ని విశ్వసించని బిజెపిఆర్‌ఎస్‌ఎస్ ఉన్నాయి. నాశనం చేయాలని కోరుకుంటున్నాయి అని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా సామాజిక న్యాయం కోసం పోరాడుతోందని, కులగణను లోక్‌సభ ఆమోదించేలా కృషి చేస్తున్నదని చెప్పారు. మోదీజీ కేవలం నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయని చెబుతారు. ఎన్నికల సమయం వచ్చేసరికి వారంతా ఓబిసిలుగా మారిపోతుంటారు అని రాహుల్ వ్యంగాస్త్రాలు సంధించారు. 'బాబులు రూపొందించిన' బిహార్ మోడల్ కులగణన కాకుండా తెలంగాణ మోడల్ కులగణను అమలు చేయాల్సిన అవసరం ఉందని రాహుల్ చెప్పారు. దేశంలోని యువతను ఫణంగా పెట్టి బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు అధికారం ఇస్తున్నదని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

## లడాఖ్ ప్రజలకు కొత్త రిజర్వేషన్లు

ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ :** కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌లో ప్రజల స్థానికత, రిజర్వేషన్లు, భాష పరిరక్షణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై ఒక ప్రకటన చేసింది. లడఖ్‌లో స్థానికులకు 85శాతం ఉద్యోగాలను రిజర్వ్ చేసింది. అంతేకాకుండా లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్స్‌లో మొత్తం సీట్లలో మూ డింట ఒకవంతు సీట్లను మహిళలకే కేటాయించింది. ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, భోటి, పుర్గి భాషలను లడఖ్‌లో అధికారిక భాషలుగా ప్రకటించింది. భాష, సంస్కృతి, భూమి, హక్కుల పరిరక్షణ కోసం స్థానికులు నిరసనలు లేవనెత్తుతున్న నేపథ్యంలో స్థానికుల ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ను 2019లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌ను రెండు భాగాలుగా ఏర్పాటుచేసిన విషయం విదితమే. జమ్ముకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు అయ్యాయి. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలు తమ భాష, సంస్కృతి, భూమి, హక్కుల పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి ఉద్యోగాలలో రిజర్వేషన్ల పాలసీలు, అటానమస్ కౌన్సిళ్లు, నివాస నిబంధనలు, భాషల పాలసీలలో నూతన మార్పులు అమలులోకి వస్తున్నాయి. దీనికి సంబంధించి ప్రభుత్వం బహుళ నోటిఫికేషన్లు జారీచేసింది. కొత్త రూల్స్ ప్రకారం...లడఖ్‌లోని కేంద్ర పాలిత ప్రాంతంలో 15సంవత్సరాల పాటు నివాసిస్తూ ఉన్నవారు, ఏడు సంవత్సరాలపాటు విద్యను అభ్యసించి, ఇక్కడి కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్‌లో నివాసం ఉంటూ క్లాస్ 10 లేదా 12 పరీక్షకు హాజరైనవారు కంటోన్మెంట్ బోర్డు తప్ప కేంద్రపాలిత ప్రాంతం, లోకల్ లేదా ఇతర అథారిటీ కింద ఏ ఉద్యోగంలోనైనా నియామకం చేసే ప్రయోజనాన్ని కలిగిఉంటారు. ఈ కేంద్రపాలిత ప్రాంతాలలో 10సంవత్సరాలకు పైబడి సేవలు అందించిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థలు లేదా కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్వయం ప్రతిపత్తి సంస్థ అధికారులు, ప్రభుత్వరంగ బ్యాంకులు, చట్టబద్ధమైన సంస్థలకు చెందిన అధికారులు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు చెందిన అధికారులు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన గుర్తింపుపొందిన పరిశోధనా సంస్థలకు చెందిన అధికారులు ఎవరైతే ఉంటారో వారంతా ఇక్కడ నివాసం ఉండటానికి అర్హులుగా నిబంభనలు రూపొందించారు. ఎకనామికల్లీ వీకర్ సెక్షన్లు (ఇడబ్ల్యుఎస్)కు చెందిన వారు 10శాతం రిజర్వేషన్లు పొందడం కొనసాగనున్నది. లడఖ్‌లోని అనేక సంస్థలు దశాబ్దాలుగా ఈ ప్రాంతానికి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతాన్ని డిమాండ్ చేయగా 2019, ఆగష్టు 5న నెరవేరింది. అయినప్పటికీ శాసనసభకు తమ ప్రతినిధులను ఎన్నుకునే విషయంలో లడఖ్‌లోని అనేక మంది ప్రజలు సంతోషంగా లేరు. 2024, ఆగష్టులో కేంద్ర ప్రభుత్వం లడఖ్‌లోని కేంద్ర పాలిత ప్రాంతం కింద 5జిల్లాలను సృష్టించింది. జన్స్‌కర్, డ్రాస్, షమ్, నుబ్రా, చాంగ్‌థాంగ్‌లను 5జిల్లాలుగా ఏర్పాటు చేసింది. కేంద్రపాలిత ప్రాంతంగా లడఖ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నియంత్రణలోని ప్రత్యక్ష పాలనాయంత్రాంగం కిందకు వచ్చింది. 2024, అక్టోబర్‌లో క్లైమేట్ యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్ తమ డిమాండ్లపై గట్టిగా గళమెత్తుతూ దేశ రాజధాని ఢిల్లీలో నిరవధిక నిరాహారదీక్షకు కూర్చున్నారు. 2024, డిసెంబర్ 3న లడఖ్ నుంచి హాజరైన పౌర సమాజనాయకులతో చర్చలు జరిపారు. మళ్లీ ఈ ఏడాది (2025) జనవరి 15, మే 27న కూడా కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

## ప్రీమియం ప్రజలది... లబ్ధి అదానీకి...

ఎల్‌ఐసి అదానీ గ్రూప్‌లో ఎల్‌ఐసి రూ.5,000 కోట్ల పెట్టుబడి పై రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసి అదానీ గ్రూప్‌లో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టడంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిధులను ప్రైవేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. 'డబ్బు, పాలసీ, ప్రీమియం మీదే; భద్రత, సౌలభ్యం, అదానీకి ప్రయోజనం' అని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. భారతదేశంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ యుటిలిటీ అయిన అదానీ పోర్ట్, స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ (ఎపిసెజ్) గత వారం తన అతిపెద్ద దేశీయ బాండ్ ఇష్యూలో రూ.5,000 కోట్లు సేకరించినట్లు తెలిపింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి) నుండి 15 సంవత్సరాల నాన్‌కన్వర్టబుల్ డిబెంచర్ (ఎన్‌సిడి) ద్వారా ఎపిసెజ్ ఈ నిధిని సేకరించిందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్‌సిడిలను పోటీతత్వ సంవత్సరానికి 7.75 శాతం కూపన్ రేటుతో సేకరించారు. సాధారణ ప్రజల బీమా ప్రీమియంల ద్వారా సేకరించిన ఎల్‌ఐసి ప్రజా నిధులను అదానీ గ్రూప్‌లో పెట్టుబడి పెట్టిందని రాహుల్ ఆరోపిస్తున్నారు. ఎల్‌ఐసి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేశీయ ఆర్థిక సంస్థ. ఇది భారత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుంది.

## వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తే ఊరుకోం

కమల్‌హాసన్ హైకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ :** ప్రముఖ నటుడు, రాజకీయ నాయకు డు కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకు వాక్ స్వాతంత్ర్యం హక్కును దుర్వినియోగం చేయొద్దని ఆయనను హెచ్చరించింది. తీవ్ర వివాదానికి కేంద్ర బిందువుగా మారిన 'కన్నడ భాష తమిళం నుంచే పుట్టింది' అనే వ్యాఖ్యను ఉపసంహరించుకోవాలని కమల్‌కు హైకోర్టు మంగళవా రం సూచించింది. కన్నడ భాషపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు థగ్‌లైఫ్ సినిమాను ప్రదర్శించకూడదన్న కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కమల్ హాసన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నటుడు కమల్ హాసన్ తీరు పై అసహనం వ్యక్తం చేసింది. 'మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోలేరు. కానీ అందుకు క్షమాపణలు చెప్పొచ్చు. పగలగొట్టి వం దేసిన గుడ్లను మీరు పగలగొట్టని పూర్వ స్థితికి తీసుకెళ్లలేరు' అని కమల్‌కు హైకోర్టు హితవు పలికింది. గతంలో ఎప్పుడో ఏదో జరిగిపోయి ఉంటే, దాన్ని రివర్స్ చేయలేమనే అర్థాన్ని ఇచ్చే ఒక ఆంగ్ల నానుడిని ప్రయోగిస్తూ న్యాయస్థానం ఈ కామెం ట్స్ చేసింది. 'మీరు సాధారణ వ్యక్తేం కాదు. మీకు వాక్ స్వాతంత్ర్యం ఉంది. కానీ దానితో ఇతరులను బాధపెట్టకూడదు. ఇతరులను బాధపెట్టడం కోసం మీకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇవ్వలేదు. ఇప్పటికైతే ఈ విషయాన్ని మీకే వదిలేస్తున్నాం. మీరు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమాపణలు చెప్పండి' అని కమల్‌కు హైకోర్టు నిర్దేశించింది.

**'థగ్ లైఫ్' సినిమాను ప్రస్తావించిన హైకోర్టు**

గురువారం (జూన్ 5న) విడుదలకానున్న కమల్ హాసన్ సినిమా 'థగ్ లైఫ్'ను ఈ సందర్భంగా న్యాయస్థానం పరోక్షంగా ప్రస్తావించింది. 'కన్నడ భాషను ఉద్దేశించి మీరు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోండి. కర్ణాటకలోనూ కోట్లు సంపాదించుకోవచ్చు. మీకు కన్నడ ప్రజలు అక్కర్లేదని భావిస్తే ఆదాయాన్ని వదులుకోండి' అని కమల్‌ను హైకోర్టు కోరింది.

## ఐఎస్ఐ గూఢచారి అరెస్టు

ఆర్మీ సమాచారం పాక్ చేరవేస్తున్నట్లు గుర్తింపు

**చండీగఢ్ :** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్న పాక్ గూఢచారిని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తర్న్ తరణ్ జిల్లాకు చెందిన గగన్‌దీప్ సింగ్ అనే వ్యక్తికి పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్‌ఐతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ దళాల మోహరింపులు, వ్యూహాత్మక ప్రదేశాల వివరాలతో సహా సున్నితమైన సమాచారాన్ని అతడు ఐఎస్‌ఐకి చేరవేసినట్లుగా గుర్తించామని పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు. గగన్‌దీప్ సింగ్ గత ఐదేళ్లుగా ఖలిస్తానీ ఉగ్రవాది గోపాల్ సింగ్ చావ్లాతో సంప్రదింపులు జరుపుతున్నాడని.. అతడి ద్వారా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ (పిఐఒలు)తో పరిచయాలు చేసుకున్నాడని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్న ఖలిస్తానీ ఉగ్రవాది గోపాల్ చావ్లా, ఐఎస్ఐ సహకారంతో భారత్‌లో గూఢచర్య రాకెట్‌ను నడుపుతున్నాడని, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ ప్రణాళికలు తెలుసుకోవడానికి వీరిని ఉపయోగించుకున్నాడని పోలీసులు తెలిపారు. లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌తోనూ అతడికి సంబంధాలు ఉన్నాయన్నారు. గగన్‌దీప్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని పరిశీలించగా.. దేశానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు, సైన్యానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు లీక్ చేసిన ఆధారాలు లభించాయన్నారు. అంతేకాకుండా అతడికి 20మందికి పైగా ఐఎస్ఐ ఏజెంట్లతో పరిచయాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ చర్యల వల్ల జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత దేశంలో ఉంటూ..పాక్‌కు గూఢచర్యం చేస్తున్న దేశద్రోహులను గుర్తించడానికి అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పాక్‌కు గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై ఇప్పటివరకు యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఉగ్ర సంబంధాలు

ముగ్గురిని ఉద్యోగం నుంచి తొలగించిన జమ్ముకశ్మీర్ ప్రభుత్వం



**జమ్ము :** లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దిన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన ముగ్గురు ముగ్గురు ఉద్యోగులపై జమ్ముకశ్మీర్ ప్రభుత్వం వేటు వేసింది. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ మాలిక్ ఇష్ఫాక్ నసీర్, స్కూల్ టీచర్ అజాజ్ అహ్మద్, ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ వసీం అహ్మద్‌ఖాన్ ఉన్నారు. జాతీయ భద్రతా ప్రయోజనాలరీత్యా వీరిని తొలగిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యవర్గం ఇప్పటివరకు 75 మంది గవర్నమెంట్ ఉద్యోగులకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించి.. వారిని తొలగించింది. జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఉగ్రవాదులకు సహకరించే వారి కోసం వేటను కొనసాగిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల్లో సానుభూతిపరులను కూడా గుర్తిస్తోంది. తాజాగా తొలగించిన ముగ్గురు ఉద్యోగులు ఉగ్రమూకకు సరకులు అందజేయడం, ఆయుధాల స్మగ్లింగ్, భద్రతా దళాలకు వ్యతిరేకంగా ముష్కరుల కార్యకలాపాలకు సాయం చేయడం వంటివి చేసినట్లు తేలింది. మాలిక్ ఇష్ఫాక్ 2007లో కానిస్టేబుల్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అతడి సోదరుడు మాలిక్ ఆసీఫ్ పాక్‌లో శిక్షణ పొందిన లష్కరే ఉగ్రవాది. 2018లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో అతడిని మట్టుబెట్టారు. సోదరుడి మరణం తర్వాత కూడా ఇష్ఫాక్ ఉగ్ర కార్యకలాపాలను కొనసాగించాడు. ఉగ్రవాదులకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను ఎక్కడ జారవిడవాలో పొజిషన్లను గుర్తించేవాడు. ఆ లొకేషన్ జిపిఎస్ కోఆర్డినేట్స్‌ను పాక్‌లోని హ్యాండ్లర్లకు పంపేవాడు. ఇక అక్కడికి చేరిన ఆయుధాలను గుర్తించి.. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు చేరవేసేవాడు. 2021లో తొలిసారి ఆయుధాలు, పేలుడు పదార్థాల చేరవేత కేసులో ఇతడికి లష్కరేతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక అజాజ్ అహ్మద్ 2011లో విద్యాశాఖలో టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. అతడు హిజ్బుల్ ముజాహిద్దీన్ సంస్థకు ఆయుధాలు, ప్రచార సామగ్రిని స్మగ్లింగ్ చేసేవాడు. 2023లో పోలీసులు నిర్వహించిన సాధారణ తనిఖీల్లో అతడు, అతడి మిత్రుడు దొరికిపోయారు. అతడికి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని హిజ్బుల్ ఆపరేటివ్ అబిద్ రంజాన్ షేక్ నుంచి ఆయుధాలు వచ్చినట్లు గుర్తించారు. గత కొన్నేళ్లుగా అతడు ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడు. హిజ్బుల్‌కు కశ్మీర్‌లోని పూంచ్‌లో నమ్మకమైన కార్యకర్తగా ఎదిగాడు. ఇక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వసీమ్ అహ్మద్ ఖాన్ లష్కరే, హిజ్బుల్ సంస్థల కోసం పనిచేస్తున్నాడు. జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించిన జర్నలిస్ట్ సుజాత్ బుఖారీ, ఆయన అంగరక్షకుడి హత్య కుట్రలో ఇతడి హస్తం ఉంది. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఘటనా స్థలం నుంచి తప్పించేందుకు ఇతడే సాయం చేసినట్లు గుర్తించారు. 2018లో ఆగస్టులో శ్రీనగర్‌లోని బట్‌మాలూ వద్ద ఉగ్రదాడిపై విచారణ సమయంలో ఇతడిని తొలిసారి అరెస్ట్ చేశారు.

### ఖీర్ భవానీ మేళా వద్దకు భక్తులు రావడమే...

## పహల్గామ్ 'నేరస్తులకు తగిన సమాధానం'

నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షులు ఫరూఖ్ అబ్దుల్లా



**తుల్ముల్లా (జమ్ముకశ్మీర్) :** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత లోయలోని మేళా ఖీర్ భవాని వద్దకు కశ్మీరీ పండిట్లు తిరిగివచ్చి ఉండటం ఆ నేరస్తులకు 'తగిన సమాధానం' అని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షులు ఫరూఖ్ అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇది (మేళా వద్ద భక్తుల హాజరు) ఒక పెద్ద విషయం. ఇది అంతా మాత (ఆలయదేవత) చేస్తున్నది. ఆమే వారిని వారి ఇళ్లకు రావాలని ఇక్కడకు పిలిచింది' అని ఫరూఖ్ అబ్దుల్లా గందెర్బల్ జిల్లాలో ఇక్కడ నిర్వహించే ఏడాది మేళాలో మంగళవారం ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా అన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానం చెప్పారు. అబ్దుల్లా మాట్లాడుతూ ఉగ్రదాడి తర్వాత నాలుగు రోజులపాటు జరిగిన సైన్యం సంఘర్షణపై ప్రజలు భయాన్ని వదులుకోవాలని, భక్తులు ఎవరైనా ఎలాంటి జంకు బొంకు లేకుండా జమ్ముకశ్మీర్‌కు రావాలని, ఇప్పటికే ఆలయాన్ని సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని చెప్పారు.'జమ్ముకశ్మీర్‌లో ఏదైనా కొట్లాట జరుగుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ కారణంగా వారు మాతా వైష్ణోదేవీ ఆలయాన్ని సందర్శించేందుకు రావడం లేదు. భయాన్ని వీడాలని నేను ప్రజలకు చెప్పదలచుకున్నాను. వచ్చి మాతను దర్శించుకోవాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి కూడా అయిన ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడుతూ జులై 3న ప్రారంభం కానున్న ఈ వార్షిక అమర్‌నాథ్ యాత్రకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.'భోలేనాథుడిని దర్శించుకునేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తారని నేను ఆకాంక్షిస్తున్నాను' అని ఫరూఖ్ అబ్దుల్లా చెప్పారు.

## వయోజన అక్షరాస్యత సవాళ్లపై... తమిళనాడు, త్రిపుర,ఢిల్లీ 'టాప్'

ఎఫ్ఎల్ఎన్ఏటి ఫలితాలు వెల్లడి

**న్యూఢిల్లీ :** వయోజన అక్షరాస్యత, విద్యకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవడంలో అత్యుత్తమ ప్రదర్శకులుగా ఢిల్లీ, త్రిపుర, తమిళనాడు అగ్రస్థానంలో నిలిచాయి. కాగా అదే సమయంలో ఉత్తరాఖండ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ప్రశంసనీయ ఫలితాలను రాబట్టడంలో వెనకంజలో ఉన్నారు. ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఎల్ఎన్ఏటి) ఈ ఫలితాలను వెల్లడించాయి. ఎఫ్ఎల్ఏఎన్‌టి అనేది ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా ధృవీకరణకు సంబంధించి జాతీయస్థాయి అంచనాపై దృష్టి సారించిన సంస్థ. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నిరక్షరాస్యులైన జనాభాకు శిక్షణ ఇచ్చి, ఆ తర్వాత పరీక్ష నిర్వహించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దబడిన వారుగా నిర్ధారిస్తుంది. ఈ అంచనా మూడు అంశాలకు సంబంధించినదిగా ఉంటుంది. రీడింగ్, రైటింగ్, న్యూమరసీకి సంబంధించి అంచనా వేయబడుతుంది. ఒక్కొక్క అంశంలో 50మార్కులు చొప్పున మొత్తం 150మార్కులకు పరీక్ష ఉంటుంది. ఈ టెస్ట్ ప్రాథమిక అక్షరాస్యత, నమోదిత అక్షరాస్యత లేని అభ్యాసకుల సంఖ్యను అంచనావేయడానికి అభివృద్ధి చేయబడింది. ఎఫ్ఎల్ఎన్‌టి ప్రక్రియ 2024 మార్చి 2025మధ్య దశలవారీగా ప్రారంభించబడింది. 2025లో 1.77కోట్లకు పైగా అభ్యాసకులు పరీక్షించబడ్డారు.వీరిలో 34.31లక్షల మంది మాత్రమే అధికారికంగా పరీక్షించబడ్డారు. ఇది దాదాపు 19.4శాతం జాతీయ ధృవీరణ సగటును ప్రతిబింబిస్తుంది. ఉల్లాస్ (యుఎల్ఎల్ఏఎస్) అనే నవ్ భారత్ సాక్షరస్యతా కార్యక్రమం కింద భారతదేశంలోని రాష్ట్రాలలో వయోజన అక్షరాస్యతలోని గణనీయమైన వైవిధ్యాలను వెల్లడిస్తుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) సంకలనం చేసి ప్రకటించిన డేటా, వయోజన విద్య, అక్షరాస్యత సవాళ్లలో రాష్ట్రాలు ఎలా విభిన్నంగా ఉన్నాయనే అంతర్‌దృష్టిని అందిస్తుంది. 100శా తం సక్సెస్ రేటుతో తమిళనాడు రాష్ట్రం రికార్డు సృష్టించింది. ఎఫ్ఎల్ఎన్ఏటి కోసం 5,09,694మంది అభ్యాసకులు హాజరయ్యారు. త్రిపుర రాష్ట్రం 98.1శాతం సక్సెస్ రేటుతో రెండవస్థానంలో నిలిచింది. 14,17 9మంది అ భ్యాసకులకుగాను 13,909మందికి సర్టిఫికేషన్ జరిగింది. ఢిల్లీ 99.3శాతం సక్సెస్ రేటుతో 7,959మంది అభ్యాసకులకుగాను 7,901మందికి సర్టిఫికేషన్ జరిగింది. దీనికి విరుద్ధంగా ఉత్తరాఖండ్, గుజరాత్, హైదరాబాద్ వంటి రాష్ట్రాలు తక్కువ సర్టిఫికేషన్ రేట్లను నమోదు చేశాయి.

### పార్లమెంట్, అసెంబ్లీ చట్టం చేస్తే

## కోర్టు ధిక్కరణగా పరిగణించలేం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్, శాసనసభలు చేసే ఏ చట్టాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2012లో దాఖలైన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ నందిని సుందర్ పిటిషన్‌ను విచారిస్తూ ఈ మేరకు తీర్పునిచ్చింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'ప్రతి రాష్ట్ర శాసనసభకు ఒక చట్టాన్ని ఆమోదించే పూర్తి అధికారులు ఉంటాయి. ఆ చట్టం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, న్యాయస్థానం చెప్పేంతవరకూ అది చట్టంగానే ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఇది రాజ్యాంగ విరుద్ధమని, కొట్టివేయాలని భావిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. చట్టం చెల్లుబాటును, వివాదాలను పరిష్కరించే అధికారం రాజ్యాంగం ద్వారా న్యాయవ్యవస్థకు వచ్చింది' అని కోర్టు అభిప్రాయపడింది. సల్వా జుడుం, స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ (ఎస్‌పిఒ) వంటి సాయుధ పౌర సమూహాలను మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వినియోగించడంపై అప్పట్లో తీవ్రమైన ఆందోళనలు రేకెత్తాయి. ఛత్తీస్‌గఢ్ సర్కారు పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని, సల్వా జుడుం రద్దు చేయాలని, నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, నక్సలైట్లు చేసిన నేరాలపై దర్యాప్తు చేయాలని నందిని సుందర్‌తో పాటు పలువురు 2007లో సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసారు. జూలై 5, 2011న, సుప్రీంకోర్టు ఎస్‌పిఒలను ఉపయోగించకుండా ఆదేశాలను ఇచ్చింది. అదే ఏడాది ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2011లో ఛత్తీస్‌గఢ్ సహాయక సాయుధ పోలీసు దళ చట్టాన్ని సవరించింది.

## మిజోరాంలో వర్ష బీభత్సం..

552 చోట్ల విరిగిపడ్డ కొండచరియలు.. దెబ్బతిన్న 152 ఇళ్లు



**ఐజ్వాల్ :** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిక్కిం, అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయలో కుంభవృష్టి కురుస్తోంది. ఈ కుంభవృష్టి కారణంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ వర్ష బీభత్సానికి ఈశాన్య రాష్ట్రాల్లో దాదాపు 34 మంది ప్రాణాలు కోల్పోయారు. గత 10 రోజుల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో మిజోరాంలో ఐదుగురు మరణించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు మంగళవారం తెలిపారు. చంపాయి జిల్లాలో ముగ్గురు, ఐజ్వాల్, సెర్చిప్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా ఇళ్లు, గోడలు కూలిపోవడం వల్ల ఈ మరణాలు సంభవించినట్లు తెలిపారు. ఇక రాష్ట్రంలోని 552 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. 152 ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో పగుళ్ల కారణంగా 198 కుటుంబాలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయినట్లు చెప్పారు. మొత్తం 11 జిల్లాల్లో మయన్మార్‌తో సరిహద్దును పంచుకునే తూర్పు మిజోరాంలోని చంపాయి జిల్లాపై తీవ్ర ప్రభావం పడినట్లు పేర్కొన్నారు. ఇక్కడ 209 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు వివరించారు. తొమ్మిది ఇళ్లు దెబ్బతినగా.. 14 కుటుంబాలను ఖాళీ చేయించినట్లు చెప్పారు. ఇక సెర్చిప్ జిల్లాలో 75 చోట్ల కొండచరియలు విరిగిపడగా.. 27 ఇళ్లు దెబ్బతిన్నాయని, కొండచరియలు విరిగిపడటం, పగుళ్లు, వరదల కారణంగా 132 కుటుంబాలు తమ ఇళ్లను వదిలి వెళ్లిపోయినట్లు అధికారులు చెప్పారు. ఐజ్వాల్ జిల్లాలో 18 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. 13 ఇళ్లు కూలిపోయాయి. ఖాజ్వాల్ జిల్లాలో 75 చోట్ల కొండచరియలు విరిగిపడగా, లుంగ్లీ జిల్లాలో 60, దక్షిణ మిజోరాంలోని సియాహా జిల్లాలో 53 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో సైతువల్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. ఇక దక్షిణ జిల్లాలకు నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే వందకు పైగా ట్రక్కులు సెర్చిప్‌లో చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. గత మూడు రోజుల్లో ఐజ్వాల్ జిల్లాలో 253.7 మి.మీ వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఖాజ్వాల్ జిల్లాలో 248.33 మి.మీ వర్షపాతం, సియాహా జిల్లాలో 241.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ తన నివేదికలో వెల్లడించింది. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఐఎండీ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కూలిపోయిన డచ్ ప్రభుత్వం

హేగ్ : అధికార కూటమి నుంచి పచ్చి మితవాద పార్టీ పార్టీ ఫర్ ఫ్రీడం వైదొలగడంతో తమ ప్రభుత్వం రాజీనామా సమర్పించనున్నట్లు డచ్ ప్రధాన మంత్రి డిక్ షూఫ్ తెలిపారు. పార్టీ ఫర్ ఫ్రీడమ్ మద్దతు ఉపసంహరణతో తమ కూటమికి పార్లమెంటులో సరిపడ మద్దతు లేదని మంత్రుల సమావేశంలో భావించామని ఆయన క్యాబినెట్ సమావేశం అనంతరం మీడియాకు తెలిపారు. తాను తక్షణమే నెదర్లాండ్స్ రాజు కింగ్ విలియ్ –అలెగ్జాండర్‌ను కలిసి పార్టీ ఫర్ ఫ్రీడమ్ మంత్రుల రాజీనామా చేయాలని కోరుతానని తెలిపారు. ప్రభుత్వంలో ఇతర సభ్యులు కూడా రాజీనామా చేస్తారని, రాజీనామా వినతి లేఖను పార్లమెంటు దిగువ సభకు కూడా పంపుతామని చెప్పారు.

## ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం
అన్వేష్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : వానాకాలం సీజన్ సమయంలో అడ్డగోలు ఆరోపణలతో ప్రభుత్వంపై మాజీ టి.హరీష్ రావు బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని ఇది సరికాదని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. ఆయన తన్నీరు హరీష్ కాదు.. అబద్దాల హరీష్ అని, అందుకే పచ్చిఅబద్దాలతో ఆయనను రైతులను అయోమయానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతులకు జిలుగు జనుము అందించడం లో ప్రభుత్వం పై హరీష్ రావ్ చేసిన ఆరోపణలు అర్ధరహితమన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ముందస్తుగానే పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ వానకాలం 2025 సీజన్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పచ్చిరొట్ట విత్తనాలను 88,000 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు గుర్తుచేశారు. వీటితో పాటు ఇంకా రైతుల అవసరం మేరకు పచ్చిరొట్ట విత్తనాలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారుప అనవసరపు ఆరోపణలు చేయకుండా హరీష్ రావ్ వాస్తవాలను తెలుసుకోవాలని హితువు పలికారు.

**జిల్లాల వారిగా అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు :**
తెలంగాణ వ్యాప్తంగా జీలుగ–82,058 క్వింటాళ్లు, జనుము–5,836 క్వింటాళ్లు, పిల్లిపెసర –106 క్వింటాళ్లు జిల్లాల వారీగా అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రైతులు 60,165 క్వింటాళ్లు ఉపయోగించుకున్నారని ఆయన వెల్లడించారు. అదేవిధంగా జిల్లాల వారీగా రైతులు జీలుగ – 57,677 క్వింటాళ్లు, జనుము – 2,484 క్వింటాళ్లు, పిల్లిపెసర – 4 క్వింటాళ్లు కొనుగోలు చేశారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఇంకా పచ్చిరొట్ట విత్తనాలు 27835 క్వింటాళ్లు నిల్వ వున్నాయని ,ఇందులో జీలుగ– 24381 క్వింటాళ్లు, జనుము – 3352 క్వింటాళ్లు, పిల్లిపెసర – 102 క్వింటాళ్లు ఉన్నాయని వెల్లడించారు.

## నేడు, రేపు ‘మహిళా శిశు సంక్షేమ శాఖ’మేదోమథనం సదస్సు

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4,5వ తేదీలు రెండు రోజులపాటు హైదరాబాద్,రాజేంద్రనగర్ లోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాంగణంలో మేధో మథనం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీలు, పథకాలు, మహిళా శిశు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, నూతన విధానాలపై రెండు రోజులపాటు విస్తృతంగా చర్చించనున్నారు. బెస్ట్ ప్రాక్టీస్‌తో పాటు ఇతర జిల్లాల్లో అమలు చేసే కార్యాచరణ, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి, దివ్యాంగుల సంక్షేమం తదితర అంశాలు కూడా చర్చకు రానున్నాయి. ఈ సమావేశానికి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, జిల్లా సంక్షేమ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొననున్నారు.

## క్యాబినెట్ సమావేశంలో..ఆర్‌టిసి కార్మికుల వేతన సవరణ చేయాలి
ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలైన ఆర్‌టిసి, విద్యుత్ సంస్థలలో ప్రభుత్వం సమన్యాయం పాటించడంలేదని, గురువారం జరిగే క్యాబినెట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికులకు సమన్యాయం చేస్తూ నిర్ణయం ప్రకటించాలని ఆర్‌టిసిబోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిత్యం 70లక్షల మంది ప్రయాణికులతో మమేకమవుతు సేవలందించే కార్మికుల ఆదరణ కోల్పోవొద్దని ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఆర్‌టిసి వేతన సవరణకి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయం చేసే అవసరంలేదని, ప్రభుత్వ అనుమతి మాత్రమే అవసమని అన్నారు. ఖర్చు పూర్తిగా ఆర్‌టిసిదేనని ప్రభుత్వం భయపడాల్సిన పరిస్థితిలేదని పేర్కొన్నారు.

## ఇందిరా డెయిరీ ఏర్పాటు
డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/మధిర:ఇందిరా డెయిరీ గొప్ప ఆశయంతో చేపట్టిన మహోన్నత కార్యక్రమమని, అధికారులు మనస్ఫూర్తిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మధిర క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిఆర్‌డిఒ పిడి సన్యాసయ్య, వెలుగు, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరా డైరీ పథకంలో ప్రతి లబ్ధిదారునికి రెండు గేదెలు అందచేయాలని, సభ్యులు ఎటువంటి కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కాంట్రిబ్యూషన్‌కు సంబంధించిన సభ్యులకు అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందిరా డైరీ సభ్యులకు భూమి ఉండాలన్న నిబంధన ఏదీ లేదని, అసలు గేదెలు లేని వారికి ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.



## ‘పునాస’ పత్రికను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ సాహిత్య అకాడమీ చేస్తున్న కార్యక్రమాలలో’ పునాస ’ పత్రికను ప్రచురించడం గొప్ప విషయం అనీ, అందులో తెలంగాణ ప్రముఖులైన కొందరి శతజయంతి సందర్భంగా ప్రత్యేక సంచికలు తీసుకురావడం చాలా బాగుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన ఆచార్య బిరుదురాజు రామరాజు ప్రత్యేక సంచిక ‘పునాస’ను మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఆవిష్కరించారు. రామరాజు లాంటి గొప్ప పండితుడు, పరిశోధకుడు తెలంగాణలో జన్మించడం ఈ నేల చేసుకున్న అదృష్టం అన్నారు. గత సంవత్సరం దాశరథి కృష్ణమాచార్యపైన ఓ ప్రత్యేక సంచికను ముద్రించినట్లుగానే ఇప్పుడు బిరుదురాజు రామరాజు పైన ఈ ప్రత్యేక సంచికను ప్రచురించినందుకు, ఇలాంటి సాహిత్యపరమైన అనేక కార్యక్రమాలు చేయడంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి కృషి ఎంతో ఉన్నదని ఆయనని అభినందిస్తూ మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, కవి యాకుబ్, దినకర్, మరికొందరు కవి మిత్రులతో పాటు సాహిత్య అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి



- కమాండ్ కంట్రోల్ సెంటర్ పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- 24 గంటలు అత్యవసర బృందాలు అందుబాటులో ఉండాలి
- చెరువులు, నాలాల అభివృద్ధి, రోడ్ల విస్తరణకు ప్రత్యేక పాలసీ రూపొందించాలి
- సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలి
- వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సమీక్షించిన సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై మంగళవారం ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జిహెచ్‌ఎంసి శాఖలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాల అత్యవసర బృందాలు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే గుర్తించిన 141 నీరు నిలిచే ప్రాంతాల్లో వరద నీరు నింపే సంపుల పనుల పురోగతిని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమేటిక్ పంపులతో బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎంఒ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## నష్టపోకుండా ఉండేలా ప్రభుత్వం త్వరలో విత్తన చట్టం
రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తమకు న్యాయం చేయాలని ములుగు జిల్లా విత్తనోత్పత్తి బాధిత రైతులు మరోసారి రైతు కమిషన్ చైర్మన్‌ను వేడుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ ఎం.కోదండరెడ్డితో పాటు సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి బాధిత రైతులతో మాట్లాడి ఇప్పటి వరకు జరిగిన అంశాలను ఆరా తీశారు. దీంతో ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం, అధికారులు వ్యవహరించిన తీరును బాధిత రైతులు చైర్మన్‌కు వివరించారు ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులతో జూమ్ సమావేశంలో నిర్వహించామని బాధిత రైతులకు చైర్మన్ వివరించారు. అన్ని విధాలుగా న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈఅంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని, రైతులు నష్టపోకుండా ఉండేలా ప్రభుత్వం త్వరలో విత్తన చట్టం తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సభ్యులు గోపాల్ రెడ్డి, భూమి సునిల్, భవానీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించాలి
టిపిసిసి అధికార ప్రతినిధి సామా రామ్మోహన్ రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్ : ఆర్థికశాఖ అనుమతి కూడా లేకుండా మాజీ ఐపిఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అమలుచేసిన కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించాలని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రవీణ్‌కుమార్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దళితుల పిల్లలకు అందాల్సిన సంక్షేమ పథకాలను ప్రవీణ్ కుమార్ దారిమళ్ళించారని, అంబేద్కర్ పేరు చెప్పి ఆయన రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం కాగ్ నివేదికలో పొందుపర్చిన అంశాలే బయటపెడుతున్నామన్నారు. కోడింగ్ విధానంపై ఏడాదికి రూ.4కోట్లు ఖర్చు చేశారని, 240 మంది పిల్లలకు కోడింగ్ చేస్తే రూ.4కోట్లు ఖర్చు అవుతాయా అని ప్రశ్నించారు. మూడు సంస్థల పేరుతో కోడింగ్ నేర్పిస్తామని, రెండు సంస్థల అనుమతి తీసుకున్నారని, ఈటెండర్ ప్రక్రియ కూడా చేయలేదని, దళిత విద్యార్థుల పేరుతో లూటీ చేశారన్నారు. ఐఐటి, జెఇఇ ఆన్‌లైన్ కోర్స్‌కు రూ.20కోట్లు ఖర్చుపెట్టారని, టెండర్లే ఇవ్వలేదని, సమ్మర్ క్యాంప్‌ల పేరుతో కూడా నిధులు పక్కదారి పట్టించారని, యూనిఫామ్, దుప్పట్లను కూడా ప్రవీణ్ వదిలిపెట్టలేదన్నారు. ఆర్థిక శాఖ అనుమతిలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 1.20లక్షల మందికి కోడింగ్‌లో ఉచితంగానే శిక్షణ ఇస్తున్నదని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఎస్‌సి గురుకులాలలో 100 శాతం ఆక్యుపెన్సీ లేదని, కానీ ఇప్పుడు ఆ సీట్లు అన్నీ భర్తీ అయ్యాయన్నారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి ఎదగాలి

- పదవ తరగతి పరీక్షల్లో 593 మార్కులు సాధించిన దుర్గా భవాని, 590 పొందిన శివానిలు గర్వకారణం
- రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : మారుతున్న కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉన్నత స్థానాలకు చేరుకొని ఆదర్శంగా నిలవాలన్నారు. హైదరాబాద్ బేగంపేట్ ఐఎఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో మంగళవారం బిసి గురుకులాలు, హాస్టల్స్‌లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. 593 మార్కులు తెచ్చుకున్న దుర్గాభవాని, 590 మార్కులు తెచ్చుకున్న శివాని, 580 కి పైగా మార్కులు తెచ్చుకున్న 31 మంది, 570 పైన మార్కులు తెచ్చుకున్న 216 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వారి ప్రాంతానికి రాష్ట్రానికి పేరు తెచ్చారని మంత్రి అభినందించారు. బిసి గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారని, మంచి బోధన అందిస్తున్న అధ్యాపకవర్గానికి అభినందనలు తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో 17 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే వందల్లోనే 570 కి పైగా మార్కులు వచ్చాయన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణతే కాకుండా మంచి ర్యాంకులు వచ్చేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రయోజనాలు సంస్థ తరుపున ప్రభుత్వం నుండి ఎప్పటికప్పుడు ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ అకాడమీ నుండి 140 స్కూల్‌లలో 100 శాతం ఉత్తీర్ణత శాతం ఉందని, మిగిలిన పాఠశాలల్లో ఎందుకు తక్కువ వచ్చిందని, సమీక్షించాలన్నారు. సంవత్సరంలో 300 రోజులు పిల్లలు ఉపాధ్యాయుల వద్దనే ఉంటారని, వారు పేరెంట్స్ కంటే ఎక్కువ గురుకులాల్లోనే ఉంటారని, వాళ్లలో మంచి చదువు నైపుణ్యాలు అందించాలన్నారు. జ్యోతి బాపులే సినిమాను అన్ని గురుకులాల్లో ప్రదర్శిస్తామని, తల్లి దండ్రులతో ఈ సినిమాను చూడాలన్నారు. మహిళలు ఇంత గౌరవంగా చదువుకుంటున్నారంటే ఆనాడు సావిత్రి బాయ్ పూలే స్ఫూర్తి కారణమన్నారు. చదువు ఒక్కరి సొత్తు కాదని, అందరి సొత్తు అన్నారు. జ్యోతిబా పూలే ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధ్యాపకులకు మంత్రి శాలువా, మెమెంటో, ధ్రువపత్రాలు అందచేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాల మాయా దేవి, గురుకుల కార్యదర్శి సైదులు, ఎంబిసి ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య భట్టు, సిఈఓ అలోక్ కుమార్, వసతి గురువాహాల అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు

# ప్రభాకర్‌రావు విచారణకు హాజరయ్యేనా..

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబి) మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావు విషయంలో ఇటీవల కొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. గత నెల 29న సుప్రీంకోర్టులో ప్రభాకర్ రావుకు తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్టును పునరుద్ధరించేందుకు.. ప్రయాణ పత్రాలు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, ఆయనపై తదుపరి విచారణ వరకూ ఎలాంటి కఠినచర్యలు తీసుకోవద్దని సూచించింది. జూన్ 5న విచారణ కోసం హైదరాబాద్‌లోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు హాజరుకావాలని ఆదేశించింది. అయితే ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గురువారం విచారణకు హాజరుకావల్సి ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన విచారణకు హాజరవుతారా లేదా అనేది ఉత్కంఠ నెలకొంది. హాజరైతే మాత్రం ప్రభాకర్‌రావుపై ప్రశ్నల వర్షం కురిపించేందుకు దర్యాప్తు అధికారులు అన్ని సిద్ధం చేసుకున్నారు.

**అమెరికాలో ఆశ్రయం తిరస్కరణ..**
ప్రభాకర్ రావు అమెరికాలో రాజకీయ ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అమెరికా ప్రభుత్వం ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది, తద్వారా ఆయనపై డిపోర్టేషన్ ముప్పు పెరిగింది . ఈ క్రమంలోనే గత నెల 22న నాంపల్లి కోర్టు, ప్రభాకర్ రావును ‘ప్రోక్లెయిమ్డ్ ఆఫెండర్’గా ప్రకటించింది. మరోపక్క హైదరాబాద్ పోలీసులు ఆయన నివాసం వద్ద ప్రభాకర్ రావు కనిపించడం లేదని ప్రకటనను అంటించి, సమీప ప్రాంతాల్లో ప్రజలకు తెలియజేశారు.

**కేసు నేపథ్యం..**
ఈ కేసులో 201823 మధ్యకాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, విపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తుల ఫోన్ కాల్‌లను అనధికారికంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కార్యకలాపాలు బిఆర్ఎస్ ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలు కల్పించేందుకు జరిగినట్లు తెలంగాణ పోలీసులు ఆరోపిస్తున్నారు.ప్రభాకర్ రావు జూన్ 5న విచారణకు హాజరైన తర్వాత, ఈ కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



## అట్టహాసంగా సిపిఐ జనగామ జిల్లా మహాసభలు
బహిరంగ సభకు భారీగా తరలొచ్చిన శ్రమజీవులు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువైన పోరాటాల గడ్డ జనగామ జిల్లాలో జరుగుతున్న సిపిఐ జిల్లా 4వ మహాసభలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభం అ య్యాయి. జిల్లాలోని నర్మెట మండలంలో ప్రారంభం కాగా మొదటి రోజు జరిగిన బహిరంగ సభ, ర్యాలీకి కష్టజీవులు భారీగా తరలి వచ్చారు. ఎర్ర చొక్కాలు వేసుకొని, ఎర్ర చీరలు కట్టుకొని, సంకలో సంచి చేతిలో జెండా అన్నట్లు చిన్న పిల్లలు మొదలు కొని 80 ఏండ్ల వృద్దుల వరకు కదలి వ చ్చారు. వారిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అప్యాయంగా పలకరించి ఉద్యమ భీజాలు నాటింది వీరే అంటు అందరికి పరిచయం చేశారు. మొదటి రోజు జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలనే లక్ష్యంతో సిపిఐ శ్రేణులు జన సమీకరణపై దృష్టి పెట్టాయి. వర్షాకా లం ప్రారంభమై విత్తనాలు విత్తుతున్న నేపథ్యంలోనూ కార్మికులు, కర్షకు లు, వ్యవసాయ కూలీలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. జనగామ పట్టణం నుండి వివిధ రంగాల్లో పనిచేసే హమాలీ కార్మికులు సొంత ఖర్చులతో డిసిఎంలు ఏర్పాటు చేసుకొని కదలొచ్చారు. చిల్పూరు మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన కార్మికులు ప్రభుత్వ భూముల కబ్జాను నిలదీస్తూ పోరాటం చేస్తుండగా వారంతా ఊరూ ఊరుగా కదలొచ్చిన సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. మహిరంగ సభకు ముందు భారీగా తరలొచ్చిన జనంతో బస్టాండ్ నుండి ర్యాలీ నిర్వయించారు. ర్యాలీ ముందు బాగంలో కూనంనేని సాంబశివరావు, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిహెచ్ రాజారెడ్డిలు ఉన్నారు. వారి వెనకాల నాయకత్వం, వారి వెనకాల జనం ఎర్రజెండాలో జేజేలు కొడుతు వినాయక పంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వయించారు. ర్యాలీ తరువాత సైతం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఒక విధంగా చూస్తే భారీగా తరలి వచ్చిన సిపిఐ శ్రేణులతో పంక్షన్ హాల్ కిక్కిరిసిపోయింది. కూనంనేని సాంబశివరావు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వివరించడంతో పాటు దేశంలో దోపిడి దారులు, బిజెపి హిందుహిజం, కాంగ్రెస్‌తో పొత్తుకు కారణాలు, బిఆర్ఎస్‌ను ఎందుకు ఓడించా ల్సి వచ్చిందనే విషయాన్ని ప్రజలకు అర్థం అయ్యే విధంగా వివరించారు. కూనంనేని మాట్లాడుతున్నంత సేపుప్రజలునిశబ్దంగాఉపన్యాసాన్ని విన్నా రు. పెద్ద సంఖ్యలో జనం తరలి రావడంతో నర్మెట ఎరుపుమయమైంది.

# ‘మేడారం’కు ముందస్తు ప్రణాళికలు
రాష్ట్ర మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: వచ్చే సంవత్సరం 2026లో జరగనున్న మేడారం మహాజాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రాబోతున్నందున ప్రకృతి వైపరీత్యాల నుండి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క రానున్న మేడారం మహా జాతరను, భారీ వర్షాలు పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి శబరీష్, ఐటిడిఏ పిఓ చిత్రమిశ్రా, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో జరిగిన మహా మేడారం జాతర సందర్భంగా పనిచేసిన జిల్లా అధికారులు నేటికి జిల్లా అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని, జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 33 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని రానున్న రోజులలో జాతరలో శాశ్వత పనులను నాణ్యతతో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ముఖ్యంగా జాతర మారకుండా భక్తులకు ఇబ్బందులు కల్గకుండా పనులు చేయాలని తెలిపారు. పూర్తి స్థాయిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం మంచినీటిని సరఫరా చేయాలని, గద్దెల ప్రాంతంలో భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పోలీస్ యం త్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, భక్తులు సులభతరంగా దర్శనాలు ముగించుకునే విధంగా క్యూలైన్‌లు, వాటి పై షెడ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాను న్న రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున గ్రామాలలోని కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీరు ప్రవహించే కాలువల లోని గుర్రపు డెక్క మొక్కలను తొలగించాలని తెలిపారు. గత వర్షాకాలంలో జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని పలు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అన్నారు.

జిల్లా కేంద్రం నుండి ఏటూరునాగారం వరకు గత జాతీయ రహదారి ఇరువైపు ల గల చెట్లను అటవీశాఖ, ఆర్అండ్‌బి సిబ్బంది పర్యవేక్షించాలని, అందులో బలహీనమైన చెట్ల ను గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. డిఎస్‌పి రవీందర్, ఆర్‌డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, మేడారం పూజారులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతన్న నేస్తం పథకం ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్

ప్రజాపక్షం/పెబ్బేరు : పంటల సాగులో నాణ్యమైన విత్తనం పాత్రను గుర్తించి జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటీ ఈ సంవత్సరం నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే ఒక పథకాన్ని ప్రారంభించింది. ఈ విత్తనాలు సాగు చేసిన రైతులు రెండు మూడు సంవత్సరాల వరకు వాడుకోవచ్చు. ఎంపిక చేయబడిన రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వబడుతాయన్నారు. పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి గ్రామంలో రైతు వేదిక దగ్గర మండలంలోని ఉన్న గ్రామాలు తోమాలపల్లి, రామమ్మపేట, కంచిరావుపల్లి, పెంచికలపాడు భూనాదిపురం, వివిధ గ్రామాలకు విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసులుగౌడ్, వ్యవసాయ అధికారి షేక్ మున్న, పాలెం శాస్త్రవేత్త శ్రీరాం, వర్కింగ్ ప్రెసిడెంట్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ , వెంకట్రాములు, రంజిత్ కుమార్ ,జగదీశ్వర్ రెడ్డి, ఏఈఓలు చక్రవర్తి, ఆంజనేయులు, రజిత తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : తెలకపల్లి మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్చన, వ్యవసాయ అధికారిణి నర్మద ఆధ్వర్యంలో 40మంది రైతులకు వరి విత్తనాలను, 20మంది రైతులకు జొన్న విత్తనాలను పంపిణీ చేసినట్లు డాక్టర్ అర్చన తెలిపారు. విత్తనాలను తీసుకొని సాగుచేసిన రైతన్నలు సకాలంలో యాజమాన్య పద్దతులు పాటించి మంచిదిగుబడులు పొందాలని కోరారు. మండలంలోని మొత్తం



9క్లస్టర్ల ప్రతి రెవెన్యూ గ్రామంలోను ముగ్గురు ఆదర్శ రైతులను గుర్తించి విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలు లేని రాష్ట్రమే లక్ష్యం



కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్

ప్రజాపక్షం/మాగనూర్ : కల్తీ విత్తనాలు లేని రాష్ట్రంగా తయారు చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం పేరున మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశానుసారం స్థానిక రైతు వేదికల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో ఏఓ సుదర్శన్ గౌడ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా 10 కేజీల వరి విత్తనాలు, 3 కేజీల కందులు మాగనూరు మండలంలో ప్రతి గ్రామానికి ముగ్గురు రైతులను ఎంపిక చేసి పంపిణీ చేశారు. ఆ రైతులు పండించిన పంటలతో రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు అందించి నకిలీ విత్తనాలు లేని రాష్ట్రంగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుదర్శన్ గౌడ్, ఏఈఓలు పవన్, రాధిక, రైతులు, వంశీ, అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## 8న వేణుగోపాలస్వామి విగ్రహ పునః ప్రతిష్ట



ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రూ.7 లక్షల విరాళం అందజేత

ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ పట్టణంలోని యాదానగర్లో కొలువైన పురాతన వేణుగోపాలస్వామి ఆలయాన్ని పునర్నిర్మించి ఈ నెల 8వ తేదీన వేణుగోపాలస్వామి విగ్రహ పున ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ను మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయపుర నిర్మాణానికి ఎమ్మెల్యే ఏడు లక్షల రూపాయలు విరాళం అందచేశారు. ఉత్సవాల్లో భాగంగా వేణుగోపాల స్వామి విగ్రహంతో పాటు గణపతి, గరుత్మంతుడు ధ్వజస్తంభం, శిఖరం పున ప్రతిష్ఠ చేస్తున్నామని, మూడు రోజుల పాటు జరిగే పున ప్రతిష్ఠ ఉత్సవాలకు మక్తల్ పట్టణ పరిసర గ్రామాల ప్రజలు పెద్దల సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్, కోశాధికారి కట్టా సురేష్, ఇతర కమిటీ సభ్యులు కావలి ఆంజనేయులు, కావలి శ్రీహరి, నేతలు కోళ్ళ వెంకటేష్,తిరుపతి నరసింహులు మామిళ్ళ కిష్టప్ప, అంజయ్య ఆచారి, బుగ్గప్ప తదితరులు కోరారు.

## అందరం కలిస్తేనే అభివృద్ధి



ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి పట్టణంలోని పాన్‌గల్ రోడ్డులలో గల 22,23 వార్డులలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రోడ్డు విస్తరణలో నివాసాలను కోల్పోతున్న బాధిత కుటుంబాలను నేరుగా కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వనపర్తి ఆర్డీఓ, తహసీల్దార్ , మున్సిపల్ కమిషనర్ , సిబ్బందితో బాధితులను కలిసిన ఎమ్మెల్యే క్షేత్ర స్థాయిలోనే బాధితులకు కావాల్సిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పార్టీ పాలనలో రోడ్ల విస్తరణకు అంకురార్పణ చేశారని, నాడు ఎన్నో హామీలను గుప్పించి అడుగడుగునా తమను మోసం చేసి పోయారని ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వారి గోడును వెళ్లబోతున్నారు. బాధితుల నష్టాన్ని బట్టి కావాల్సిన పరిహారాన్ని అందించాలని వారు కోరారు. ఇప్పటికే కొంత మందికి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించారని అవి ఉపయోగానికి పనికి రాకుండా ఉన్నాయని, వాటిని సరి చేసి ఇవ్వాలని , అదే విధంగా వృద్దులైన తమకు సెకండ్ ఫ్లోర్ థర్డ్ ఫ్లోర్లలో ఇండ్లను కేటాయిస్తే వెళ్లలేకపోతున్నామని వారు వాపోయారు. తమకు అనుకూలమైన చోట ఇప్పించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. బాధితుల నుంచి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు వెడల్పు చేయడం తప్పనిసరి అనీ దానికి అందరూ సహకరించాలని రోడ్డు వెడల్పులో ఇండ్లను కోల్పోతున్న ప్రతి ఒక్కరికి వారి వారి నష్టానికి తగినట్లుగా తగిన సహాయ సహకారాలు అందజేస్తామని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ , మాజీ కౌన్సిలర్లు, అధికారులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,బాధితులు పాల్గొన్నారు.

## వేసవి సంగీత నృత్య శిక్షణా శిబిరం అభినందనీయం :ఎమ్మెల్యే



ప్రజాపక్షం/కల్వకుర్తి : వేసవిసెలవులలో చిన్నారులకు సంగీత నృత్య శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కొనియాడారు. స్వర్ణభారతి కళానిలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా కల్వకుర్తి, అచ్చంపేట, తెలకపల్లి వేసవి సంగీతనృత్య శిక్షణా శిబిరం ముగింపు ఉత్సవాలు స్థానిక కెసిఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నారాజు మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రూప్ 1 విజేత డా.యం.సాహితిని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బిసి కమీషన్ మాజీసభ్యులు ఆచారి, సంస్థతరపున శాలువా, మెమొంటోతోవేర్వేరుగా సత్కరించారు. కార్యక్రమంలో నెలరోజులపాటు విద్యార్థులు నేర్చుకున్న కూచిపూడి, జానపద, పాశ్చాత్య నృత్యాలతోపాటు లలిత, జానపద సంగీతానికి సంబంధించిన కళలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్మన్ ఎడ్మ సత్యం, బృంగి ఆనంద్‌కుమార్, సింగం విజయ్‌గౌడ్, పాపిశెట్టిరాము, రామకృష్ణ, నరేశాచారి, శేఖర్,రాజు, అంజి, జీవిత, రాధిక పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల రెండోదశకు శ్రీకారం

కలెక్టర్ బదావత్‌సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : పేదల ఆశలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, లక్ష్యసాధన కోసం అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, అర్హులకుమాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందాలని, హౌసింగ్ ఎండి. విపిగౌతమ్, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్‌లు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ఎండి. విపిగౌతమ్, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎంపిక చేసిన పైలట్ ప్రాజెక్టు గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలతో, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశమందిరంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి జిల్లాలో మొదటిదశలో చేపట్టిన పైలట్ గ్రామాలవారిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, ఇందిరమ్మ ఇండ్లు రెండోదశలో ఎంపిక



చేయనున్న లబ్ధిదారుల వివరాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనేది రాష్ట్రప్రభుత్వ ప్రధాన ఆశయమని స్పష్టంచేశారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రామ, కమిటిలు గుర్తించినవారితోపాటు ఎవరైన నిరుపేదలు ఉంటే పూర్తి వివరాలు తీసుకొని ఇండ్లు ఇవ్వాలని సూచించారు. గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందన్నారు. ఈసమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, పిడిహౌసింగ్ సంగప్ప, పిడి డిఆర్‌డిఎ చిన్న ఓబులేసు, డిప్యూటి సిఈవో గోపాల్‌నాయక్, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

**భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి**

భూసమస్యల శాశ్వత పరిష్కారంకోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులోభాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నేటినుంచి ఈనెల 19వతేది వరకు నిర్వహించనున్న భూభారతికింద రెవెన్యూ సదస్సుల్లో భాగంగా నాగర్‌కర్నూల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు చేపట్టగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖిమాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూసమస్యలు పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలుచేస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని మిగతా 19మండలాల్లో గల అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈనెల 20వతేదివరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14వ తేదిలోపు భూభారతికింద వచ్చిన అన్ని ఆర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. నిర్ణీత షెడ్యూల్‌ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి ఆర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్‌చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

## అత్యాధునిక యంత్రాలతో ధాన్యం సేకరణ

పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్. చౌహన్

ప్రజాపక్షం/వనపర్తి : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సెక్రటరీ డిఎస్ చౌహన్ వనపర్తి జిల్లాలో పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లుతో కలిసి పాన్‌గల్ మండలంలోని వెంగళాయిపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న మీడియాతో మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం ఒకసారి కొనుగోలుకేంద్రానికి చేరుకున్న తర్వాత పూర్తి బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదే అన్నారు. తెలంగాణ చరిత్రలో తొలిసారి నాణ్యమైన వడ్లు సేకరించేందుకు వ్యాక్యూం పాడి క్లీనర్లు కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందన్నారు. రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అండగా ఉండి మొత్తం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. నాణ్యమైన వడ్లు



మిల్లులకు ఇస్తే ఒక్క గ్రామ తరుగు చేస్తే తనకు ఫిర్యాదు చేయాలనిరైతులకు భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్ , డిఎం. సివిల్ సప్లై జగన్మోహన్ తదితరులు ప్రిన్సిపల్ సెక్రటరీ వెంట ఉన్నారు.

# పేద ప్రజల సొంతింటి కళ సాకారం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : పేద ప్రజల సొంతింటి కళ సాకారం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హన్వాడ మండలంలోని కొత్తపేట, టంకర, పెద్ద దర్పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ పత్రాలు అందించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. టంకర గ్రామంలోని రైతు వేదిక దగ్గర పలువురు రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎవరు అమ్మినా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేవారు. ఎవరైన ఆత్మగౌరవంతో జీవించాలనేదే ప్రజా ప్రభుత్వ



లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని ఆయన గుర్తు చేశారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని, మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని 500 రూపాయలకే సిలిండర్, రైతులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చామని, రైతులు పండించిన సన్న వడ్లు కు 500/ రూపాయల బోనస్ ఇచ్చామని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ మారేపల్లి సురేందర్ రెడ్డి, బుద్దారం సుధాకర రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ కృష్ణయ్య యాదవ్, చెన్నయ్య, ఓబిసి సెల్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, కిసాన్ సెల్ చైర్మన్ గంగిరెడ్డి, లింగం నాయక్, కేశవులు, రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిజైన్, సాంకేతికతతో ఇండ్లు నిర్మించుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయ

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశించిన డిజైన్, సాంకేతికతకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయ కోరారు. మంగళవారం ఆమె రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. కాగా రంగారెడ్డిగూడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింత 175 ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13 ఇండ్లకు సంబంధించి బేస్మెంట్లు, 25 ఇండ్లు నిర్మాణంకు మార్కింగ్ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారు ఆంజనేయులుతో మాట్లాడారు. ఎన్ని చదరపు అడుగులలో బేస్‌మెంట్ నిర్మించారు అని కలెక్టర్ అడిగారు. 547 చదరపు అడుగులలో నిర్మించినట్లు లబ్ధిదారుడు తెలిపారు. ఇల్లు కట్టడానికి ఎంత ఖర్చు అవుతుందని అని అడిగాడు. 10 లక్షలు అవుతుందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన డిజైన్ ప్రకారం యూనిట్ కాస్ట్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారులు సూచించిన విధంగా ఇండ్లు నిర్మించుకోవాలని, ఎక్కువ ఖర్చు చేసి అప్పులపాలు కావద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇసుక సరఫరా గురించి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు కావలసిన ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని సూచించారు. ఇండ్లు మంజూరు చేసిన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకునేలా అధికారులు, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకునేలా అధికారులు, ఇందరిమ్మ కమిటీ సభ్యులు అవగాహన కలిగించాలని అన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి/అడ్డాకుల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూ భారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ గ్రామసభలు ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం జూన్ 3 నుండి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారం చేయనున్నట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మూసాపేట మండలంలో ఇప్పటికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని అన్నారు. మంగళవారం ఆయన అడ్డాకుల మండలం శాఖాపూర్, భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామాలలో జరుగుతున్న సదస్సులలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు పాల్గొన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రెవెన్యూ గ్రామసభలను పక్కాగా నిర్వహించాలని దరఖాస్తు దారులకు ముందస్తు ఫారాలను ఇవ్వాలని వారి యొక్క దరఖాస్తులను పరిశీలించి స్వీకరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/నర్వ : నర్వ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జరిగిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల 51 మంది కళ్యాణలక్ష్మి లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. 21 మంది బాధితులకు సీఎం రిలిఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వం అందజేసిన కంది విత్తనాలను కొందరు రైతులకు శాంపిలుగా ఉచితంగా పంపిణీ చేశారు. వాటిని పండించి ఇతర రైతులకు కూడా అందించాలనే ఉద్దేశ్యంతో విత్తనాలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. 700 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన తెలిపారు. సంక్షేమ పథకాల విషయాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా విడతలవారిగా ఎంపిక చేసి అందజేస్తామన్నారు. అనంతరం యాంకి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరి గోడకు 9 లక్షల నిధులతో మంజూరైనటువంటి పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, నాయకులు డి.కృష్ణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్ రెడ్డి, శరణప్ప, రాము, అశోక్, సంజీవరెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం



జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజాపక్షం/పాన్‌గల్ : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. జిల్లాలో జూన్ 3 నుంచి జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో మంగళవారం పాన్‌గల్ మండలంలోని బండపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూసదస్సులో, రెవెన్యూ అధికారులు మీ గ్రామానికి వచ్చారని, భూ సమస్యలు ఏమున్నా నిర్ణిత ప్రోఫార్మలో పూరించి అధికారులకు ఇవ్వాలని , అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. సాదా బైనామపై వివరిస్తూ 2020 సంవత్సరంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని ఇప్పుడు పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని, మిగిలిన సాదాబైనామా దరఖాస్తుల విషయంలో కోర్టు నుండి సూచనలు వచ్చాక పరిశీలించడం జరుగుతుందన్నారు. షెడ్యూలు ప్రకారం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ సత్యానారాయణరెడ్డి, ఆర్ఐ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి భూభారతి



ప్రజాపక్షం/బిజినేపల్లి : భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమైందని తహసీల్దార్ సిహెచ్ రవికుమార్ అన్నారు. అల్లిపూర్, ధర్మాపూర్, బోయాపూర్ గ్రామాల్లో మంగళవారం భూభారతిచట్టం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతిచట్టంలో పొందుపర్చిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి తోడ్పడతాయన్నారు. భూభారతిచట్టంలో అప్పీలు వ్యవస్థ కీలకంగా మారిందన్నారు. అన్యాయం జరిగితే ఆర్‌డిఓ, కలెక్టర్, సిసిఎల్ స్థాయిల్లోను అప్పీలు చేసుకునే అవకాశం భూభారతి చట్టంలో కల్పించారని వివరించారు. భూభారతిచట్టంరావడం వల్ల రైతుల సమస్యలు పరిష్కారం త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. ప్రతిగ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల భూసమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈసదస్సులో పిఎసిఎస్ మాజీచైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, దాసర్ల సైదులు, వెంకటస్వామి, రెవెన్యూ సిబ్బంది భారతిభాయ్, రేఖ, తేజస్విని, రాఘవేందర్, నిరంజన్, బాలరాజు, అరుణ, మాధవి, రమేష్, శ్రీహరి పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి :టీయూడబ్ల్యూజె వినతి



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : వనపర్తి జిల్లా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్య సంస్థలలో ఉచిత విద్యను అందించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం డిఈఓ, డిఐఈఓలను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, సీనియర్ పాత్రికేయులు ఊషన్నలు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ఏడాది అందించే విధంగా ఈ ఏడాది కూడా ఉచిత విద్యను అందించే విధంగా ప్రైవేట్ పాఠశాలలకు సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని కలిసి జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఉచిత విద్యతో పాటు రాయితీతో కూడిన విద్యను అందించే విధంగా సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. అనంతరం ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి వినోద్ కుమార్‌ను కలిసి ప్రైవేట్ జూనియర్ కళాశాలలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు మన తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ బి.రాజు, వార్త స్టాఫ్ రిపోర్టర్ విజయ్, ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ టియ అరుణ్ రాజ్, ఎన్టీవీ అంజి, నర్సింహరాజ్ , బిగ్ టీవీ అరుణ్, మనం డివిజన్ రిపోర్టర్ దాచ హరీష్, ఉర్దూ రిపోర్టర్ కమల్ , 6టీవీ ముక్తర్ , ఎన్ఎంటీవీ జియా, మన తెలంగాణ రిపోర్టర్ సురేష్, ఫోటోగ్రాఫర్ మహేష్ సింగ్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పెన్షన్లకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలి

రెవెన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** పెన్షన్లకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలని రెవెన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రైతు ఆత్మహత్య కుటుంబాలు, వితంతు పెన్షన్ ప్రతిపాదనలు తదితర అంశాలపై సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్ జిల్లా అదనపు కలెక్టర్‌లు, డిఆర్డిఓ, రెవెన్యూ భాగాల సంబంధించిన అధికారులతో జూమ్ సమావేశం ద్వారా సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి ఆర్థిక సహాయం పొందే విధంగా దరఖాస్తుల స్వీకరించి ప్రతిపాదన రూపొందించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం నుండి పెన్షన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. స్టేట్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తు లను కూడా పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/చండూరుః** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను ఎలాంటి ఇబ్బందులకు లోనుకాకండా పకడ్బందీ గా నిర్వహించాలని నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం చండూరు మండలంలోని కుమ్మందానిగూడెం , తుమ్మలపల్లి రెవిన్యూ గ్రామాలలో మొదటిరోజు రెవిన్యూ సదస్సును నిర్వహించారు. తుమ్మలపల్లి గ్రామ రెవిన్యూ సదస్సును జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ , ఆర్డీఓ రమణారెడ్డి సందర్శించారు. అక్కడికి వచ్చిన రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను దరఖాస్తు ఫారం ద్వార అధికారులకు అందజేయాలని చూచించారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేయడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల వివరాలపై రెవిన్యూ అధికారులు పూర్తి అవగాహన కలగిఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి , డిప్యూటీ తహసీల్దార్ నిర్మల , ఆర్‌ఐలు శేఖర్ , మురళి పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** గ్రామస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి కీలకంగా మారుతోందని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల్ మండలం అనంతపురం గ్రామంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులలో పాల్గొని భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, రిజిస్ట్రార్లు, దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు, ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. వారి భూ సంబంధిత సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కార మార్గాలపై సూచనలు ఇచ్చారు. అధికారులకు తగిన మార్గదర్శకాలు తెలియజేసి, సమస్యలు వేగంగా పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. భూ భారతి కార్యక్రమం ద్వారా గ్రామాలకు రెవెన్యూ అధికారులు వెళ్లి భూమి సంబంధిత సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో జూన్ 3 నుండి 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గ్రామాల్లో జరిగే భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## తడి,పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తడిపోడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో బాగంగా రెండవ రోజు మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కొమటికుంట ఎస్‌సి కాలనీ కమ్యూనిటీ హల్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించుటకు100 రోజుల ప్రణాళికనుసిద్దం చేసినట్లు, ఈ ప్రణాళికలో వీధులలో సంచరించు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, చిన్న పిల్లలకు కుక్కలకు దూరంగా ఉంచాలని అన్నారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని, వార్డులలో నీటి సరఫరాకు సంబంధించి క్లోరినేషన్ టెస్టులు చేయాలని, వార్డులలో నిరుపేద మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘం చేయుటకు ప్రతిపాదించినట్లు తెలిపారు. వార్డులలో వ్యాపారాలు చేయు వాటిని గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎఇ తిరుమలయ్య, వేనేపల్లి యాదిగిరి, టిఎంసి శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివ ప్రసాదు, వార్డు అధికారి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పరిపూర్ణ భాగస్వామ్యంతోనే నాణ్యమైన విద్య -సంస్కరణల అమలు సాధ్యం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** : విద్యార్థులు పరిపూర్ణ భాగస్వామ్యంతోనే నాణ్యమైన విద్యా, సంస్కరణలు అమలు చేయడం సాధ్యపడుతుందని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఖాజా ఆల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం వేసవికాలం సెలవులు ముగిసి విద్యాసంవత్సరం ప్రారంభమైన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు జూన్1తో ముగిసిన సందర్భంగా విద్యాసంవత్సరం మొదలు కావడంతో రెండు, నాల్గు సెమిస్టర్ విద్యార్థులు ఎంజియు సంస్కరణల సాఫల్యానికి భాగస్వాములు కావాలని సూచించారు. నాణ్య మైన విద్య వారి భాగస్వామ్యంతో మాత్రమే సాధ్యమని అందుకు 75శాతం హాజరు, అధ్యయనం పరిశోధన చర్చలు చాలా ముఖ్యమని అన్నారు. ఎంజియు పరిధిలోని నాలుగు కళాశాలలో తరగతులు , వసతి గృహాలు సైతం ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థులు వేసవి స్వల్ప నిడివి ముగిసినందున తమ లక్ష్య సాధనకై కృషి చేయాలని ఆయన సూచించారు.

## రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** రెవెన్యూ గ్రామసభలను భూ సమస్యలున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మండలంలోని జలాల్‌పురం గ్రామంలో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెవిన్యూ సదస్సులు పక్క ప్రణాళికతో నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాలకు రెవిన్యూ అధికారులు వచ్చి రైతులనుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు రసీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ రెవిన్యూ సదస్సులు 20వతేదీ వరకు జరుగుతాయని అన్నారు. పైలట్ ప్రాజెక్టులో బాగంగా గరిడేపల్లి మండలంలో ఇప్పటికే గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ చామంతి, డిఆర్‌డిఏ పిడి వివి అప్పారావు, ఆర్డీవో వేణుమాదవ్, డిపివో యాదయ్య, తహసిల్దార్ హరిప్రసాద్, ఆర్ఐ జాజిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అనిత పాల్గొన్నారు.

### మానవీయ కోణంలో భూ సమస్యల పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మునగాల:** రెవిన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం మునగాల మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామం, చిలుకూరు మండలంలోని కొండాపురం గ్రామాల్లో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవిన్యూ అధికారులు మానవీయ కోణంలో భూ సమస్యల పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో పారదర్శకత పాటిస్తాం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి** : పారదర్శకంగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు అందజేయడం జరిగిందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఏకే ప్యాలెస్‌లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలసి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇళ్ళు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఒక పండుగ వాతావరణంలో పారదర్శకంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. రేకులు, పై కప్పు లేని నిరు పేదలకు ప్రభుత్వం అండగా ఉంటూ 5 లక్షల సహాయం లబ్ధిదారులకు పభుత్వం అందిస్తుందన్నారు. ముందుగా బేస్మెంట్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం లక్ష రూపాయలు వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. లబ్ధిదారులకు ఏ ఇబ్బంది లేకుండా ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ పడుతుందన్నారు. ప్రతి పేద వారికి ఇండ్లు ఇవ్వాలనే ఆశతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ధనిక రాష్ట్రంలో పేద ప్రజల ఇబ్బందులు చూసి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు మనందరం ప్రభుత్వం కు ధన్యవాదములు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. భూమి ఉండి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే ప్రతి పేద వారు అతి తొందరగా బేస్మెంట్ పూర్తి చేసుకొని పభుత్వం అందిస్తున్న 5 లక్షల సహాయం పొందాలన్నారు. బేస్మెంట్ పూర్తి చేసుకున్న వెంటనే ప్రభుత్వం మీ ఖాతాల్లో లక్ష రూపాయలు జమ చేయడం జరుగుతుందన్నారు. తదుపరి బేస్మెంట్ వాల్స్, పై కప్పుకు ప్రభుత్వం ద్వారా పేదలకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారులు అతి తొందరగా ముందుగా బేస్మెంట్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తి , భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, జడ్పీ సీఈఓ శోభారాణి,ఎస్సీ కార్పొరేషన్ శ్యామ్ సుందర్, హౌసింగ్ పి. డి విజయ్ సింగ్, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 308 కిలోల నకిలీ విత్తనాలు పట్టివేత

ముగ్గురు అరెస్టు

జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలను తయారు చేస్తున్న వ్యక్తితో పాటు వాటిని అమ్ముతున్న మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి కె.నర్సింహా దినికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. తిరుమలగిరి మండల పరిధిలో మంగళవారం నమ్మదగిన సమాచారం మేరకు ఎ1 నిందితుడు సింగారపు యాదగిరి స్వామి కౌలు భూమిలో తనిఖీ చేసి అరెస్టు చేశారు. అతడి నుండి రూ.4.62 లక్షల 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలను వాటిని తయారు చేసే సామాగ్రిని స్వాదీనం చేసుకున్నారు. ఇతనితో పాటు ఈ నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న తిరుమలగిరి మండలంలోని నందాపురం గ్రామానికి చెందిన లోడంగి నవీన్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడురు మండలం చిర్రగుడూరుకు చెందిన చిత్తలూరి సోమనారాయణను అరెస్టు చేశారు. నకిలీ పత్తి విత్తనాలు తయారు చేసిన వీరు అధిక దిగుబడి వస్తాయని, తాము తక్కువ ధరకే ఇస్తామని నమ్మబలుకుతూ ప్యాకెట్ 1500 రూపాయలకు అమ్ముతున్నారు. నకిలీ పత్తి విత్తనాలు తయారు చేయడానికి ఉపయోగిస్తున్న 3ఫేజ్ ఆఫ్ ఇంచ్ హెచ్‌పి మోటార్, దానికి కలపడానికి డ్రమ్ములు, సల్ఫ్యూరిక్‌తో యాసిడ్ క్యాన్లు, పత్తి గింజలు రంగు రావడానికి షైన్‌స్టార్ డబ్బాలు కూడా సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి నర్సింహా మాట్లాడుతూ అన్నదాతలను మోసగించి నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదన్నారు. వారిపై పిడియాక్ట్‌లు నమోదు చేస్తామని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. 1986 చట్ట ప్రకారం వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు పట్టుకున్న కేసులో ప్రతిభ కనబర్చిన సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐ హరికృష్ణ, ఎఎస్‌ఐ వెంకన్న, హెడ్‌కానిస్టేబుల్ విద్యాసాగర్‌రావు, రాజేంద్రర్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్, కానిస్టేబులు ఆనంద్, మల్లేష్, సతీష్, శివకృష్ణ, ప్రభాకర్, మహిళ హోంగార్డు మంజూలను అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, తిరుమలగిరి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## నాణ్యమైన విత్తనాలు వాడి అధిక దిగుబడులను సాధించాలి

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులు నాణ్యమైన విత్తనాలను వాడి అధిక దిగుబడులను సాధించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న రైతు వేదికలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మిని కిట్ రూపంలో ఉన్న 48 వరి విత్తనాల ప్యాకెట్లను, 24 పెసర ప్యాకెట్లను రైతులకు అందించి మాట్లాడారు. సాగర్ ఎడమకాల్వ పరిధిలో మిర్యాలగూడ నియోజకవర్గం ఉండడం వల్ల వరిసాగు పైనే రైతులు ఆధారపడి ఉన్నారని తెలిపారు. రైతులు అధిక దిగుబడి రావాలంటే నీటితోపాటు నాణ్యమైన విత్తనం అవసరం ఉందన్నారు. జూన్ 12న ఏరువాక కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రతి ఒక్క రైతు నాగలి పట్టి విజయవంతం చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, గుండు నరేందర్, షేక్ జిందా, శంకర్‌రెడ్డి, పొలగాని శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, రైతులు ధర్మాన్నయ్య, సూర్యనాయక్, చల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు అడ్డంకులు కలిగించొద్దు

అఖిలపక్ష నాయకుల ఏకాభిప్రాయం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయనున్న భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సంఘసంస్కర్తలైన జ్యోతిరావుపూలే, సావిత్రి బాయిపూలే విగ్రహాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు ఎవరు అడ్డంకులు కలిగించవొద్దని పట్టణంలోని అఖిలపక్ష నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన కూడలి వీరబ్రహ్మేంద్రస్వామి గుడి పక్కన తాత్కలికంగా అంబేద్కర్, జ్యోతిరావుపూలే దంపతుల ప్లెక్సీలను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో భాగంగా రాగిచెట్టు కింద ఉన్న అంబేద్కర్ విగ్రహన్ని తొలగించడం జరిగిందని, అప్పటి పాలకులు అంబేద్కర్ విగ్రహన్ని ప్రధాన కూడలిలో నిర్మిస్తామని మాట ఇచ్చి, తప్పినందున అఖిలపక్షం ఆధ్వర్యంలో అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహ నిర్మాణ కోసం శంకుస్థాపన చేశామన్నారు. విద్యుత్‌శాఖ వారు అడ్డువస్తునందున మున్సిపాలిటి, తహసిల్దార్, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విగ్రహ ఏర్పాట్లకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్, బిజేపి పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి, పలు పార్టీల నాయకులు కొదమగుండ్ల నగేష్, వాసపల్లయ్య, ఇంజమూరి వెంకటయ్య, చిలకల రాజుశ్రీను, యడవల్లి చంద్రయ్య, డాల్పిన్, శ్రీనివాస్, తక్కెళ్ల నాగార్జున, శంకర్‌రెడ్డి, నీలా రామ్మూర్తి పాల్గొన్నారు.

## భూములపై పూర్తిహక్కులు కల్పించేందుకే భూభారతి చట్టం

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : రైతులకు వారి భూములపై పూర్తిహక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన తుర్కపల్లి మండలం గోపాల్ పూర్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. తుర్కపల్లి మండల తాసిల్దార్ దేశ్య నాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.




## విత్తనరంగంలో స్వయం సమృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ ప్రొఫసర్ ఏ .జానయ్య

**ప్రజాపక్షం/నల్లగొండ (తిప్పర్తి ):** రానున్న రెండు, మూడేళ్ళలో విత్తన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమని ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ .జానయ్య తెలిపారు. నాణ్యమైన విత్తనం రైతు నేస్తం పేరుమీద మంగళవారం ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ కు ఆయన తిప్పర్తి రైతు వేదికలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేసినట్లయితే తిరిగి దానిని ఇతర రైతులకు ఇవ్వడం ద్వారా రానున్న రెండు, మూడు ఏళ్లలో రాష్ట్రంలో విత్తన రంగంలో స్వయం సమృద్ధి సాధించిన వారమవుతామని అన్నారు. ఈ సంవత్సరం తొలకరి ముందే ప్రారంభమైనందున కొన్ని గ్రామాలలో నకిలీ విత్తన కంపెనీలు విత్తనాల పేరిట రైతులను మోసం చేసేందుకు సిద్ధమయ్యాయని, నకిలీల బెడద లేకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన రిజిస్టర్డ్ విత్తనాలనే వాడాలని ఆయన కోరారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ మాట్లాడుతూ నకిలీ విత్తనాల వల్ల రైతులు మోసపోకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విత్తనాలను రూపొందించి వాటిని రైతులకు పంపిణీ చేయడం ద్వారా తిరిగి రైతులు అదే విత్తనాలను ఉపయోగించి నాణ్యమైన పంటలు పండించుకునేందుకు చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లాలో ఉన్న 564 రెవెన్యూ గ్రామాలలో గ్రామానికి ముగ్గురు లేదా నలుగురు చొప్పున రైతులకు ఇన్పుట్ సీడ్ ను ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో 12 లక్షల ఎకరాలలో వ్యవసాయ సాగుకు ఆవకాశం ఉందని, అనేకమంది రైతులు వివిధ విత్తనాల కొనుగోలు సందర్భంగా నకిలీ విత్తనాల బారిన పడి మోసపోతున్నారని, అలా కాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ఫౌండేషన్ సీడ్ పంపిణీ చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి ,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి ,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ ,తిప్పర్తి మండల వ్యవసాయ అధికారి సన్నీ రాజ్, తదితరులు హాజరయ్యారు.అనంతరం జిల్లా కలెక్టర్ పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ నిర్మాణంలో ఉన్న ఎమ్మార్సీ భవనం, భవిత కేంద్రం నిర్మాణ పనులను తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో ర్యాంపు, రైలింగ్, టాయిలెట్లు వంటి ముఖ్యమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, హెడ్మాస్టర్లను ఆదేశించారు.



## గీత వృత్తిని నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి ఆరోపణ

**ప్రజాపక్షం/వేములపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం మద్యపానం విచ్చలవిడిగా ప్రోత్సహిస్తూ గీత వృత్తిని నిర్వీర్యం చేస్తూ గీతా కార్మికుల పొట్టలు కొడుతుందని గీతా పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి ఆరోపించారు.మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం లో జరిగిన గీత పనివారాల సంఘం నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులకు ఎక్సిగేషన్ చెల్లింపులో గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని దీనివల్ల గీత కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 2022 సంవత్సరం నుండి సుమారు రూ. 12. 50కోట్లు పెండింగ్ లో ఉన్న ఎక్స్‌గ్రేషియే వెంటనే విడుదల చేసి గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హరితర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో తాటి, ఈత,ఖర్జూర చెట్లను నాటించి వాటిని సంరక్షించి గీత వృత్తిదారులకు వృత్తి కాపాడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో విచ్చలవిడిగా కిరాణం షాపులతో పాటు గల్లి,గల్లిలో నడుపుతున్న బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. గీత వృత్తిదారులకు వృత్తి వృత్తిని ప్రోత్సహించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో ఏర్పాటు చేసిన నీరా ప్రాజెక్టుని పునరుద్ధరణ చేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు,మాజీ ఎం పి బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఐడెంటి కార్డులు లైసెన్సులను ఇబ్బంది పెట్టకుండా సూపర్డెంట్ వెంటనే ఇవ్వాలని అన్నారు జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ చనిపోయిన గీతా కార్మికుల పింఛను వారి భార్యలకు వితంతు పింఛనుగా మార్చి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సురిగి చలపతి , నాయకులు వనం వెంకన్న, నకరికంటి స్వామి, లెనిన్, అక్కలయ్య పాల్గొన్నారు.




## శాంతికి మారుపేరు సూర్యాపేట

బక్రీద్‌ను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి: డిఎస్



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** బక్రీద్ పండుగను సోదరభావంతో కులమ తాలకు అతీతంగా జరుపుకోవాలని డిఎస్‌పి ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణం మర్చంట్ ఫంక్షన్‌హల్‌లో పీస్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కుల, మతాలకు అతీతంగా సుహృద్భావ వాతావరణంలో పండుగలు జరుపుకునే సంప్రదాయం ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. ఈ నెల 7న బక్రీద్ పండుగ దానిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. సాంప్రదాయాల నుంచే చట్టాలు వచ్చాయని అన్నారు. సోషల్ మీడియాను వేదిక చేసుకుని కుల మతాల మధ్యలో విభేదాలు సృష్టించే వీడియోలు, ఫోటోస్ పెడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం నేరమని అన్నారు. ప్రపంచ మొత్తానికి సూర్యాపేట రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. సిఐ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, తహసిల్దార్ కృష్ణయ్య, వెహికల్ ఇన్స్‌పెక్టర్ జయప్రకాశ్‌రెడ్డి, ఎస్‌ఐలు ఏడుకొండలు, సైదులు, ఆంజనే యు లు, ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం, ముస్లీం మతపెద్దలు పాల్గొన్నారు.

# మహిళ

ఫోకస్

హోమ్ బేస్డ్ బిజినెస్..



# ఆహారం.. లాభసాటి వ్యాపారం

మహిళలు ఇంటివద్ద చేయగలిగే వ్యాపారాల్లో ఆహారానికి సంబంధించింది ప్రధానమైనది. మహిళలు ఆర్థికంగా స్వావలంబిగా మారడానికి ఎన్నో మార్గాలను అన్వేషిస్తున్నారు.

## పెట్టుబడి..

ఫుడ్ బిజినెస్‌కు పెట్టుబడి రూ.5000 నుంచి రూ.50000 మధ్య ఉంటుంది. అంటే, మీరు పెట్టే వ్యాపార స్థాయి, పరిధిని బట్టి పెట్టుబడి ఉంటుంది. తక్కువ పెట్టుబడితో లేదా మనకు అనుకూలమైన పెట్టుబడితో వ్యాపారం చేయగలగడం ఫుడ్ బిజినెస్ ప్రత్యేకత. ఇంటి నుంచి పని చేసే అవకాశం ఉంటుంది కాబట్టి, కుటుంబాన్ని అశ్రద్ధ చేయకుండా వ్యాపారాన్ని నడపవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుంది. ఇది మహిళలను అర్థస్వావలంబన దిశగా నడిపిస్తుంది. అంతేగాక, మహిళల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. స్వంత బ్రాండ్‌కి రూపం ఇచ్చే అవకాశం ఉంటుంది. కస్టమర్‌కు ఇంటి వంటలా ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చు.



అదే సమయంలో తగినంత తీరిక లేకపోవడంతో, ఇంటి వద్ద ఖాళీ సమయంలో చేయదగిన వ్యాపారాల గురించి ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ఫుడ్ బిజినెస్' మహిళలకు అత్యంత అనుకూలంగా ఉండడమే కాదు, వారికీ సృజనాత్మకత, ఆదాయం, తృప్తిని అందించే రంగంగా నిలుస్తోంది. ఆహార వ్యాపారం అనేది బ్రహ్మవిద్య ఏమీ కాదు. ఏదైనా ఆహార పదార్థాన్ని తయారు చేసి, వినియోగదారులకు విక్రయించడమే. ఇది వండిన, ప్యాకేజ్డ్ ప్రాసెస్డ్ లేదా రెడీటుఈట్ విధానాలలో ఉండవచ్చు. ఈ వ్యాపారం చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయికి విస్తరించవచ్చు.



### ఇంటివద్ద చేయగలిగే ఆహార వ్యాపార రకాలు..

**హోమ్ బేకరీ:** కేక్స్, కుకీలు, బ్రెడ్లు, మఫిన్లు తయారు చేయడం. పుట్టినరోజులు, పెళ్లిళ్లు వంటి ఈవెంట్‌లకు ఆర్డర్లపై పని చేయవచ్చు.

**పికిల్ (ఊరగాయలు) తయారీ:** ఆవకాయ, మాగాయ, నిమ్మకాయ, మిక్స్‌డ పికిల్స్. శాస్త్రీయ విధానంలో, ప్రత్యేకించి ఆయుర్వేద తరహాలో తయారుచేసిన ఊరగాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది.

**అప్పడాలు.. వడియాలు:** వివిధరకాల వడియాలు (సగ్గుబియ్యం, బియ్యం, శెనగపప్పు) తయారీ. వాటిని చక్కటి ప్యాకింగ్‌లో విక్రయించవచ్చు.

**ఇన్‌స్టెంట్ మిక్స్‌లు:** ఉప్మా మిక్స్, పులిహోర మిక్స్, రవ్వ దోస మిక్స్. ఇన్‌స్టంట్ ఫుడ్ మిక్స్ అని వచ్చేలా పేరు పెడితే మార్కెటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది.

**చక్కెర తక్కువగా ఉన్న స్వీట్‌లు (డైటు స్వీట్లు):** డయాబెటిక్ ఫ్రెండ్లీ లడ్డు, బార్ ఫార్మ్ స్వీట్‌లు. ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తయారు చేస్తే ఆదరణ పొందుతుంది.

**టిఫిన్ సర్వీసులు:** ఆఫీసులకు, విద్యార్థులకు రోజువారీ లంచ్, డిన్నర్ బాక్స్‌లు.ఆరోగ్యకరమైన, ఇంటి వంటల్ని ఇష్టపడే వారికి ఇది పెద్ద రిలీఫ్.

**పాలకూర పొడర్లు, మసాలా పొడర్లు:** కరివేపాకు, మెంతికూర, మునగ ఆకుల పొడర్లు. కారం పొడి, సాంబార్ పొడి, పులుహోర పొడి లాంటి రుచికరమైన మసాలా తయారీ.

వ్యాపారం ప్రారంభించడానికి ముఖ్యంగా వంట పట్ల ఆసక్తి, కొత్త రకాలు సృష్టించగల సామర్థ్యం ఉండాలి. హైజీన్, న్యూట్రిషన్ అంశాలపై అవగాహన అవసరం.


## సవాళ్లు

ఇంటి నుంచే ఫుడ్ బిజినెస్ చేయడం ఒక రకంగా సులభంగానే కనిపిస్తుంది. కానీ, ఇందులోనూ కొన్ని సవాళ్లు, సమస్యలు లేకపోలేదు. వ్యాపారం అన్న తర్వాత పోటీ తప్పకుండా ఉంటుంది. ఎంతటి పోటీ ఉన్నా, దానిని తట్టుకొని వ్యాపారాన్ని నిలబెట్టుకోవడం అనుకున్నంత సులభం కాదు. అందుకు నిరంతరం కష్టపడాలి. దృఢదీక్షతో ముందుకు సాగాలి. నాణ్యతను క్రమం తప్పకుండా ఒకేలా ఉంచడం కూడా ఒక సమస్యగానే చెప్పుకోవాలి. వంటవారు మారినప్పుడు లేదా ముడిసరుకుల ఎంపికలో పొరపాటు జరిగినప్పుడు, తయారు చేసిన ఆహార పదార్థాల నాణ్యతలో మార్పు ఉండవచ్చు. సాధ్యమైనంత వరకూ అలాంటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త పడాలి. అన్నిటినీ మించి వినియోగదారుల నమ్మకాన్ని పొందాలి. ఇది అసాధ్యం కాకపోయినా, సులభం మాత్రం కాదు. ఆహారం పూర్తిగా శరీరానికి, ఆరోగ్యానికి సంబంధించింది కాబట్టి, జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటారు. అందుకే, వినియోగదారుల నమ్మకాన్ని పొందడానికి అన్ని విధాలా ప్రయత్నం చేయాలి. శాంపిల్స్ పంపడం, బంధువులు, స్నేహితులు, తెలిసిన వారిని పిలిచి కిట్టీ పార్టీని ఏర్పాటు చేసుకోవడం కొంత వరకూ ప్రచారానికి ఉపయోగపడతాయి. స్విగ్గీ, జొమాటో ద్వారా ఆర్డర్లు తీసుకోవచ్చు. అదే విధంగా అమేజాన్, ఎట్సీ, మీషో వంటి ఇ-కామర్స్ ద్వారా అమ్మకాలు సాగించవచ్చు. మీకు మాత్రమే ప్రత్యేకం అనే రీతిలో కొత్త వంటకాలను తయారు చేయడం అవసరం. అదే విధంగా ఒకసారి అమ్మిన తర్వాత, కస్టమర్ల నుంచి ఫీడ్‌బ్యాక్ తప్పక తీసుకోవాలి. ఏవైనా విమర్శలు వస్తే, వాటిని విశ్లేషించి, లోటుపాట్లు సరిచేసుకోవాలి. అంతేగానీ, కస్టమర్లపై ఆగ్రహం ప్రదర్శించకూడదు. ఆహార తయారీ మహిళల శక్తికి అద్దం పడే రంగం. ఇంటి నుంచి ప్రారంభించి, గ్రామ స్థాయిలోనూ, పట్టణ స్థాయిలోనూ ఈ వ్యాపారాన్ని విస్తరించవచ్చు. స్వయం ఉపాధిని ఏర్పరుచుకోవడమే కాకుండా, ఇతర మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించగలగడం ఈ రంగానికి విశిష్టత. చిన్న ఆరంభమే, పెద్ద విజయానికి ఆరంభం అన్నదానికి ఆహార వ్యాపారం చక్కటి ఉదాహరణ.

## అనుమతులు.. రిజిస్ట్రేషన్లు




ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ) లైసెన్స్ తీసుకోవాలి. ప్రాథమికంగా ఫుడ్ హ్యాండ్లింగ్, హైజీన్ సర్టిఫికేట్ కూడా ఉంటే మంచిది. లైసెన్స్ తీసుకొని, తయారు చేసిన ఆహార పదార్థాలను ఆకర్షణీయమైన, శుభ్రంగా ఉండేలా చూడాలి. అందులో బ్రాండ్‌పేరు, లేబుల్, తయారీ తేదీ, ఎప్పటిలోగా వాడాలి వంటి వివరాలు తప్పనిసరి. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి మార్కెటింగ్ మాధ్యమాలు ద్వారా ప్రచారం చేసుకోవచ్చు. స్వయంగా సాంపిళ్లు పంపించడం, ఫుడ్ డెలివరీ యాప్‌లలో లిస్ట్ అవడం వంటి మార్గాలు కూడా ఉన్నాయి.



# హార్మోన్ల మార్పులు.. ఆరోగ్య సమస్యలు..

హార్మోన్ల మార్పులు మహిళల మానసిక, శారీరక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. ఈ మార్పులు సహజంగా లేదా బాహ్య కారణాల వల్ల సంభవించవచ్చు. ఉదాహరణకు హార్మోన్ల మార్పుల సమయాలుఋతుస్రావ చక్రం: ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ స్థాయిలలో మార్పులు ఋతుస్రావం సమయంలో ఆలోచనల్లో నిలకడ లేకపోవడం, చిరాకు, లేదా ఆందోళనను కలిగిస్తాయి. కొందరు మహిళలు ప్రీమెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ (పిఎంఎస్) లేదా ప్రీమెన్‌స్ట్రువల్ డైస్ఫోరిక్ డిసార్డర్ (పిఎండిడి)తో బాధపడతారు, ఇవి మానసిక ఒత్తిడిని పెంచుతాయి.గర్భం: గర్భధారణ సమయంలో హార్మోన్ల స్థాయిలు (ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్, మరియు ఆక్సిటోసిన్) గణనీయంగా మారతాయి. ఇవి మానసిక స్థితి, ఆందోళన, లేదా భావోద్వేగ అస్థిరతను కలిగిస్తాయి. ప్రసవం తర్వాత హార్మోన్ల స్థాయిలు వేగంగా తగ్గడం వల్ల పోస్ట్‌పార్టం డిప్రెషన్ లేదా ఆందోళన సంభవించవచ్చు. ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ ఉత్పత్తి తగ్గడం వల్ల మెనోపాజ్ సమయంలో మహిళలు ప్రతి విషయానికీ అతిగానూ, అర్థంలేకుండానూ స్పందించే అవకాశం ఉంది. డిప్రెషన్, లేదా ఆందోళనను అనుభవించవచ్చు. థైరాయిడ్ వల్ల హార్మోన్ల అసమతుల్యత (హైపోథైరాయిడిజం లేదా హైపర్‌థైరాయిడిజం) కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. హార్మోన్ల అసమతుల్యత మూలంగా మహిళలు భావోద్వేగ అస్థిరత, చిరాకు, లేదా ఏడుపు అనుభవించవచ్చు. డిప్రెషన్, ఆందోళన సహజమవుతాయి. ఈస్ట్రోజెన్, సెరోటోనిన్ (మూడ్‌ను నియంత్రించే న్యూరోట్రాన్స్‌మిటర్) మధ్య సంబంధం ఉంది. ఈస్ట్రోజెన్ స్థాయిలలో మార్పులు డిప్రెషన్ లేదా ఆందోళనను పెంచవచ్చు. హార్మోన్ల మార్పులు నిద్రలేమి లేదా నిద్ర నాణ్యతను తగ్గిస్తాయి, ఇది మానసిక ఒత్తిడిని మరింత పెంచుతుంది. హార్మోన్ల అసమతుల్యత వల్ల మహిళలు అలసట, ఏకాగ్రత లోపం, లేదా శక్తి కొరతను అనుభవించవచ్చు. హార్మోన్ల అసమతుల్యతను గుర్తించడానికి రక్త పరీక్షలు చేయించుకోవడం, గైనకాలజిస్ట్ లేదా ఎండోక్రినాలజిస్ట్‌ను సంప్రదించడం అత్యవసరం. మెనోపాజ్ లేదా తీవ్రమైన హార్మోన్ల అసమతుల్యత సమయంలో హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్‌ఆర్‌టి) సహాయపడవచ్చు, కానీ వైద్య సలహాతో మాత్రమే తీసుకోవాలి. ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ 'డి', మెగ్నీషియం వంటి పోషకాలు హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరుస్తాయి. వ్యాయామం, ఒత్తిడి నిర్వహణ: యోగా, ధ్యానం, లేదా క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అనేది హార్మోన్ల స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. సమయానికి నిద్రపోవడం, కెఫీన్, ఆల్కహాల్‌ను తగ్గించడం హార్మోన్ల సమస్యలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఏదిఏమైనా హార్మోన్ల లోపం లేదా మార్పుల వల్ల మహిళల్లో తీవ్రమైన శారీరక, మానసిక సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి, అలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం, చికిత్స చేయించుకోవడం అవసరం.

# మూడో బిడ్డకూ ప్రసూతి ప్రయోజనాలు



మూడో బిడ్డకు కూడా ప్రసూతి ప్రయోజనాలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం మహిళలకు, ప్రత్యేకించి ఉద్యోగినులకు శుభవార్తగా చెప్పుకోవాలి. కె. ఉమాదేవి వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసు, 2022లో సుప్రీంకోర్టు ఒక మహిళకు తన మూడవ బిడ్డకు ప్రసూతి ప్రయోజనాలను మంజూరు చేసింది. దీనిని 2017 ప్రసూతి ప్రయోజన (సవరణ) చట్టం ప్రకారం రాజ్యాంగ హక్కుగా పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆరోగ్యం, గౌరవం, గోప్యత, వివక్షత లేని హక్కు జీవించే హక్కులో అంతర్భాగమని అత్యున్నత న్యాయస్థానం ధృవీకరించింది. ఆరోగ్యం, సమానత్వం, గౌరవ హక్కులతో సహా పునరుత్పత్తి హక్కులు అంతర్జాతీయ మానవ హక్కుల చట్టంలో భాగమని తేల్చిచెప్పింది. సుచితా శ్రీవాస్తవ వర్సెస్ చండీగఢ్ అడ్మినిస్ట్రేషన్ కేసు, 2009 లో పునరుద్ఘాటించబడినట్లుగా, పునరుత్పత్తి ఎంపికల హక్కు ఆర్టికల్ 21 (జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ) కింద పరిరక్షించడం జరిగింది. 2017లో సవరించిన ప్రసూతి ప్రయోజన చట్టం, 1961, మహిళా ఉద్యోగులకు ప్రసవానికి ముందు... తరువాత వేతనంతో కూడిన ప్రసూతి సెలవు ఇవ్వాలని స్పష్టం చేస్తున్నది. అంతేగాక, సంబంధిత ప్రయోజనాలను అందించాలని కూడా చెప్తున్నది. కాగా, ఈ చట్టం 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న కర్మాగారాలు, గనులు, తోటలు, ప్రభుత్వ సంస్థలు, దుకాణాలు, ఇతర కార్యాలయాలకు వర్తిస్తుంది. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ యాక్ట్, 1948 పరిధిలోకి వచ్చే మహిళలు కూడా ప్రసూతి ప్రయోజనాలకు అర్హులు. ఇద్దరు పిల్లల వరకు మహిళలకు 26 వారాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఉంటాయి. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే 12 వారాల పాటు సెలవుకు అర్హులు. అంటే, ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న మహిళలకు ప్రసూతి సెలవులను చట్టం నిషేధించదు. ఇది పిల్లల సంఖ్య ఆధారంగా మాత్రమే వ్యవధిని పరిమితం చేస్తుంది. ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు తన తీర్పులో వివరించింది.

# పేదల కష్టాల్లో ముందుండేది సిపిఐ

ఈ నెల 6న జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు : ఎస్.విలాస్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలో మంగళవారం సిపిఐ నాయకులు నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ భారతదేశంలో 1925లో స్థాపించబడినదని, భారత పౌరులకు, రోటి, కాపడా, మఖాన్,దున్నేవాడిదే భూమిఅని,బ్యాంకుల జాతీయకరణ,రాజకరణాలరద్దు,ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం,అటవీ హక్కుల చట్టం,భావన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం, వంటి వాటిని తీసుక వచ్చిందన్నారు. అదేవిధంగా స్వాతంత్రాన్ని కంటే ముందు ఆర్థిక వర్గానికి 37 చట్టాలను సిపిఐ అలాగే ఎఐటియుసిలు సాధించడం జరిగిందని, హైదరాబాద్ రాష్ట్రం విముక్తికై తమ కార్యకర్తలను త్యాగం చేసింది ఎర్ర జెండానే అని, తెలంగాణ రాష్ట్రం భారత్ దేశంలో విలీనం సిపిఐ పోరాటాల వల్లే సాధ్యపడిందన్నారు.ర్మల్ జిల్లాలో మహాసభలు ఈ నెల 6వ తేదీన నిర్మల్ జిల్లాలో జరుగుతాయని,ఈ సభలకు ముఖ్య అతిథిలుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కళావేణి శంకర్‌లు హాజరవుతారని కనుక ఈ సభను విజయవంతం చేయాలని అన్నారు. అదే విధంగా ఖానాపూర్ మండల సిపిఐ సభలో 13 మంది కౌన్సిల్ సభ్యులతో,పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులతో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల కార్యదర్శిగా కడుకుట్ల రవి,సహాయ కార్యదర్శిగా చిలుకూరి ఇస్తారీ,మండల కోశాధికారిగా పిట్టల భీమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉపాలి.జిల్లా కార్యవర్గ సభ్యులు భుక్య రమేష్, ఈ ఎన్నికకు సభ్యులుగా పాల్గొన్నారు.

# వందేళ్ల సిపిఐ ప్రస్థానం... ప్రజల పక్షాన రాజీలేని పోరాటం

సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా ప్రజలకు అండగా సిపిఐ జెండా నిలబడి పోరాడుతుందని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం గొట్టుముక్కల గ్రామంలో జరిగిన సిపిఐ దేవరకొండ మండల 14వ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని, దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడి వ్యతిరేకంగా బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ పోరాటినికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరుస్తుందని, మళ్లీ సిలిండర్ ధరను పెంచడం అన్యాయం అని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, ఎరువులు, విత్తనాలు సబ్సిడిపై రైతులకు ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. నల్గొండ ఎంఎల్‌సి, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ ప్రధాన సమస్య అయిన పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేసి నియోజకవర్గానికి సాగునీరు అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యానాయక్, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి రామస్వామి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ ఎంపిపి పల్లా సులోచన, రంగారెడ్డి, రామిరెడ్డి, యాదయ్య, వెంకట్ రాములు, అనిత, జ్యోతిబసు, నగేష్, వెంకటేశ్వర్‌రావు, గోపి, పుల్లయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకు సివిల్ స్కోర్‌కు సంబంధం లేకుండా రుణాలు ఇవ్వాలి

దోపిడీ పీడన ఉన్నంత వరకూ ఎర్రజెండా రెపరెపలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** బ్యాంకు సివిల్ స్కోర్‌కు సంబంధం లేకుండా రాజీవ్ యువవికాస్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికి రుణాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం సిపిఐ పోతంగల్ మండల మహాసభ హంగర్గ ఫారంలో ఎ.విఠల్‌గౌడ్ అధ్యక్షతన జరగగా ఈ మహాసభనుద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడారు. దేశంలో దోపిడీ పీడన వ్యవస్థ ఉన్నంతకాలం వామపక్షాన్ని అంతం చేయడం ఎవరికి సాధ్యపడదన్నారు. మోదీ అనుసరిస్తున్న నరహంతక ఫాసిస్ట్ రాక్షస విధానాన్ని తీవ్రంగా ఖండించారు. నక్సలిజాన్ని, వామపక్షాన్ని అంతం చేయడానికి ముందు వారు ఏ ఆశయ సాధన కోసం ఏ సమసమాజ సాధన కోసం దశాబ్ధా ల కాలం నుంచి పోరాటం చేస్తున్నారో ముందు ఆ సమస్యలు నిర్మూలించండని మోదీ ప్రభుత్వానికి హితవు పలికారు. కార్మికులు, కర్షకులు, పీడత తాడిత ప్రజానీకానికి కమ్యూనిస్ట్ పార్టీ అండగా పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను రాజీవ్ యువవికాస్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ బ్యాంకు సివిల్ స్కోర్‌కు సంబంధం లేకుండా అమలు చేయకపోతే ఇబ్బందులు ప్రభుత్వానికి ఎదురు కాక తప్పదని ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో అనవసరపు అడ్డగోలు కొరీలు పెట్టి దాటవేయటం మంచిదికాదనీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ సందర్భంగా సిపిఐ పోతంగల్ మండల కార్యదర్శి కొట్టే ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు కపిల్, ఎస్‌కె.సోయల్, లక్ష్మణ్, మనోహర్ ఎన్నుకున్నామన్నారు.

# రామకృష్ణాపూర్ సమగ్రాభివృద్ధి సిపిఐ లక్ష్యం

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సిపిఐ పార్టీ విస్తృతమైన డిమాండ్ల పట్టికను రూపొందించడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రామకృష్ణాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. జూన్ 1న రామకృష్ణాపూర్‌లో ఘనంగా నిర్వహించిన క్యాతనపల్లి 3వ పట్టణ మహాసభలో ఈ డిమాండ్లను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వారు ప్రకటించారు. రాజీవ్ చౌక్ నుండి కమ్యూనిటీ హాల్ వరకు ఉత్సాహభరితంగా సాగిన భారీ ప్రదర్శన అనంతరం జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవెన శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా పార్టీ శతవార్షిక ప్రస్థానం, సాధించిన విజయాలు, దేశ రాజకీయాలపై లోతైన ప్రసంగం చేశారన్నారు. అనంతరం 80 మంది ప్రతినిధులతో జరిగిన ప్రతినిధుల సభలో 45మంది పట్టణ కౌన్సిల్, 17మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా మిట్టపల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ ప్రజల అవసరాలు తీర్చేలా ఆధునిక స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సిబ్బందిని వెంటనే నియమించాలని, పరిసరాల పరిశుభ్రత కోసం శాస్త్రీయంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని తెలిపారు. నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు గతంలో కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమిని ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున కేటాయించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించాలని, ప్రతి వార్డులో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని, ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెలుగులు నింపి రాత్రి వేళల్లో ప్రయాణాలను సురక్షితం చేయాలని కోరిందన్నారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు ప్రతి వార్డులో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని, 76 జిఒ కింద ఆగిపోయిన పట్టాలను వెంటనే పంపిణీ చేయాలని, ఆసరా పెన్షన్లను బ్యాంకుల ద్వారా అందించాలని, జ్ఞానాన్ని విస్తృతం చేసేందుకు గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, రామకృష్ణాపూర్ నుండి మంచిర్యాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రామకృష్ణాపూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని పలురకాల సిపిఐ డిమాండ్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. ఈ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పార్టీ కృషి చేస్తుందని, ప్రజాప్రతినిధులు కూడా స్పందించి సహకరించాలని జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు వనం సత్యనారాయణ, మిట్టపల్లి పౌలు, నక్క వెంకటస్వామి, కాదండి సాంబయ్య, ఎగుడ మొండి, మాదాస్ శంకర్, మారపల్లి రవి, బోయబోతుల కొమురయ్య, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

# మడికొండ డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/ కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు ద్వారా వెలవడే పోగతో మడికొండ, రాంపూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర కాలుష్యం వ్యాపిస్తోందని, దీని ద్వారా స్థానిక ప్రజలు అనారోగ్యంతో వివిధ రోగాల భారిన పడుతున్నారని, వెంటనే డంపింగ్ యార్డును ఎత్తివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం కాజీపేట మండలం మడికొండ, రాంపూర్ ప్రాంతంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ 2012 సంవత్సరంలో మడికొండ, రాంపూర్ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు ద్వారా ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని, డంపింగ్ యార్డుకు ప్రతి రోజుకు 20 టన్నుల పైన తడి, పొడి చెత్త చెదారం చేర్చుతున్నారని, దీని వల్ల రాంపూర్, మడికొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర కాలుష్యం వ్యాపిస్తోందని, దీని కారణంగా స్థానిక ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు, జలుబు, దగ్గు, గుండె సంబంధించిన వ్యాధులు వస్తూ వివిధ రోగాల బారిన పడి, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అవేదన వ్యక్తం చేశారు.

ఈ డంపింగ్ యార్డును తొలగించాలని స్థానికులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం విచారకరమని, ఇటుకలే కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడ డంపింగ్ యార్డును ఎత్తివేయడమా లేదా యాంత్రీకరణ చేస్తామని హామీ ఇచ్చిన మున్సిపాలిటీ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ఈ డంపింగ్ యార్డును ఇక్కడ నుండి ఎత్తివేసి జనవాసాలకు దూరంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు ఈ సమస్యను పరిష్కరించకపోతే, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను ఐక్యం చేసి, పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపట్టడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సందర్శన కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, ఎదునూరి వెంకట్రాజం, కొట్టే వెంకటేష్, లకవత్ లక్ష్మీ, కాజీపేట మండల సహాయ కార్యదర్శి వేల్పుల సారంగపాణి, నాయకులు ఇల్లందుల పద్మ, మాచర్ల స్వరూప, ఎర్రబెల్లి రమేష్, కాగితాల రాములు తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ గోడ పత్రికల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** జూన్ 5న జరుగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలకు సంబంధించి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మంగళవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఏఓ రాంమోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త జి.లింగయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రెవెన్యూ సదస్సుకు అనూహ్య స్పందన

మూడుచింతలపల్లి తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి అనుహ్య స్పందన లభించిందని మూడుచింతలపల్లి తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రెవెన్యూ సదస్సులను మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో రైతు వేదికలో, నాగిశెట్టిపల్లి గ్రామపంచాయతీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లిలో రైతు వేదికలో రైతుల నుంచి 37 అర్జీలు, నాగిశెట్టిపల్లిలో 6, చిన్నపర్వతాపూర్ రెవెన్యూలో 6 అర్జీలు మొత్తం 49 పిర్యాదులు అందాయన్నారు. అలాగే శామీర్‌పేట మండలంలో పోతాయిపల్లిలో 8, యాడారంలో 27 అర్జీలు మొత్తం 35 వచ్చాయని శామీర్‌పేట తహశీల్దార్ యాదగిరిరెడ్డి తెలిపారు. రైతులు సమర్పించిన ఫిర్యాదులను పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్లు చెప్పారు. నేడు మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని పోతారం గ్రామ పంచాయతీ భవనంలో, అలాగే శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీలోని మందాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహశీల్దార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, డిప్యూటీ తహశీల్దార్‌లు సం యుక్త, అనూష. ఆర్‌ఐలు సీనియర్ అసిస్టెంట్‌లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతీ నిరుపేదకు ఇళ్లు కట్టిస్తాం

మండల ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని ప్రతీ నిరుపేదకు ఇళ్లు కట్టిస్తామని శామీర్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో ఒక్క నిరుపేదకు ఇళ్లు కట్టించలేదని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన యేడాదిన్నర లోపే మా లాల్‌గడిమలక్‌పేటలో 32 మందికి ఇళ్లు మంజూరు అయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన విదంగా ఆరు గ్యారంటీలను పక్కాగా అమలుచేస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. లాల్‌గడిమలక్‌పేటకు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేసి త్వరలోనే ఇండ్లకు భూమిపూజ చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడానికి కృషి చేసిన మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## తార్నాక నుండి ఇసిఐఎల్ మీదుగా కీసర వరకు మెట్రో విస్తరించాలని వినతి



**ప్రజాపక్షం/చర్లపల్లి :** తార్నాక నుండి ఇసిఐఎల్ మీదుగా కీసర ఓఆర్ఆర్ వరకు మెట్రో రైల్‌ను విస్తరించాలని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్‌ను కాప్రా నాయకులు కోరారు. మంగళవారం ఎంపి నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలసిన నాయకులు తార్నాక నుండి కీసరకు రోడ్డు మార్గంలో రావాలంటే ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్ రద్దీ తగ్గలంటే ఇసీఐఎల్ చౌరస్తా వరకు మెట్రో రైలును విస్తరించాలని గతంలో ప్రతిపాదనలు చేయడం జరిగిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని మరచిపోయిందని వారు వినతి పత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు డి నాథం,తాళ్ల ఆనంద్‌గౌడ్,లక్ష్మణ్‌గౌడ్,గణేష్ ముదిరాజ్,విద్యాసాగర్,అప్పి,శ్రీనివాస్,వెంకటేష్, పి.రాజు, రామకృష్ణ, జహంగీర్,సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తడిపొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తడిపొడి చెత్త సేకరణపై తూంకుంట మున్సిపల్ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్ వెంకటగోపాల్ అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపల్‌లోని 7వ వార్డులోని ద్వారకపురి కాలనీ, సాయినగర్ కాలనీల్లో చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల కార్యాచరణలో భాగంగా స్వచ్ఛతపై మున్సిపల్ ప్రజలకు సిబ్బందితో కలిసి అవగహన కల్పిస్తున్నామని చెప్పారు. తడిపొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను ఇంటి దగ్గర వేరుచేసి ఆటోలకు తరలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, అధికారులు, మెప్మా ఆర్‌పిలు, పాల్గొన్నారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దార్ విజయ్ కూమార్, నయాబ్ తహసీల్దార్ మహేష్

**ప్రజాపక్షం/బంట్వారం :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తహసీల్దార్ విజయ్ కూమార్, నయాబ్ తహసీల్దార్ మహేష్ లు మంగళవారం అన్నారు. మండల పరిధిలో ఉన్న మాలసోమారం, యాచారం రెవెన్యూ గ్రామాలలో రైతుల నుంచి రెవెన్యూ సమస్యల పట్ల ఫిర్యాదులు స్వీకరించారు. సందర్భంగా స్థానిక తహసీల్దార్ విజయ్ కూమార్ మాట్లాడుతూ భూ భారతి చట్టం పట్ల ప్రజల్లో ఉన్న అనూమానాలు తోలగించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు సత్వర పరిష్కారం అయ్యేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతుల తమ భూ సమస్యలను తెలుపూతూ ధరఖాస్తూలు ఇవ్వడం జరిగందన్నారు. రైతులు నుంచి స్వీకరించి ధరఖాస్తూలను క్షేత్రా స్థాయిలో క్షుణంగా పరిశీలించి ఉన్నత అధికారుల దృషికి తీసుకుపోయి సమస్యలను పరిష్కారించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల గిర్దావార్ రామ్ గోపాల్, జునియర్ అసిస్టేంట్ అనిత, రాధ, రాజు తదితరులు ఉన్నారు.



# కొత్త పరిశ్రమలు తీసుకొస్తాం... యువతకు ఉపాధి కల్పిస్తాం

అదే మా ప్రభుత్వ ధ్యేయం

'ఎవర్జెంట్ టెక్నాలజీస్' గ్లోబల్ వాల్యూ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. మంగళవారం నానక్ రామ్ గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో యుఎస్‌కు చెందిన 'ఎవర్జెంట్ టెక్నాలజీస్' గ్లోబల్ వాల్యూ సెంటర్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏడాదిన్నర వ్యవధిలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఏఐ,మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏఐ రాజధానిగా హైదరాబాద్ ను మార్చాలనే సంకల్పంతోనే ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతునామన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో తెలంగాణ యువతను నిపుణులుగా తీర్చి దిద్దేందుకు పాఠశాల స్థాయి నుంచే శిక్షణ ఇచ్చేలా నిపుణుల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఏటా రాష్ట్రంలో 2 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టా తీసుకుంటున్నారని, కానీ... వీరిలో చాలా మందికి పరిశ్రమలకు అవసరమైన కనీస నైపుణ్యాలు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య ఏ అంతరాన్ని తగ్గించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్‌కు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఆవిష్కరణలకు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చే యువతకు ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని గ్లోబల్ కేపబిలిటీ సెంట(జిసిసి)ను గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ ఏఐ పవర్డ్ సబ్ స్క్రైబర్ మేనేజ్మెంట్ అండ్ మానిటైజేషన్ ప్లాట్ ఫాం 'ఎవర్జెంట్ టెక్నాలజీస్' గ్లోబల్ వాల్యూ సెంటర్ ద్వారా ప్రస్తుతం 600 మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య వేయి మందికి చేరుతుందన్నారు. హైదరాబాద్ లో కార్యాలయాన్ని ప్రారంభించిన 'ఎవర్జెంట్ టెక్నాలజీస్' యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎఎస్ అధికారి భవానీ శ్రీ, ఐటి సలహాదారు సాయి కృష్ణ, ఎవర్జెంట్ టెక్నాలజీస్ ఫౌండర్, సిఇఒ విజయ్ సజ్జ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారిగా అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు

పేదలకు భూమి, ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ దక్కింది : ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** దశల వారిగా అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు అందజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు మండల పరిధి సంగెం కలాన్ గ్రామంలో 60మంది లబ్ధి దారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను స్థానిక నాయకులతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలందరికీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేస్తామని, అర్హులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందచేయడం సంతోషకరమని, ఇది ఒక పండగ వాతవరణంగా ఉందన్నారు. సిఎం రేవంతరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారిగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కటిన వారికి బిల్లులు ఇప్పించే బాధ్యత తనదన్నారు. నిరుపేదలకు భూమి, ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో ధనవంతులలే సన్న బియ్యం తినేవారని, నేడు ప్రజా ప్రభుత్వంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి పే దవాడికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. యువకులకు యువ వికాసం ద్వారా అర్థిక సా యం చేసి ఉపాధిని కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్ర భుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్ అన్ని పథకాల ను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి,మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వడ్డే శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఉత్తమ్‌చంద్, మాజీ ఎంపిపి శరణుబసప్ప తదితరులు పాల్గోన్నారు.

## భూ భారతి చట్టంపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం ద్వారా గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకొని తమ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కోరారు. ఘట్‌కేసర్ మండలంలోని ఏదులాబాద్, మార్జాతిగూడ, శామీర్‌పేట మండలంలోని పోతాయిపల్లి గ్రామాల్లో మంగళవారం నుండి మేడ్చల్ జిల్లాలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. తమ అర్జీలను నిర్దేశిత కోడ్‌లలో నమోదు చేయాలని, రైతులకు సంబంధించిన డాక్యుమెంట్లను జత చేయాలని, అర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందికి ఆయన సూచించారు. సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ భూభారతి చట్టంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని సిబ్బందికి సూచించారు. ఘట్‌కేసర్, శామీర్‌పేట తహసీల్దార్లు రజని, యాదగిరి రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఆర్ఐ కావ్య సాయిరాం తదితర రెవెన్యూ సిబ్బంది ఈ సదస్సుల్లో పాల్గొన్నారు.



### భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఎదులాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం రెవిన్యూ సదస్సులో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, ఏసిపి చంద్రపాణి,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,సహకార రైతు సంఘం అధ్యక్షులు రామ్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు మామిళ్ళ ముత్యాలు యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని భూసంబంధిత డాక్యుమెంట్ల పత్రాలను రైతులు వెంట తెచ్చుకోనేలా తమ అర్జీలను నిర్ధిశిత ఫారాలలో సక్రమంగా నివేదించేలా చూడాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ పదేళ్లలో బిఆర్ఎస్ సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో రైతుల ప్రమేయం లేకుండానే వారు భూ సమస్యల్లో చి క్కుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు ప్రజా ప్రతినిధులు రైతులు, మహిళా లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లకు ఆర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** పెన్షన్లకు ఆర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రైతు అత్మహత్య కుటుంబాలు , వితంతు పెన్షన్ ప్రతిపాదనలు తదితర అంశలపై సెర్ప్ సిఇఒ దివదేవరాజన్ జిల్లా అదనపు కలెక్టర్‌లు డిఆర్‌డిఒ, రెవెన్యూ భాగాల సంబంధించి అధికారులతో జూమ్ సమావేశం ఏర్పాటు ద్వారా సూచనలు సలహలు ఇచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు వృద్ధాప్య పెన్షన్లకు సంబందించి ఆర్థిక సహయం పొందే విధంగా దరఖాస్తుల స్వీకరించి ప్రతిపాదన రూపొందిచాలన్నారు. ఆర్హులైన వారికి ప్రభుత్వం నుండి పెన్షన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అయన సూచించారు.




## రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సులన సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వికారాబాద్ మండల, మున్సిపల్ పరిధిలోని ఎర్రవల్లిలలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వచ్చిన దరఖాస్తులను వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు కావాల్సిన సేవాలను అందించాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ఆరీజల నమోదు రిజిస్టర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పెండ్లిమడిగు గ్రామంలో మంజురైన ఇందిరమ్మ ఇండ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్దిదారు ఇండ్ల నిర్మాణలు ,చేపట్టుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్దిదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి చెల్లింపులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్డిఓ వాసుచంద్ర , తహసీల్దార్ లక్ష్మి నారాయణ, సీనియర్ అధికారులు సురేష్ సిబ్బంది ,రైతులు తదితరులు పాల్గోన్నారు.

## ఎల్లమ్మను దర్శించుకున్న డిజి సాయిలుగౌడ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో నూతనంగా ప్రతిష్టించిన ఎల్లమ్మ అమ్మవారిని గీతా పనివారల సంఘం రాష్ట్ర ప్రధా న కార్యదర్శి, మేడ్చల్ జిల్లా సిపిఐ మాజి కార్యద ర్శి డిజి సాయిలుగౌడ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీతాపనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బగౌని భాస్కర్‌గౌడ్, సంఘం సభ్యులు నర్సింలుగౌడ్, మూడు చింతలపల్లి మున్సిపల్ బిజెపిఅధ్యక్షులు త ప్పెట్ల నరేందర్‌గౌడ్ తదితరులు అమ్మవారిని ద ర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వీరిని శాలువాతో ఘనంగా సన్మానించారు.



## నేడు బెంగళూరు నుంచి అనంతపురంకు రైలు

ప్రారంభించనున్న ఎంపి అంబికా జి లక్ష్మీనారాయణ వాల్మీకి


**ప్రజాపక్షం/హైదరాబాద్:** బెంగుళూరు నుంచి అనంతపురంకు రైలు సౌకర్యం కల్పించినట్లు దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్‌ఒ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే అధికారుల సమక్షంలో ఈ రైలును బుధవారం అనంతపురం ఎంపి అంబికా జి.లక్ష్మినారాయణ వాల్మీకి జెండా ఊపి ప్రారంభించనున్నారని తెలిపారు. బెంగళూరు నగరం వైపు ప్రయాణించడానికి కెఎస్‌ఆర్ బెంగళూరు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం మెమూ మధ్య నడుస్తున్న ప్రస్తుత రైలు సేవను అనంతపురం వరకు పొడిగించాలనే డిమాండ్ ఉంది.ఇదే రైలును అనంతపురం వరకు పొడిగించడం జరిగింది. రైలు నం. 66560 అనంతపురం కె. ఎస్. ఆర్. బెంగళూరు మెము రైలుకు జెండా ఊపి ప్రారంబించనున్నారని తెలిపారు.ఈ రైలు అనంతపురం జిల్లా ప్రధాన స్టేషన్ , ధర్మవరం, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, కర్ణాటక రాష్ట్ర రాజధాని నగరం బెంగళూరు , దేశంలోని వివిధ గమ్యస్థానాలకు ప్రయాణించడానికి రైలు రవాణాపై ఆధారపడే చుట్టుపక్కల ప్రజలకు కూడా ఈ రైలు సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ స్టేషన్‌కు సగటున రోజుకు 11,200 మంది రాకపోకలు సాగిస్తున్నారని, సగటు ఆదాయం 11.57 లక్షలు ఉంటుందని తెలిపారు.ఈ రైలు నెం. 66560 మెమూ అనంతపురం నుండి 14.10 గంటలకు బయలుదేరుతుంది, ధర్మవరం 15.00 చేరుకొని 15.10 గంటలకు బయలుదేరుతుంది . 15.48 గంటలకు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం చేరుకొని 15.50 గంటలకు బయలుదేరుతుంది. అదే రోజు 19.50 గంటలకు KSR బెంగళూరు చేరుకుంటుంది.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూభారతి : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/చౌడపూర్ :** భూ సమస్యలను శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భగంగా రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని,భూ సమస్యలను శాశ్వత పరిష్కారం చేసుకోవలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. చౌడపూర్ మండల లోని మాల్కపూర్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సులలో పరిగి ఎమ్మెల్యే పాల్గోని రైతులతో ముఖాముఖి గా రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహలను నివృత్తి చేశారు. ఈ కార్యాక్రమంలోతహసీల్దార్ వహీద్ కాతుమ్ ,మాట్లాడుతూ భూరికార్డులో పేరు తప్పులు ,విస్తర్ణం హెచ్చు తగ్గులు వారసత్వ భూములు ,భూ స్వభావం తప్పులు , సర్వేనంబర్ మిస్సింగ్ ,పట్టాపాస్ బుక్స్ ,సాదాబైనామ కేసులు ,హద్దుల నిర్ధారణ ,భూభారతిచట్టం ప్రకరం క్షేత్రస్థాయిలో విచరణ జరిపి గడువులోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సోమలింగంచ మండల పార్టీ అధ్యక్షులు అశోక్‌కుమార్ ,నర్సిరెడ్డి తదితరులు పాల్గోన్నారు

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నాణ్యమైన విత్తనాలతో రైతులు అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్త అనురాధ అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ రైతు వేదికలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేశారు. వ్యవసాయ యూనివర్శిటీ ఆధ్వర్యంలో శామీర్‌పేట మండంలోని 15 గ్రామాల్లో ప్రతి గ్రామం నుంచి ముగ్గురు చొప్పున రైతులను ఎంపిక చేసి ఒక్కోక్కరికి 10 కిలోల చొప్పున మూల విత్తనం(ఫౌండేషన్ సీడ్) అంజేశారు. ఈ కార్యక్రమంలో ఎఒలు రమేష్, రవికుమార్, ఎఇలు రవియాదవ్, సుదీర్, లక్ష్మ న్ రైతులు పాల్గొన్నారు. అలాగే మూడుచింతలపల్లి రైతు వేదికలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ రైతులకు వరి విత్తనాలను అందజేశారు.

## సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/అల్వాల్ :** వెంకటాపురం డివిజన్‌లోని రూ.14 లక్షల వ్యయంతో కూడిన సిసి రోడ్డు పనులకు మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్లోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రతి డివిజన్‌లో సిసి రోడ్లు డ్రైనేజీలు శానిటేషన్ విధి స్తంభాలు ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శివ శంకర్ రెడ్డి, గోపాల్, అనిల్ రెడ్డి, శ్రీనివాస్, డోలి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ ప్రాథమిక కేంద్రంలో మెరుగైన వైద్యం



**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇండియన్ ఆయిల్ సంస్థ వారి సిర్ ఎస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ సర్వీసెస్ నిధులు ద్వారా మహిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా రేడియేషన్ లేకుండా రొమ్ము క్యాన్సర్ కార్విక‌ల్ క్యాన్సర్ ను తెలుసుకునే అత్యాధునిక స్క్రీనింగ్ ఇనిషియేటివ్ మిషన్ ను తెలంగాణ డయాగ్నస్టిక్స్ మినీ హబ్‌ను మల్కాజ్గిరి లోక్ సభ నియోజకవర్గం ఎంపి ఈటల రాజేందర్‌తో కలిసి ప్రారంభించిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అల్వాల్ పట్టణ కేంద్రంలోని పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు కావలసిన పరికరాలను అందించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఉమ గౌరీ, డిప్యూటీ డాక్టర్ శోభ , ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సీజీఎం బద్రీనాథ్, కైలాష్, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ శ్వేత, మహిత డైరెక్టర్ రమేష్ శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, బిఆర్ఎస్ నాయకులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
## గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే రంగారెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం లష్కర్ గూడ, సూరిమాయి గూడ, కనకదుర్గ నగర్ కాలనీలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో, అబ్దుల్లాపూర్మెట్ మాజీ జడ్పిటిసి బింగి దేవదాస్గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్, గుండె నరసింహ, పార్వతమ్మ, శ్రీశైలం, రాహుల్, నితిన్, జంగయ్య, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి జిహెచ్ఎంసి నిధులు
### మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** జిహెచ్ఎంసి ట్యాక్స్ రూపంలో వచ్చే ప్రతి రూపాయి జిహెచ్ఎంసిలో ఉన్న కాలనీల అభివృద్ధికి ఉపయోగిస్తున్నామని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం వనస్థలిపురంలోని జాంగిర్ నగర్, మల్లికార్జున నగర్ కాలనీల్లో నూతనంగా డ్రైనేజీ పైప్‌లైన్, పార్కును కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం ప్రజలకు అనుగుణంగా పనులు చేస్తూ, ప్రజల అవసరాల కోసమే నిధులు మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం జిహెచ్ఎంసి నిధులు మళ్లించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మి ప్రసన్న, వజీర్ ప్రకాష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, కాలనీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, కార్యదర్శి నిరంజన్, సాయి చరణ్, హరినాథ్‌రెడ్డి, సాయి కిరణ్ గౌడ్, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కెబిఆర్ పార్కులో పనులు పరిశీలించిన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాకర్స్ సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పనులను వినూత్నంగా చేపట్టి పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. కెబిఆర్ పార్కులో చేపట్టిన పనులను మంగళవారం పరిశీలించారు. లైసెన్స్ తీసుకున్న పెట్ డాగ్స్‌ను మాత్రమే పార్కులోకి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు. కెబిఆర్ పార్కు చుట్టూ హెచ్ సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు కోర్టు ఆదేశాల మేరకు నిర్మిస్తున్నారా అంటూ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా, సెన్సిటివ్ జోన్ పరిధిలోనే పనులు చేపట్టినట్లు కమిషనర్‌కు తెలిపారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ సుభద్ర దేవి, డిప్యూటి కమిషనర్ సమ్మయ్య, ప్రాజెక్టు ఎస్ఇ శ్రీలక్ష్మి, ఇఇ నామ్య నాయక్, డిప్యూటీ ఇఇ హరీష్, సర్కిల్ ఇఇ విజయకుమార్ పాల్గొన్నారు.

## నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దుకు ఉద్యమం : ఐఎన్‌టియుసి





**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కేంద్రంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. ఈ లేబర్‌కోడ్‌లు కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నాయని పేర్కొన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఐఎన్‌టియుసి జాతీయ సీనియర్ కార్యదర్శులు బాబర్ సలీమ్ పాషా, బి.వెంకటేశ్వరరెడ్డి, జాతీయ కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శులు వై.నాగన్న గౌడ్, అదిల్ షరీఫ్ మీడియాతో మాట్లాడారు. సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.భాస్కర్‌రెడ్డి ఉమా నాగేంద్రమణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్ యాదవ్, సోలోమన్ రాజు, సురేశ్, నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులపై నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ అన్నిజిల్లాల్లో ఆందోళనలు : టియుజెఎసి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** తెలంగాణ ఉద్యమకారులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ అన్ని జిల్లాకేంద్రాల్లో నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తామని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి (టియుజెఎసి) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ప్రఫుల్ రామ్‌రెడ్డి, అధ్యక్షులు సుల్తాన్ యాదగిరి, ప్రధానకార్యదర్శి బత్తుల సమ్మయ్య తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న సిఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో ఉద్యమకారుల గురించి ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెన్షన్ అందజేయాలని కోరారు. సమావేశంలో జెఎసి నాయకులు కోఠి మాధవిరెడ్డి, క్రిష్టోఫర్, రమేశ్ సాగర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జానుంచి నాఆస్తిని కాపాడండి
### సిఎం చంద్రబాబుకు ఎన్‌ఆర్‌ఐ మురళిమోహన్ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** తన కష్టార్జితంతో సంపాదించుకొన్న రూ.60 కోట్ల విలువైన ఆస్తిని టిడిపి నేత, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అనుచరులు కబ్జా చేశారని ఎపికి చెందిన ఎన్‌ఆర్‌ఐ రావి మురళి మోహన్ ఆరోపించారు. మంగళవారం ఆయన తన తల్లిదండ్రులతో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఎపిలోని చిలుకలూరిపేటకు చెందిన తాను స్థానికంగా నేషనల్ హైవేలో సాయి కార్తీక్ సెంటర్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించుకొన్నానని తెలిపారు. 2024 ఆగస్టు 5 నుంచి మాజీ మంత్రి పుల్లారావు అనుచరులు తన కాంప్లెక్స్‌ను ఆక్రమించారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై తాను హెచ్‌ఆర్‌సిని, హైకోర్టును ఆశ్రయించానన్నారు. తన తండ్రి కందిమల్ల అంజిబాబు రూ.97లక్షల అప్పు తీసుకొన్నారని, దాని ఆధారంగా తన కాంప్లెక్స్ ఆక్రమించారని చెప్తున్నారని, ఇదంతా అబద్ధమని, అప్పు తీసుకొన్నట్టు ఆధారాల్లేవని వివరించారు. దీనిపై ఎపి సిఎం జోక్యం చేసుకొని న్యాయం చేయాలని వేడుకొన్నారు.

## మహిళా ఆందోళనకారులను అదుపులో పెట్టేందుకు
# ‘స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్’లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయా డిమాండ్‌ల కోసం రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల పార్టీలు రాస్తారోకో, ధర్నా, అసెంబ్లీ ముట్టడి తదితర ఆందోళన కార్యక్రమాలలో పాల్గొనే మహిళలను అదుపులోకి తీసుకునే సందర్భంలో పోలీసులపై పలుసార్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ‘స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్’లను రంగంలోకి దించారు. మొదటి బ్యాచ్‌లో 35మంది మహిళా కానిస్టేబుళ్లతో కూడిన ఈ టీమ్ గోషామహల్ స్టేడియంలో మంగళవారం శిక్షణ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుళ్లను ఉద్దేశించి సివి ఆనంద్ మాట్లాడుతూ మహిళలు ఆందోళన కార్యక్రమాలకు దిగిన సమయంలో మగ పోలీసులతో ప్రమేయం లేకుండా వారిని అదుపులోకి తీసుకుని సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు 35 మంది మహిళా పోలీసుతో ‘స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్’లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ టీమ్‌లో ఉన్న మహిళా పోలీసులకు అన్ని మెలువకులతో కూడిన శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. గతంలో మహిళా పోలీసులు సరియైన సంఖ్యలో లేకపోవడంతో మహిళా ఆందోళనకారులను అదుపులోకి తీసుకోవాలంటే నానా కష్టం అయ్యేదని, కొన్ని సందర్భాలలో పోలీసులపై పలు విమర్శలు కూడా వచ్చాయని, వీటన్నిటిని అధిగమించేందుకు కొత్తగా వచ్చిన ఈ టీమ్‌లు ఉపయోగపడతాయన్నారు. దీంతో పాటు గోషామహల్ పోలీసు స్టేడియంతో పాటు ఈ ప్రాంతంలో ఉన్న పోలీసు విభాగాలకు చెందిన కార్యాలయాలన్ని ఖాళీ చేసి ఈ స్థలాన్ని ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రభుత్వానికి అప్పగిస్తున్నామని తెలిపారు. గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మిస్తున్న నేపథ్యంలో ఇక్కడున్న హార్స్ షెడ్డును తాత్కాలికంగా తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వం రూ.55 కోట్ల తో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనం నిర్మించాలని నిర్ణయించిందన్నారు. ఆసుపత్రి నిర్మాణం పనులు త్వరలో జరగనున్న నేపథ్యంలో పోలీస్‌శాఖకు చెందిన అన్ని బ్లాక్స్ ను తరలిస్తున్నామన్నారు. అందులో భాగంగానే హార్స్‌గ్రౌండ్‌ను తాత్కాలికంగా తరలించినట్లు తెలిపారు. అంతే కాకుండా తమ శాఖకు చెందిన అన్ని విభాగాలను తరలించి గోషామహల్ గ్రౌండ్‌ను వైద్యశాఖకు అప్పగించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఉస్మానియా నిర్మాణానికి 11 ఎకరాలు కేటాయించారని, ఇందులో 7 జోన్లకు చెందిన పలు కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

## మలక్‌పేట్ చౌరస్తాలో సీవరేజ్ సమస్య
# శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు
### జలమండలి ఎండి అశోక్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మలక్‌పేట్ చౌరస్తాలో భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం జిహెచ్ఎంసి, జలమండలి శాఖల అధికారులు సర్వే నిర్వహించాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి సూచించారు. నగరంలోని సీవరేజి, వరదనీటి కాలువల అనుసంధానం అయ్యే పాయింట్‌లను గుర్తించాలని, ఆ ప్రాంతాల్లో రెండు లైన్‌లను వేర్వేరుగా నిర్మిస్తే ఈ సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. దీనికోసం ఇరుశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అశోక్ రెడ్డి సూచించారు. మలక్‌పేట్ నల్లగొండ చౌరస్తాలో సీవరేజ్ మరమ్మత్తు పనులను మంగళవారం జలమండలి ఎండి అశోక్ రెడ్డి పరిశీలించారు. మలక్‌పేట్ అక్బర్ ప్లాజా వద్ద మురుగు సమస్య తలెత్తి ట్రాఫిక్ ఆటంకం ఏర్పడింది. దీంతో జలమండలి అధికారులు పర్యటించి రెండు దశాబ్దాల క్రితం సీవరేజ్ లైన్ శిథిలమైపోవడంతో అవుట్‌లేట్ లేక వర్షం కురిసిన సమయాల్లో సీవరేజ్ రహదారిపై పొంగుతున్నట్టు గుర్తించారు. ఇదే ప్రాంతంలో జిహెచ్ఎంసి వరదనీటి కాలువ ఉండటం, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటం, సీవరేజ్ లైన్‌లు ధ్వంసమైన ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో అశోక్ రెడ్డి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పనులపై అధికారులతో చర్చించారు. ఈ కొత్త సివరేజ్ లైన్‌లతో తాత్కాలికంగా మురుగు సమస్య తలెత్తకుండా ఉంటుందని తెలిపారు. సమీపంలోని భవణాల నుంచి ఉత్పన్నమయ్యే సీవరేజ్‌ను ఎక్కడికక్కడే కాకుండా ఓకే అవుట్‌లెట్ వద్ద అనుసంధానం చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమీపంలోనిఅన్ని సీవరేజ్ లైన్‌లను, మ్యాన్‌హోళ్లను పూడికతీత పనులు చేపట్టి, మురుగు పొంగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు.

**సీవరేజ్ ఓవర్ ఫ్లోకు కారణమైన హోటల్‌కు 10 వేల జరిమానా..** నల్లగొండ చౌరస్తాకు ఆనుకొని ఉన్న భవనంలో హోటల్ యజమాని తన సీవరేజ్ లైన్‌ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్‌వర్క్‌కు అనుసంధానంచేసి అందులో ఆహార, వ్యర్థ పదార్థాలను వేస్తూ వస్తున్నాడు. దీంతో ఆ ప్రాంతంలో మ్యాన్ హోళ్లు పూడుకపోవడంతో రహదారులపై మురుగునీరు ఉప్పొగుతోంది. ఈ నిర్లక్ష్యం వహించిన హోటల్ యజమానిపై ఎండి అశోక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీవరేజ్ ఓవర్ ఫ్లోకు కారణమైన హోటల్ యజమానికి రూ.10 వేల జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. 10 రోజులలో సిల్ట్ ఛాంబర్ నిర్మించుకోకపోతే హోటల్ సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సిజిఎం నాగేందర్, జిఎం హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

## బతుకమ్మకుంట చెరువుల అభివృద్ధి పనులు పరిశీలించిన
# హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బతుకమ్మకుంటకు ప్రాణం పోశారని స్థానిక ప్రజలు హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్‌కు కృజ్ఞతలు తెలిపారు. చెరువులో నీటి బాతులను స్థానికులు రంగనాథ్‌కు చూపించి మురిసిపోయారు. అంబర్‌పేట్ బంతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులను మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పశీలించారు. స్థానిక ప్రజల సూచనలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ కుంటలోకి వర్షం నీరు చేరే ఇన్‌లెట్, చెరువు నిండితే నీరు బయటకు వెళ్ళే ఔట్‌లెట్‌ను పరిశీలించారు. స్థానికుల కోరిక మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఎక్కడ చేపట్టాలనే విషయాన్ని పరిశీలించారు. బతుకమ్మ కుంట పక్కన సాగే మురుగు, వరదకాలువ డైవర్షన్ పనులను తనిఖీ చేశారు. హైడ్రా పేరు చెప్పి మూసీ పరివాహకంలో మట్టి పోస్తున్నారనే ఫిర్యాదులపై స్పందించారు. ఇప్పటికే వాళ్లను హెచ్చరించామని, వారంరోజుల్లో మట్టిని తీసేస్తామని హామీ ఇచ్చారన్నారు. వారం తర్వాత మూసీ పరివాహకంలో వేసిన మట్టిని తొలగించకపోతే వారిపై కేసులు పెడతామని రంగనాథ్ చెప్పారు. పాతబస్తీలోని భమ్‌క్నుదౌలా చెరువు పనులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు.18ఎకరాల చెరువు అసలు విస్తీర్ణం కాగా 9 ఎకరాల మేర మట్టి నింపి ఆక్రమించారు. 9 ఎకరాల్లో మట్టిని తొలగించి, చెరువును హైడ్రా రూపొందిస్తోంది. ఈ చెరువు ఔట్‌లేట్ తెరిపించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. స్థానికులు కమిషనర్ రంగనాథ్‌ని కలసి చెరువు అభివృద్ధి పనుల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు.



## రెవెన్యూ సదస్సులతో శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం
### చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/షాబాద్ :** రెవెన్యూ సదస్సులతో శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగాం, పోలారం గ్రామాలో రెవెన్యూ సదస్సలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసుదన్ రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం భూ భారతి ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, నాయకులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, బొకుల లింగం, రవీందర్ నాయక్, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ అన్వర్, ఆర్ఐ ఖాజ పాష, కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది పద్మా, సతీష్ మోహన్, మల్లేష్, రైతులు బలవంత్ రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

# రైతుల ఇబ్బందులు తొలగించేందుకే భూభారతి చట్టం
### టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రైతుల ఇబ్బందులను తొలగించేందుకే ప్రజాప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్(టియుఎఫ్ఐడిసి)చైర్మన్ చల్లా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం మండలం నందిపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు పూర్తి చేసిన విరాసత్ ధ్రువపత్రాన్ని లబ్ధిదారునికి అందించారు. అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. నాడు ధరణిలోని సమస్యలపై ప్రజలు గగ్గోలు పెట్టినా నాటి దొరకు కనికరం కలగకపోగా ధరణి సంజీవని అంటూ గొప్పలు చెప్పారని విమర్శించారు. గత ప్రభుత్వం మాదిరిగా భూభారతి చట్టంను అర్థరాత్రి చేయలేదన్నారు. ఈ చట్టాన్ని చేసే ముందు అన్ని జిల్లాల రైతుల కష్టాలేంటో ప్రజా ప్రభుత్వం ఓ కమిటీని నియమించి, అధ్యాయనం చేసి ప్రతిపక్షాల సూచనలు కూడా తీసుకుందన్నారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను పరిశీలించి వాటిలోని మంచి విషయాలను స్వీకరించి డ్రాఫ్ట్‌ను ప్రజల ముందు ఉంచి ఆ తర్వాతే చట్టం చేయడం జరిగిందని నరసింహారెడ్డి వివరించారు. ఈ చట్టాన్ని అసెంబ్లీలో పెట్టి భూభారతి చట్టం ఆమోదించే సమయంలో బిఆర్ఎస్ నాయకులు రాక్షసుల్లా ప్రవర్తించారని ఆయన గుర్తు చేశారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతన్నల కష్టాన్ని తీర్చేందుకు ఈభూ భారతి చట్టం 2025 ని తీసుకురావడం జరిగిందని కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి స్పష్టం చేశారు. పట్టాదారు పాసుపుస్తకంలో పేర్లు తప్పుగా నమోదు కావడం, భూ విస్తీర్ణంలోని తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలతో పాటు మరెన్నో పరిష్కరించేందుకు నూతన చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో భూమి సంబంధిత సమస్యల ఆర్జీలను తీసుకుని అధికారులు అక్కడే పరిశీలించి పరిష్కరిస్తారని చల్లా నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవనీత, ఆర్ఐ స్వర్ణ కుమారి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాదయ్య, ఎండి షరీఫ్, గణపురం రాజు, బోర్ర దయాకర్, ఒడ్డుమోని దావీద్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# కొందుర్గుకు 200 ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం
### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** కొందుర్గు మండల కేంద్రానికి 200 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటి చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారుల ఇండ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కొందుర్గు మండల కేంద్రాన్ని సందర్శించడం జరిగిందని,అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తానని, మాట ఇచ్చానని, అందులో భాగంగా మొదటి విడితగా 90 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన 110 ఇండ్లను అర్హులైన పేదలకు త్వరలోనే మంజూరు చేస్తామని,ఇండ్ల స్థలాలు లేనివారందరికి, కొందుర్గు మండల కేంద్రంలో మాడల్ కాలనీని ఏర్పాటు చేసి, ఇండ్లను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. త్వరలోనే ఎలికట్ట చౌరస్థా నుంచి పరిగి రోడ్డును ఫోర్‌లైన్ రోడ్డుగా మార్చడం జరుగుతుందని, ఇంటిగ్రేటెడ్ పాఠశాల టెండర్లు పూర్తి అయ్యాయని, త్వరలోనే నిర్మాణం పనులు కూడా ప్రారంభం అవుతాయాని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఫోర్ లైన్ రోడ్డు ఏర్పాటుతో కొందుర్గు మండలం రూపురేఖలు మారుతాయని అన్నారు. అనంతరం ఇందిరమ్మ లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మెన్ విష్ణువర్థన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఎ కృష్ణారెడ్డి, షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్, నాయకులు కావలి యాదయ్య, కె రాములు గౌడ్, సయ్యద్ సాధిక్, బి రవి, ఫయిమొద్దిన్, బి నరేందర్, బి యాదయ్య, మంగులాల్ నాయక్, సిర్ప మల్లయ్య, మల్లేష్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, పురుషోత్తంరెడ్డి, జితేదర్‌రెడ్డి, కె జాహంగీర్, అంజిరెడ్డి, ప్రసాద్, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, చెవెళ్ల కృష్ణయ్య, రాయికంటి రామస్వామి, జంగయ్య, జిబి కృష్ణ, జి అనిల్ గౌడ్, జి నరేందర్ గౌడ్, రామకృష్ణాగౌడ్, సుదర్శన్ గౌడ్, బి మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

### భూసమస్యల పరిష్కరించేందుకు కృషి

**కొత్తూరు:** రెవిన్యూ అధికారులు మానవీయ కోణంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మంగళవారం కొత్తూరు మండల పరిధిలోని ఎస్‌బిపల్లి గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో చేపట్టిన రెవిన్యూ సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ్మా, తహశీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, లింగారం సురేష్ గౌడ్, ఎస్‌బిపల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, ఆర్ఐ సంజీవతోపాటు రైతులు పాల్గొన్నారు.

## జెఇఇ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 పరీక్ష ఫలితాల్లో దిల్‌షుఖ్‌నగర్ గడ్డిఅన్నారం బ్రాంచ్‌కు చెందిన నారాయణ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించడం అభినందనీయంగా ఉందని కళాశాల కోర్ డీన్ రాధాకృష్ణ అన్నారు. మంగళవారం కళాశాలలో జెఇఇ ఫలితాల్లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఘనంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రణీల్ రాపోలు 56వ ర్యాంకుతో పాటు 500 లోపు 9 ర్యాంకులు, 1000 లోపు 19 ర్యాంకులు, 5000 లోపు 58 ర్యాంకులు, 10000 లోపు 69 ర్యాంకులు సాధించి జాతీయ స్థాయి విద్యాసంస్థలైన ఐఐటిలలో సీటు పొందడానికి అర్హత సాధించినట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా విద్యార్థులను అభినందించి వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.



## క్రీడ

18 ఏళ్ల నిరీక్షణకు తెర..




# ఆర్సీబీదే టైటిల్

ఐపిఎల్‌లో ఛాంపియన్‌గా నిలవాలనుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. మూడుసార్లు ఆఖరి మెట్టుమీద తడబడిన ఆర్సీబీ ఎట్టకేలకు ట్రోఫీని ముద్దాడింది. అహ్మదాబాద్‌లో ఉత్కంఠగా సాగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను 6 పరుగుల తేడాతో ఓడించి విజేతగా అవతరించింది. విరాట్ కోహ్లీ(43), జితేశ్ శర్మ(24) మెరుపులతో 190 రన్స్ కొట్టిన బెంగళూరు.. కృనాల్ పాండ్యా(217) రాణించడంతో పంజాబ్‌ను కట్టడి చేసింది. శశాంక్ సింగ్(61 నాటౌట్) చివరిదాకా పోరాడినా ఓటమిని తప్పించలేకపోయాడు. చివరి ఓవర్లో శశాంక్ 22 సిక్సర్లతో చెలరేగినా.. బెంగళూరు విజయం ఖాయమైంది. బెంగళూరు నిర్దేశించిన భారీ ఛేదనలో పంజాబ్ ఓపెనర్లు దూకుడుగా ఆడారు. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న ప్రియాన్ష్ ఆర్య(24) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అయితే.. ప్రభ్‌సిమ్రన్(26) సింగ్‌కు 9 పరుగుల వద్ద లైఫ్ లభించింది. హేజిల్‌వుడ్ ఓవర్లో అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను షెపర్డ్ నేలపాలు చేశాడు. చేతుల్లో పడిన బంతిని ఒడిసి పట్టుకోలేకపోయాడు. ఆ తర్వాత హేజిల్‌వుడ్ ఓవర్లో వరుసగా 2 ఫోర్లు బాదిన ప్రియాన్ష్.. చివరకు అతడి ఓవర్లోనే వెనుదిరిగాడు. పవర్ ప్లేలో 52 రన్స్ చేసిన పంజాబ్ పటిష్ట స్థితిలో ఉంది. కానీ, కృనాల్ పాండ్యా ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ భువనేశ్వర్‌కు తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం వచ్చిన వచ్చిన శ్రేయాస్ అయ్యర్(1) నిరాశపరిచాడు. క్వాలిఫయర్ 2లో అజేయ అర్ధ శతకంతో జట్టును గెలిపించిన అతడు షెపర్డ్ బౌలింగ్‌లో బంతిని థర్డ్ మ్యాన్ దిశగా ఆడబోయి వికెట్ కీపర్ జితేశ్ చేతికి చిక్కాడు. ఆ షాక్ నుంచి తేరుకునే లోపే ఇంగ్లిస్‌ను కృనాల్ ఔట్ చేయగా 94 వద్ద నాలుగో వికెట్ పడింది. ప్రధాన బ్యాటర్లు పెవిలియన్ చేరగా ఒత్తిడిలో పడిన పంజాబ్‌ను గెలిపించే బాధ్యత తీసుకున్నారు. అప్పటికీ విజయానికి 42 బంతుల్లో 90 పరుగులు కావాలి. ఆ దశలో షెపర్డ్ ఓవర్లో నేహాల్ వధేరా(15)లాంగాఫ్‌లో భారీ సిక్సర్ బాదాడు. అనంతరం హేజిల్‌వుడ్ వేసిన 16 వ ఓవర్లో స్లో బాల్‌ను శశాంక్ సింగ్() అలవోకగా స్టాండ్స్‌లోకి పంపాడు. చివరి బంతిని కూడా సిక్సర్‌గా మలవడంతో వరుసగా రెండు ఓవర్లలో 13 రన్స్ వచ్చాయి. ఐదో వికెట్‌కు 38 రన్స్ జోడించిన నేహాల్‌ను భువీ ఔట్ చేసి.. మార్కస్ స్టోయినిస్()ను కూడా వెనక్కి పంపి ఆర్సీబీని పోటీలోకి తెచ్చాడు. అజ్మతుల్లా ఒమర్ జాయ్(0)ను దయాల్ డకౌట్ చేయగా పంజాబ్ ఓటమి అంచున నిలిచింది. చివరి రెండు ఓవర్లలో 42 రన్స్ అవసరం కాగా.. శశాంక్ సింగ్(0) సిక్సర్లతో చెలరేగాడు. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో 6, 4, 6, 6 బాది అర్ధ శతకం సాధించాడు. కానీ, ఆర్సీబీ 6 పరుగుల తేడాతో ఛాంపియన్‌గా అవతరించింది.

ఐపిఎల్ 18వ సీజన్ ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు తడబడ్డారు. పంజాబ్ కింగ్స్ పేసర్ కైలీ జేమీసన్(348), అర్ష్‌దీప్ సింగ్(340)లు విజృంభించడంతో పెద్ద స్కోర్ చేయలేకపోయారు. డేంజరస్ ఫిల్ సాల్ట్(16)విఫలం కాగా.. రజత్ పాటిదార్(26)ను ఔట్ చేసిన జేమీసన్ బెంగళూరును దెబ్బకొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా విరాట్ కోహ్లీ(43) కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో జితేశ్ శర్మ(24), ధనాధన్ ఆడాడు. జేమీసన్ వేసిన 17వ ఓవర్లో.. రెచ్చిపోయిన జితేశ్ మూడు సిక్సర్లతో 23 రన్స్ పిండుకున్నాడు. అతడి మెరుపులతో ఆర్సీబీ స్కోర్ 170కి చేరుకుంది. మరో మూడు ఓవర్లు ఈ ఇద్దరూ నిలబడితే 200 ప్లస్ ఖాయం అనిపించింది. కానీ, జేమీసన్ ఓవర్లో లివింగ్‌స్టోన్ ఔట్ కాగా.. ఆ తర్వాత జితేశ్‌ను విజయ్‌కుమార్ బౌల్డ్ చేసి ఆర్సీబీ భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు. అయితే.. అజ్మతుల్లా వేసిన 19వ ఓవర్లో రొమారియో షెపర్డ్17) వరుసగా 4, 6 బాదాడు. కానీ, అర్ష్‌దీప్ చివరి ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయడంతో ఆర్సీబీ 190కే పరిమితమైంది.

## విజేత ప్రైజ్‌మనీ?

ఐపిఎల్ 2025 సీజన్ తుది దశకు చేరుకుంది. మరి కొద్ది క్షణాల్లో ప్రారంభమయ్యే ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ), పంజాబ్ కింగ్స్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. ఈ రెండు జట్లు ఫైనల్ రావడంతో ఐపీఎల్‌లో కొత్త ఛాంపియన్ అవతరించబోతుంది. ఆర్సీబీకి ఇది నాలుగో ఫైనల్ కాగా.. పంజాబ్ కింగ్స్‌కు రెండోది. గతంలో ఆర్సీబీ 2009, 2011, 2016 సీజన్లలో ఫైనల్ చేరి తృటిలో టైటిల్ కోల్పోయింది. మరోవైపు పంజాబ్ కింగ్స్ 2014లో ఫైనల్లో కేకేఆర్ చేతిలో ఓటమిపాలైంది. 18 ఏళ్లుగా ఆర్సీబీకి ఆడుతున్న విరాట్ కోహ్లీ టైటిల్ అందుకోవాలని ఆ జట్టు ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. గతేడాది కేకేఆర్ కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించిన శ్రేయస్ అయ్యర్.. ఈ సారి పంజాబ్ కింగ్స్‌ను విజేతగా నిలబెట్టాలనే కసితో ఉన్నాడు. అయితే ఐపీఎల్ 2025లో ఛాంపియన్‌గా నిలిచే జట్టుకు రూ. 20 కోట్లు, రన్నరప్‌కు రూ. 13 కోట్ల ప్రైజ్‌మనీని బీసీసీఐ అందజేయనుంది.

క్వాలిఫయర్2లో ఓడిన ముంబై ఇండియన్స్‌కు రూ. 7 కోట్లు, ఎలిమినేటర్‌లో ఓడిన గుజరాత్ టైటాన్స్‌కు రూ. 6.5 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ ప్లేయర్లకు పది లక్షల చొప్పున నగదు పురస్కారం లభించనుంది. ఎమర్జింగ్ ప్లేయర్, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్, అత్యధిక స్ట్రైకరేట్, అత్యధిక సిక్స్‌లు కొట్టిన ఆటగాళ్లకు కూడా రూ. 10 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ దక్కుతుంది. ఐపీఎల్ 2022 సీజన్ నుంచి బీసీసీఐ ప్రైజ్‌మనీ అమౌంట్‌ను మార్చలేదు.

### ఐపీఎల్ ప్రైజ్‌మనీ వివరాలు..

విజేత: రూ. 20 కోట్లు
రన్నరప్ : రూ.13 కోట్లు
క్వాలిఫైయర్ 2లో ఓడిపోయిన ముంబై ఇండియన్స్‌కు రూ.7 కోట్లు
ఎలిమినేటర్‌లో ఓడిపోయిన గుజరాత్ టైటాన్స్‌కు రూ.6.5 కోట్లు

### వ్యక్తిగత అవార్డుల విజేతల ప్రైజ్‌మనీ

ఆరెంజ్ క్యాప్ (అత్యధిక పరుగులు): రూ.10 లక్షలు
పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు): రూ.10 లక్షలు
ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్: రూ.10 లక్షలు
మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్: రూ.10 లక్షలు
సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్: రూ.10 లక్షలు
అత్యధిక సిక్స్‌లు: రూ.10 లక్షలు



## శేఖర్ కమ్ములకు 'చిరు' కానుక

మెగాస్టార్ చిరంజీవి దర్శకుడు శేఖర్ కమ్ములకు ఓ కాస్ట్లీ పెన్ను బహుమతి ఇచ్చారు. చిరంజీవి నివాసానికి శేఖర్ కమ్ములను పిలిపించుకుని మరీ గిఫ్ట్ ఇచ్చారు. మీ లాంటి ఒక అభిమాని ఉండటం ఎంతో ఆనందకరం. మీ ప్రస్థానానికి స్ఫూర్తినిచ్చానని తెలిసి మరింతగా సంతోషించాను. మీ సినిమాలు అంటే నాకు చాలా ఇష్టం. ఫిలిం మేకింగ్‌లో మీకంటూ ఓ ప్రత్యేకమైన శైలిని క్రియేట్ చేసుకున్నారు. మరో ఇరవై అయిదేళ్ళ పాటు మంచి మంచి సినిమాలు రాస్తూ, తీస్తూ మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. శేఖర్ కమ్ములకు చిరంజీవి సంతకం చేసిన పెన్నును బహూకరించారు. ఆనంద్, గోదావరి, ఫిదా లాంటి ఫీల్ గుడ్ సినిమాలను తెరకెక్కించిన శేఖర్ కమ్ముల ఇండస్ట్రీ లో తన సినిమావకు ఓ సెపరేట్ ప్రేక్షకులను క్రియేట్ చేసుకున్నారు. తాజాగా ధనుష్, నాగార్జున తో కలిసి కుబేర సినిమాను శేఖర్ కమ్ముల రూపొందిస్తున్నారు. చిరంజీవి నుంచి బహుమతి అందుకున్న శేఖర్ కమ్ముల ఆనందానికి అవధులు లేవని చెప్పొచ్చు.




## గ్రాండ్‌గా 'బద్మాషులు' ప్రీ రిలీజ్

కొత్త పాత నటీనటులతో తెరకెక్కించిన చిత్రం 'బద్మాషులు'. మహేష్ చింతల, విద్యాసాగర్, బలగం సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ కవితా శ్రీరంగం, దీక్ష కోటేశ్వర్ కీలకపాత్రలో నటించారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో బి బాలకృష్ణ, రమా శంకర్ నిర్మించారు. హాస్యం, వినోదాత్మకంగా తెరకెక్కించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. దర్శకులు తరుణ్ భాస్కర్, మాలిక్ రామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమాను ఈ నెల 6న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ.. మహేష్ చింతలకి అవకాశం వచ్చినట్లే చిత్ర పరిశ్రమంలో ప్రతి ఒక్కరికి ఒక రోజు వస్తుంది. ఒక శుక్రవారం రోజు ప్రతి ఒక్కరు స్టార్లు అయ్యే అవకాశం ఉంటుంది. కాకపోతే దానికి కాస్త టైం పడుతుంది. బద్మాషులు చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరూ స్టార్లు కావాలని ఆశిస్తున్నా అని అన్నారు.

ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ చాలామంది కామెడీ ని చాలా తేలిగ్గా తీసిపారేస్తుంటారు. కానీ ఆ కామెడీ సన్నివేశాలు వెనుక ఎంత కష్టం, నిజాయితీ దాగుందనేది చూసే వాళ్లకి అర్థం కాదు. ఆ సీన్లు రాసిన వాళ్లకే తెలుస్తుంది. పెళ్లిచూపులు చిత్రంలో కామెడీ సన్నివేశాలు రాస్తున్నప్పుడు మా నాన్న ఆరోగ్యం చాలా సీరియస్‌గా ఉంది. చాలా టెన్షన్ పడుతూ రాత్రి వేళల్లో ఆ సన్నివేశాలు రాశాను. మన టాలెంట్ తో నిజాయితీగా ప్రయత్నిస్తే మన కష్టానికి వడ్డీతో సహా ప్రతిఫలం దక్కుతుంది. మా నాన్నకి కోపం వచ్చినప్పుడు నన్ను కామన్‌గా తిట్టే పదం బద్మాష్. బద్మాషులు చిత్రం మంచి విజయం సాధించాలి. ఆరవ తేదీ ప్రతి ఒక్కరు ఈ చిత్రాన్ని చూడండి అని తరుణ్ భాస్కర్ అన్నారు.

## రీల్

## డిసెంబర్ 5న 'రాజా సాబ్' విడుదల

ఈ నెల 16న టీజర్




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో రూపొందుతున్న 'రాజా సాబ్' రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 16న ఉదయం 10.52 నిమిషాలకు 'రాజా సాబ్' టీజర్ విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా పోస్టర్ విడుదల చేశారు. ప్రభాస్ డబ్బులతో నిండి ఉన్న గదిలో ఫెరోషియస్‌గా కనిపించడం ఆసక్తి కలిగిస్తోంది. మరోవైపు 'రాజా సాబ్' రిలీజ్ డేట్, టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'రాజా సాబ్' సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో రాజీ పడకుండా నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ సినిమాను దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా మీద ఇండస్ట్రీలోనూ ఆసక్తి ఏర్పడుతోంది. 'రాజా సాబ్' సినిమాతో ప్రేక్షకులకు ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని డైరెక్టర్ మారుతి తపిస్తున్నారు. ప్రభాస్ సరసన, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు కార్తీక్ పళని కెమెరామెన్‌గా పని పని చేస్తున్నారు.

## సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'కలివి వనం'

అడవిలో జరిగే ఓ థ్రిల్లర్ కథను తీసుకుని తెరకెక్కించిన సినిమా 'కలివి వనం'. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతల్లో ఒకరైన మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. అడవిలో జరిగే ఒక సంఘటన ఆధారంగా సస్పెన్స్, థ్రిల్లర్ కథగా ఈ సినిమాను రూపొందించామని దర్శకుడు రాజ్ నరేంద్ర చెప్పారు. ఇందులో హాస్య నటుడు రఘుబాబు పాత్ర సినిమాకు ఎంతో కీలకమైందన్నారు. మదిన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు విష్ణువర్ధన్ రెడ్డి, మల్లి కార్జున్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. కాసర్ల శ్యామ్, మాట్లా తిరుపతి, కమల్ ఇస్లావత్ పాటలు రాశారు. అన్ని పనులు పూర్తి చేసి నెలాఖరులో గాని, వచ్చే నెలలో గాని విడుదల చేయనున్నారు.




# జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య విద్యార్థులదే ఆధిపత్యం

ఓపెన్ కేటగిరిలో టాప్ 10 లోపు, టాప్ 100లోపు అత్యధిక ఆలిండియా ర్యాంకులు శ్రీచైతన్యవే




**హైదరాబాద్ :** యావత్ భారత దేశంలో విస్తరించిన శ్రీచైతన్య విద్యాసంస్థకు సోమవారం విడుదలైన ఐఐటి–జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్‌తో వచ్చింది. ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 3, 5, 6, 11 ర్యాంకులతో శ్రీచైతన్య తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 300కి 300 మార్కులతో వంగాల అజయ్ రెడ్డి ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. టాప్ ర్యాంకుల్లోనూ, టోటల్ ర్యాంకుల్లోనూ తిరుగులేని అగ్రస్థానంతో శ్రీచైతన్య దూసుకెళ్ళింది. ఆలిండియా 1వ ర్యాంక్ డిజి రుత్విక్‌సాయి, ఆలిండియ ఓపెన్ కేటగిరిలో 3 వ ర్యాంక్ ఎంఎ జిధుసైన్, 5వ ర్యాంక్ ఉజ్వల్ కేసరి, 6వ ర్యాంక్ అక్షత్‌కుమార్,11వ ర్యాంక్ అర్నవ్ నిగమ్, 16వ ర్యాంక్ దేవ్‌దత్తు మాఝీ, 18వ ర్యాంక్ రుత్విక్ సాయి, 19వ ర్యాంక్ వంగాల అజయ్ రెడ్డి సాధించారు. ఓపెన్ క్యాటగిరీలో టాప్ 10 లోపు 3 ర్యాంకులతో పాటు, 20 లోపు 7 ర్యాంకులు, 50 లోపు 19 ర్యాంకులు, 100 లోపు 29 ర్యాంకులు సాధించారు. ఈసారి కూడా ఐఐటీల్లో మొదటి వరుసతో పాటు మొత్తం సీట్లలోనూ అత్యధిక శాతం శ్రీచైతన్య విద్యార్థులదేనని విద్యాసంస్థల సిఇఒ అండ్ అకడమిక్ డైరెక్టర్ సుష్మ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో నిష్ణాతులైన టాప్ ఫ్యాకల్టీతో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో నాణ్యమైన శిక్షణను అందిస్తూ... అనితరసాధ్యమైన ప్రోగ్రాములతో, మైక్రోషెడ్యూల్స్, ఆలిండియా టెస్ట్ సీరీస్ ప్రోగ్రాములతో మాత్రమే ఇంతటి అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. అందువల్లే ఐఐటి ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులు శ్రీచైతన్యనే కోరుకుంటున్నారని వివరించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సుష్మ అభినందించారు.

అంగన్‌వాడీ టీచర్ల, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాల పెంపు

# ఎఐటియుసి పోరాటాల ఫలితమే

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణ కుమారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాల పెంపు అని, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి అన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ధన్యవాదాలు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ విమరణ ప్రయోజనాలను లక్ష నుండి 2 లక్షలకు, హెల్పర్స్‌కు రూ. 50 వేల నుండి లక్ష రూపాయాలకు పెంచడంతో పాటు 60 ఏళ్లు దాటిన వారికి అనారోగ్యం ఇతర కారణాల వల్ల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునే అవకాశం, కల్పించడంతోపాటు వారికి ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం జి.నెం.8ని విడుదల చేయటం పట్ల ముఖ్యమంత్రి రేవంతరెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని, పెన్షన్, బీమా పథకం, ఇయస్ఐ, పిఎఫ్ తదితర అనేక డిమాండ్లపై రాష్ట్ర వ్యాపితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మినీ టీచర్లు ఎఐటియుసి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించారని ఇందుకు తగ్గ ఫలం జిఓ ద్వారా లభించిందన్నారు. అయితే 2024 జులై 1 నుండి వర్తింప చేస్తామని ఇచ్చిన హామీలను ఈ జి.ఓ.లో పొందుపరచలేదని, దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. ఆసరా పెన్షన్ కాకుండా ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు 24 రోజుల సమ్మె కాలంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.5 ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించే విధంగా ప్రభుత్వ చర్యలు చేపట్టాలని కరుణ కుమారి కోరారు.

## చోరీ నియంత్రణలపై దృష్టి పెట్టండి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీల నియంత్రణపై ప్రతి పోలీస్ అధికారి నజర్ పెట్టాలని వరంగల్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా ఆస్తి నేరాలపై సమీక్షా జరిపారు. ఇందులో ప్రధానంగా పెండింగ్ చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్, సొమ్ము రికవరీ, పెండింగ్‌లో వున్న చోరీ కేసులు, నిందితుల అరెస్ట్ పై పిసి సమీక్ష జరపడంతో పాటు, సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న ఇతర కేసులపై సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పో లీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. రాబోవు బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకొని మూగజీవాల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టడం పాటు, పండుగ వేళ దర్గాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని. వరంగల్‌కు వున్న కీర్తి ప్రతిష్టలకు తగ్గట్లుగా పోలీసింగ్ వుండాలి. ప్రతి పోలీస్ బేసిక్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగాం ఏఎస్పీ చెతన్య, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

ఆలిండియా టాప్ 10లో 5 ర్యాంకులతో

# నారాయణ ఏకఛత్రాధిపత్యం!



**హైదరాబాద్ :** జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో నారాయణ విద్యార్థులు టాప్ ర్యాంకులతో మరోసారి సత్తాచాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మాజిద్ హుస్సేన్, 3వ ర్యాంక్, పార్ట్ మందర్ వార్ధక్, 4వ ర్యాంకు, అక్షత్ చౌరాసియా, 6వ ర్యాంక్, సాహిల్ డియో, 7వ ర్యాంక్, వడ్లమూడి లోకేష్, 10 వ ర్యాంక్‌తో టాప్ 10 ర్యాంకుల్లో 5 ర్యాంకులు నారాయణ కైవశం చేసుకుంది. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 100 లోపు 43 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి. సింధూరనారాయణ, పి. శరణినారాయణ తెలిపారు. అలాగే ఆలిండియా అన్ని కేటగిరీల్లో 1, 2, 2, 2, 4, 5, 7, 8, 10, 10 వంటి 10లోపు 10ర్యాంకులు, 50లోపు 42 ర్యాంకులు, 100 లోపు 75 ర్యాంకులను కైవసం చేసుకుని ఐఐటి ఆశయాలను సాకారం చేయటంలో వేరెవ్వరూ నారాయణకు సాటిలేరని, సాటిరారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 180000 మందికి పైగా విద్యార్థులు పోటీపడిన ఈ పరీక్షా ఫలితాలలో అత్యధిక సంఖ్యలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మ్రోగించారని పేర్కొన్నారు టాప్ ర్యాంకులు సాధించిన వారికి అత్యధిక సంఖ్యలో నారాయణ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులే ఉన్నారన్నారు.ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలం లోని ముజ్జుగూడెం, భైరవునిపల్లి, బోదులబండ, నేలకొండపల్లి, చెన్నారం గ్రామాలలో బుధవారం పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తొలి విడతగా 4.50 లక్షల ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతీనియోజకవర్గంలో 3,500 ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. శిక్ష ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎవరూ కూడ ఆ భద్రత భావం కు గురికావద్దని సూచించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తామని పేర్కోన్నారు. పేదోడి సొంతింటి కల నెరవేర్చటం ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్వెనపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, భద్రయ్య, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, కె.హనుమంతరావు, వంగవీటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com